
ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక



Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 16.07.2026 | సంపుటి :12 సంచిక : 357 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# కేంద్రానికి కనికరం లేదా..?

COCKROACH JANTA PARTY

# యువత ప్రాణాలతో చెలగాటమా?

**24 రోజుల ఉద్యమం... 17 రోజుల నిరాహార దీక్ష...**
**అయినా స్పందించని ప్రభుత్వం**

**సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమం...**
**8.5 కిలోలు తగ్గిన బరువు**
**యువత గళం వినిపించినా... వినిపించుకోని అధికార చెవులు**

న్యూఢిల్లీ(జనంసాక్షి): మే నెలలో లక్షలాది మంది విద్యార్థులను ప్రభావితం చేసిన పరీక్షా పత్రాల లీకేజీ ఘటనపై బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ యువత చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం గా వాంగ్‌చు క్ ఈ నిరాహార దీక్ష చేపట్టారు. ఇప్ప టికే ఆయ న దాదాపు 8.5 కిలోల బరువు కోల్పోయారు. రక్తంలో చక్కెర స్థాయి కూడా ప్రమాదకర స్థాయికి పడిపోయిందని వైద్యులు చెబుతున్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందిం చకపో వడం మానవత్వానికే ప్రశ్నార్థకంగా మారింది. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, నిరాహార దీక్షలో పాల్గొన్న ఓ యువకుడు స్పృహ తప్పి ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. మరెవరికైనా ప్రాణాపాయం జరిగితే ఆ బాధ్యత ఎవరిది? ప్రజాస్వా మ్యబద్ధంగా జరుగుతున్న ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వమే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఉద్యమ నిర్వాహకులు పదేపదే ప్రాణాపాయం ఉందని హెచ్చరిస్తున్నా, అధికారయంత్రాంగం మాత్రం మౌనాన్నే సమా ధా నంగా ఎంచుకుంది.మరోవైపు ప్రధాన స్రవంతి మాధ్యమాల వైఖరి కూడా తీవ్ర విమర్శలకు గురవుతోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ ఉద్యమానికి, ప్రాణాల పణంగా జరుగు తున్న నిరాహార దీక్షకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా చిన్న చూపు చూడడం బాధాకరం. అధికారాలను ప్రశ్నించాల్సిన బాధ్య తను విస్మరించి, ఇలాంటి ప్రజా సమస్యలను పక్కన పెట్టడం ప్రజాస్వామ్యానికి, పత్రికారంగ విశ్వసనీయతకు మచ్చగా నిలుస్తోంది. ప్రజల గళాన్ని వినిపించాల్సిన వేదికలే మౌనం వహిస్తే, ప్రజాస్వామ్యానికి అసలు అర్థమేంటనే ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోంది.

**న్యూఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా కొనసాగుతున్న ఈ ఉద్యమం నేటి కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి, ప్రజాస్వామ్య విలువల పట్ల అధికారుల వైఖరికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. పరీక్షా పత్రాల లీకేజీ ఘటనలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న యువత స్వరాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. జూన్ 28 నుంచి నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. దీక్ష 17వ రోజుకు చేరినా, ప్రభుత్వ పెద్దల నుంచి కనీస స్పందన కనిపించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.**



# కాళేశ్వరంపై కక్షగట్టారు

- రైతుల విషయంలో ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణ సర్కారు ఇవ్వట్లేదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు.
- గతంలో పోలవరంను పట్టించుకోని ఎన్డీఎస్‌ఏ కాళేశ్వరంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది
- మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్‌ఏ కాదు.. ఎన్డీఏ ఢిల్లీలో మీడియాతో కేటీఆర్



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం మిగతా 2లో..

# ప్రజలు అధికారమిస్తే కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు

- ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి అన్ని రంగాల్లో వైఫల్యాలకు
- కారణమయ్యారు
- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి):ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ పదేళ్ల పాలనను 'ఫాంహౌస్ పాలన'గా ఆయన అభివర్ణించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినియోగించుకోకుండా ఫాంహౌస్‌కే ఆయన పరిమితమయ్యారని విమర్శించారు. మిగతా 2లో..



# విద్యతోనే వికాసం

**ఇదే తెలంగాణ భవిష్యత్తు'.. అందుకే విద్యాశాఖ నా వద్దే!**

- తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్తు.. విద్యే నా తొలి ప్రాధాన్యం"
- ప్రభుత్వ పాఠశాలలే ప్రతిభకు పునాది..
- విద్యారంగంలో తెలంగాణను నంబర్-1గా నిలబెడతాం,..
- కొత్తకోట బాలికల జడ్పీహెచ్‌ఎస్ నూతన భవనం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



వనపర్తి బ్యూరో(జనంసాక్షి):రాష్ట్ర భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది.. అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజే విద్యాశాఖను నా వద్దే ఉంచుకున్నా" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యంత అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యారంగాన్ని సమూలంగా మార్చి తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో సీఎస్‌ఆర్ నిధులతో రూ.1.77 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని బుధవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి విద్య, ఉపాధి, క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలపై దిశానిర్దేశం చేశారు. అదే వేదికపై సాగునీరు, విద్య, మౌలిక వసతులకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు దెబ్బతిన్నాయని, అదే కారణంగా లక్షలాది మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లాల్సి వచ్చిందని సీఎం విమర్శించారు. విద్యా సంస్కరణలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలతో ప్రభుత్వ విద్యకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తున్నామని తెలిపారు. దేశంలో 35వ స్థానంలో ఉన్న తెలంగాణ విద్యారంగం ప్రస్తుతం 18వ స్థానానికి చేరిందని, త్వరలోనే నంబర్-1 స్థానానికి తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి "తెలంగాణ కిట్" పేరుతో తొమ్మిది వస్తువులు అందజేస్తామని, మిగతా 2లో..

పాలమూరును పారిశ్రామికంగా

# అగ్రగామిగా నిలుపుతాం

- అమరరాజరాకతో మహబూబ్‌నగర్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఎదుగుతోంది
- భవిష్యత్తులో వేలాది మందికి ఉపాధి అవకాశాలు
- గిగా మాన్యుఫ్యాక్చరింగ్ కారిడార్‌కు శ్రీకారం
- మహబూబ్‌నగర్ దివిటిపల్లి ఐటి పార్క్‌లో సంస్థ కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ ప్రారంభం

మహబూబ్ నగర్ బ్యూరో జూలై 15(జనంసాక్షి):

2లో..

ఫ్యూచర్ సిటీలో

# అమెజాన్‌ది కీలక పాత్ర

- 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

**అటు అమెరికా.. ఇటు ఇరాన్**

# ఎడాపెడా దాడులు

**ఇరాన్‌పై మొదటిసారి పగటిపూట దాడులు చేసిన అగ్రరాజ్యం**

- సైనిక లక్ష్యాలపై 7 గంటలు ఏకధాటిగా దాడులు
- వచ్చేవారం మరింత భీకరమంటూ ట్రంప్ వార్నింగ్
- అమెరికాకు దీటుగా బదులిచ్చిన ఇరాన్
- గల్ఫ్ దేశాల్లోని ఆ దేశ స్థావరాలపై టెహ్రాన్ దాడులు
- అమెరికా దురాగతాలు ముగిసేవరకూ హర్మూజ్ మూసే ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరిక



టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధం తలెత్తే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా-ఇరాన్ మధ్య దాడులు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు.. ఈ ఉద్రిక్తతలను మరింత పెంచేలా ఉన్నాయి. శాంతి చర్చలకు టెహ్రాన్ సహకరించకపోతే.. వచ్చేవారం నుంచి సైనిక దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. తాజాగా సిచువేషన్ రూమ్‌లో ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ట్రంప్ ప్రకటన వెలువడిన కాసేపటికే.. ఇరాన్‌పై అమెరికా మరో దఫా దాడులు ప్రారంభించింది. ఈ మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అయితే, ఇటీవలి కాలంలో ఎక్కువగా రాత్రివేళల్లోనే దాడులు చేసిన అగ్రరాజ్యం.. ఈసారి పగటిపూటే విరుచుకుపడటం గమనార్హం. హర్మూజ్ జలసంధి, ఇరాన్ తీర ప్రాంతాల్లోని టెహ్రాన్ సైనిక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా డ్రోన్లతో దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇరాన్ రక్షణ, మిగతా 2లో..

**నిజమేనా!**

# డిలిమిటేషన్ బిల్లు నిర్ణయం కాలేదట!

న్యూఢిల్లీ(జనంసాక్షి): డీలిమిటేషన్ బిల్లుపై తమ పార్టీ ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియాసూలే స్పష్టం చేశారు. ఈ ప్రచారం టీకప్పులోతుపాను లాంటిదేనని పేర్కొన్నారు.

మిగతా 2లో..



# సర్ గడువు పొడిగింపు



**ఆగస్టు 3 వరకు కొనసాగించిన ఎన్నికల సంఘం**




హైదరాబాద్,జూలై15(జనంసాక్షి): తెలంగాణలో సర్ నమోదు ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించింది. సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ, అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ప్రకటించింది. ఈనెల 24 వరకు ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఆగస్టు 3వ తేదీవరకు పొడిగించింది. అనేక జిల్లాల్లో సర్‌పై అవగాహన లేక మందకొడిగా కొనసాగుతుండగా గడువు సమీపిస్తుండడంతో అనేక రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు అందించాయి దీంతో స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువు పొడిగింపును ప్రకటించింది. అర్హత తేదీగా అక్టోబర్ 1వ తేదీ నాటికి ఓటర్ల వివరాల సవరణను పరిగణనలోకి తీసుకుంటూ నూతన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం మిగతా 9లో..

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ



**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన**

హైదరాబాద్,జులై15(జనంసాక్షి): ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ÷నైల్ అని స్పష్టం చేశారు.ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు మిగతా 2లో..

డిజిటల్ మూల్యాంకనంతో విద్యార్థుల్లో

# తీవ్ర ఆందోళన: సుప్రీం

2లో..



# ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర

- మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

హైదరాబాద్,జులై15(జనంసాక్షి): రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమి లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్‌ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్‌ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది. 12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యతోనే వికాసం

ఇందుకోసం రూ.1,000 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.08 లక్షలు వెచ్చిస్తోందని, విద్యార్థులు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ప్రపంచ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే జర్మన్, జపనీస్, కొరియన్ వంటి విదేశీ భాషలు నేర్చుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన వారు క్రీడల్లో రాణించి దేశానికి పేరు తీసుకురావాలని, మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్ వంటి క్రీడాకారుల విజయాలను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల హామీ మేరకు కొత్తకోట బాలికల పాఠశాలకు నూతన భవనం నిర్మించామని తెలిపారు. దేవరకద్రకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రం మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ, కొత్తకోటకు డిగ్రీ కళాశాల, 50 పడకల ఆసుపత్రి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, అగ్నిమాపక కేంద్రాలు, హాస్టళ్లు, మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.100 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.



# పాలమూరును పారిశ్రామికంగా అగ్రగామిగా నిలుపుతాం

**మహబూబ్ నగర్ బ్యూరో జూలై 15(జనంసాక్షి):** బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా, దివిటిపల్లి సమీపంలోని అమరరాజా గిగా కారిడార్ ప్రాజెక్టులో భాగంగా అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్‌లో నూతనంగా నిర్మించి న కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరరాజా సంస్థ దాదాపు నాలుగు దశాబ్దాల విజయవంతమైన ప్రయాణం అనంతరం తన తొలి భారీ పెట్టుబడిని తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానంపై పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. అమరరాజా ప్రపంచస్థాయి సంస్థగా ఎదిగి చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల కంపెనీలతో పోటీపడుతున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో భారత్ ప్రపంచ స్థాయిలో ఎదగాలంటే అమరరాజా వంటి సాంకేతిక సంస్థలను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వాతావరణ మార్పులు, కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కీలకమని, వాటికి అవసరమైన అత్యాధునిక ఈవీ బ్యాటరీల తయారీలో తెలంగాణ ప్రధాన కేంద్రంగా అవతరిస్తోందని అన్నారు. మహబూబ్‌నగర్‌లో 32 గిగావాట్ గంటల సామర్థ్యంతో అమరరాజా కంపెనీలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక ఈవీ బ్యాటరీ తయారీ యూనిట్ రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ పరిశ్రమ ద్వారా 700 మంది ఇక్కడ మహబూబ్నగర్ జిల్లా వారికి ఉపాధి లభిస్తుండగా, వారిలో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. అమర రాజా స్థాపించిన ఈ పరిశ్రమతో పాలమూరు జిల్లా రూపు రేఖలు మారుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలమైన విధానాలను మరింత బలోపేతం చేస్తూ పారదర్శక పాలన, అత్యుత్తమ మౌలిక వసతులు, పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. పారిశ్రామిక, పర్యాటక, క్రీడా రంగాలకు ప్రత్యేక విధానాలను అమలు చేస్తూ 2047 నాటికి దేశ అభివృద్ధిలో తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమి గా తీర్చిదిద్దికీలక శక్తిగా నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశ జనాభాలో తెలంగాణ కేవలం 2.5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 10 శాతం వాటా సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నదని చెప్పారు. ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలను పారిశ్రామిక, సేవారంగ, వ్యవసాయ ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి తయారీ పరిశ్రమలను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఒకప్పుడు మహబూబ్నగర్ జిల్లాను దత్తత తీసుకునే స్థాయి నుండి, ప్రస్తుతం మనమే ఇతర జిల్లాలను దత్తత తీసుకునే స్థాయికి వచ్చామన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీలు, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటుచేసి బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పాలమూరు- రంగారెడ్డికి సంబంధించి 90 టీఎంసీల నీటి కేటాయింపుకై కేంద్ర ప్రభుత్వం తో పాటు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి అవసరమైన నీటి కేటాయింపులు, అనుమతులు సాధించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలోనే పాలమూరు రైతులకు శుభవార్త అందిస్తామని తెలిపారు. అమర రాజా కంపెనీ సీఎండీ గల్లా జయదేవ్, విక్రమాదిత్య లు మాట్లాడారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ ,యువజన క్రీడల సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా,ఎస్పీ జానకి, తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరంపై కక్షగట్టారు

ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. "గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బయటపెట్టాలి. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు దిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదు?ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

## ప్రజలు అధికారమిస్తే కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు

ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పలు రంగాల్లో వైఫల్యాలకు కారణమయ్యారని పొంగులేటి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లి పాలన అందిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పొంగులేటి పేర్కొన్నారు.

## 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

**బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు వెల్లడి**

హైదరాబాద్,జూలై15(జనంసాక్షి)::వరంగల్ ఎయిర్‌పోర్టును 2028 నాటికి పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందోన్నారు. అయితే ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనంలో వరంగల్, కడప పేర్లు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది. అందులో వరంగల్ కూడా ఉంది. భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యమైంది. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తోందంటే దానికి కారణం మోదీ. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోందని రామచందర్‌రావు చెప్పారు.

## అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 5 కొత్త కోర్సులు

**హైదరాబాద్(జనంసాక్షి):** డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి కొత్తగా ఐదు కోర్సులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి వెల్లడించారు. ఈ ఐదు కోర్సులకు ప్రొఫెషనల్, అకడమిక్ రంగాల్లో డిమాండ్ ఉందని తెలిపారు. యూజీసీ ఆమోదం తెలిపిన కొత్త కోర్సుల్లో ఎంఏ ఎడ్యుకేషన్, ఎంఏ ఎడ్యుకేషన్ (స్కూల్ అడ్మినిస్ట్రేషన్), మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ ఎమ్మెస్సీ జాగ్రఫీ, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్ ) ఉన్నట్లు వివరించారు. యూజీసీ నిపుణుల కమిటీ జూన్‌లో వర్చువల్‌గా తనిఖీ చేసిందని.. వర్సిటీలోని మౌలిక వసతులు, అధ్యాపక సిబ్బంది, ఇతర అన్ని అంశాలను పరిశీలించి ఈ కోర్సులకు ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ అనుమతులు రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు ఉందన్నారు.

## షాబాద్ హత్యలకు పోలీసులే కారణం

అమరావతి(జనంసాక్షి): తెలంగాణలో పోక్సో చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. షాబాద్ హత్యల ఘటనను ఈ సందర్భంగా పవన్ ప్రస్తావించారు. పోక్సో కేసులో విచారణకు నిర్ణీత గడువు విధించాలని.. బాధితుల రక్షణకు చర్యలు తీసుకోవాలని పవన్ కోరారు. సాక్ష్యాధారాలు మాయం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. "షాబాద్ కేసులో బాధితులను కాపాడటంలో పోలీసులు విఫలమయ్యారు. పోక్సో కేసు ఉన్నా నిందితుడికి బెయిల్ ఇవ్వడం వైఫల్యమే. ఈ ఘటనలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. పోక్సో కేసులకు ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పింది" అని పవన్ పేర్కొన్నారు.

## డిలిమిటేషన్ బిల్లు నిర్ణయం కాలేదట!

ఎన్డీయే కూటమికి తాము మద్దతు ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను కొట్టిపారేశారు. ఓ జర్నలిస్టు, స్నేహితుడితో తన వాట్సప్‌లో జరిగిన వ్యక్తిగత సంభాషణను పార్టీ అధికారిక అభిప్రాయంగా ప్రచారం చేయడం సరికాదని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని.. వాటికి అన్యాయం జరగకూడదని పార్టీ భావిస్తోందని ఆమె తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచి, దానిని ఎలా అమలు చేస్తారో అధికారికంగా వెల్లడిస్తే, నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు ఇచ్చే విషయాన్ని తమ పార్టీ పరిశీలిస్తుందని చెప్పారు. బిల్లును చూడకుండానే స్పందించడం సరికాదన్నారు.

## డిజిటల్ మూల్యాంకనంతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన

**సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీబీఎస్ఈ ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానంపై విద్యార్థుల నుంచి పెరుగుతున్న ఫిర్యాదులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విధానంలో సంస్కరణలు చేపట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. డిజిటల్ మూల్యాంకన విధానంలో వ్యవస్థాగత లోపాలు కనిపిస్తున్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. సమస్య పరిష్కారానికి సహకరించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరిందిఈ విధానాన్ని సమీక్షించి సంస్కరణలు సూచించేందుకు ఎస్.రాధా చౌహాన్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు తుషార్ మెహతా వెల్లడించారు. ఈ కేసును వచ్చే వారానికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు, కమిటీ పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది.



# అటు అమెరికా.. ఇటు ఇరాన్ ఎడాపెడా దాడులు

క్షిపణి స్థావరాలను లక్ష్యంగా చేసుకుని గ్రేటర్ తున్బ్ ద్వీపంపై దాడి చేసినట్లు తెలిపింది. హర్మూజ్‌లో నౌకలపై ఇరాన్ దాడులు చేయకుండా ఆ దేశ సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడమే తమ లక్ష్యమని అగ్రరాజ్యం వెల్లడించింది.

ఇరాన్‌పై 7 గంటలు ఏకధాటిగా దాడులు: అమెరికా అమెరికా-ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతూనే ఉంది. తాజాగా ఏడు గంటల పాటు ఇరాన్‌పై ఏకధాటిగా దాడులు చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. మంగళవారం రాత్రి ఈ దాడులు ప్రారంభమయ్యాయని, హర్మూజ్ జలసంధి, ఇరాన్ తీరప్రాంతాల సమీపంలోని సైనిక లక్ష్యాలను ఢీకొట్టామని పేర్కొంది. ప్రస్తుతానికి తాజా విడత దాడులు ముగిశాయని తెలిపింది. "హర్మూజ్‌లో వాణిజ్య నౌకల లక్ష్యంగా ఇరాన్ చేస్తోన్న దాడుల సామర్థ్యాన్ని మరింత దెబ్బతీసేందుకు అమెరికా యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకల నుంచి ఆయుధాలను ప్రయోగించాం. ఏడు గంటలపాటు జరిగిన ఈ దాడుల్లో ఇరాన్ క్షిపణి, డ్రోన్ నిల్వలు, నౌకా సామర్థ్యాలు, తీర ప్రాంత రక్షణ వ్యవస్థలను టార్గెట్ చేశాం" అని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇరాన్ ఓడరేవులకు రాకపోకలు సాగించే నౌకలపై అమెరికా దళాలు దిగ్బంధనాన్ని పునః ప్రారంభించిన రోజే ఈ దాడులు జరిగాయి. వారం వ్యవధిలో ఇరాన్ ఏడు వాణిజ్య నౌకలపై దాడులు చేసిందని, ఉద్దేశపూర్వకంగా పౌరులను లక్ష్యంగా చేసుకుంటోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ విమర్శించింది. తాజా ఘర్షణల నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు కొనసాగిస్తోంది. ఇరాన్ సెంట్రల్ బ్యాంక్‌కు సంబంధించిన పలు క్రిప్టో వాలెట్లను అమెరికా ఫ్రీజ్ చేసింది. దాంతో 130 మిలియన్ల డాలర్లు నిలిచిపోయాయని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వెల్లడించారు.

అప్పటివరకు హర్మూజ్ మూసే ఉంటుంది: ఇరాన్ మరోవైపు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. అమెరికా దురాగతాలు ముగిసేవరకూ హర్మూజ్ జలసంధి మూసే ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. "ఇరాన్ దిగ్బంధనాన్ని ఉల్లంఘించి.. అమెరికాకు సహకారం అందించేందుకు ఏ నౌక కూడా సాహసించలేదు. అందుకే తాజాగా మేం ఎలాంటి దాడులు చేయలేదు" అని ప్రకటించింది. ఈ ఘర్షణ ఇలాగే కొనసాగితే.. అమెరికా, దాని మిత్రదేశాలకు చెందిన ఇంధన నౌకలు వెళ్లే మార్గాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.

మళ్లీ సిచువేషన్ రూమ్‌కు ట్రంప్ పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. హర్మూజ్ దిగ్బంధనం, ఇరాన్‌తో తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిచువేషన్ రూమ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్ సహా ఉన్నతస్థాయి సిబ్బంది ఈ భేటీకి హాజరయ్యారు. హర్మూజ్‌లో ఆటంకం లేని ప్రయాణం, అణు డిమాండ్లు అంగీకరించేలా ఇరాన్‌పై ఒత్తిడి తేచ్చేలా దాడులకు ట్రంప్ సుముఖంగా ఉన్నట్లు కనిపిస్తోన్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. గతేడాది జూన్‌లో ఇరాన్‌పై దాడుల వేళ, గతంలో కీలక ఆపరేషన్ల సమయంలో ఈ గది నుంచే అమెరికా అధ్యక్షులు పర్యవేక్షించారు. వైట్‌హౌస్‌లోని వెస్ట్ వింగ్ బేస్‌మెంట్‌లో ఈ సిచువేషన్ రూమ్ ఉంది. 5,525 చదరపు అడుగుల విస్తీర్ణమున్న ఈ గదిలో కాన్ఫరెన్స్ రూమ్, ఇంటెలిజెన్స్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఉంటాయి. అమెరికా అధ్యక్షుడు, ఆయన సలహాదారులు దేశం లోపల, బయట సంక్షోభ సమయాల్లో పరిస్థితులను సమీక్షించడానికి ఇక్కడ సమావేశమవుతారు. తాజా దాడుల్లో అమెరికా మరోసారి చాబహార్‌ను లక్ష్యంగా చేసుకుంది. ఆ నగరంలో ఉన్న నౌకదళ వాచ్ టవర్‌పై క్షిపణి దాడి చేసింది. గతంలో ఒకసారి దాడి చేసి ధ్వంసం చేసింది. సముద్ర భద్రత, మత్స్యకారులకు సంబంధించి సహాయకచర్యల కోసం ఆ టవర్‌ను ఉపయోగిస్తున్నారు.

## స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాస్‌లు వాడొద్దు

**ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియట్ సూచన**

న్యూఢిల్లీ(జనంసాక్షి): పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యే ఎంపీలు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు వంటివి ధరించొద్దని లోక్‌సభ సచివాలయం సూచించింది. దీనివల్ల భద్రతకు, వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ నెల 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న వేళ బులెటిన్ జారీ చేసింది. దేశంలో విరివిగా లభ్యవుతున్న స్మార్ట్‌వాచ్‌లు, పెన్ కెమెరా, స్మార్ట్‌గ్లాస్‌లు.. ఎంపీల హక్కులను ఉల్లంఘించే విధంగా ఉపయోగించే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు పార్లమెంట్ ఆవరణలో ఎంపీలు ధర్నాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు ప్రదర్శించడం, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించడం వంటి వాటికీ దూరంగా ఉండాలని కోరింది. అలాగే, ఏఐతో రూపొందించిన చిత్రాలు, పోస్టర్లు; అవమానకర రీతిలో రాసిన స్లోగన్లతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లనూ ప్రదర్శించొద్దని బులెటిన్‌లో పేర్కొంది. సమావేశాల సమయంలో తోటి ఎంపీలు తమ ఛాంబర్లకు వెళ్లడానికి వీలుగా పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ఎలాంటి నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించవద్దని సభ్యులకు విన్నవించింది. బడ్జెట్ సమావేశాల సమయంలో సస్పెన్షన్‌కు గురైన పలువురు ఎంపీలు పార్లమెంట్ గేట్ వద్ద ఆందోళన నిర్వహించిన నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రస్తావించింది.

## క్రిప్టోను ఒక చట్టబద్ధమైన ఆస్తిగా పరిగణించలేం

**ఈ అంశంపై వస్తున్న వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):క్రిప్టో కరెన్సీని నియంత్రించే అంశంపై ఆలోచించాల్సిందిగా ఆర్‌బీఐ, సెబీలను ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించినట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. అవన్నీ అవాస్తవాలని కొట్టిపారేసింది. అలాంటి ప్రతిపాదనలేవీ లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించింది. క్రిప్టో కరెన్సీపై ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని కేంద్రం పేర్కొంది. క్రిప్టోను ఒక చట్టబద్ధమైన ఆస్తిగా పరిగణించడం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వదంతులను నమ్మొద్దని తెలిపింది. విశ్వసనీయం సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లనే సందర్శించాలని సూచించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలు వ్యాప్తి జరిగినప్పుడు వెంటనే కేంద్రం దృష్టికి తీసుకురావాలని కోరింది. ఇందుకు +91 8799711259 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని సూచించింది.



## అమెరికాలో టైమ్ సవరణ విధానానికి చెక్

**బిల్లును ఆమోదించిన ప్రతినిధుల సభ**

వాషింగ్టన్,జూలై15(జనంసాక్షి): ఏటా రెండుసార్లు గడియారాల్లో సమయాన్ని మార్చే విధానానికి స్వస్తి పలికేందుకు అమెరికా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 'డేలైట్ సేవింగ్ టైమ్'ను ఏడాది పొడవునా శాశ్వతం చేయడం కోసం ప్రవేశపెట్టిన 'సన్‌ప్రొటెక్షన్ యాక్ట్' బిల్లుకు అక్కడి ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ప్రతినిధుల సభలో జరిగిన ఓటింగ్‌లో 308-117 ఓట్ల భారీ మెజారిటీతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ప్రతినిధుల సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు అధ్యక్షుడు సంతకం చేస్తే అధికారిక చట్టంగా మారుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారు. తాను అధికారంలోకి వస్తే ఈ గడియారాలు మార్చే విధానాన్ని ముగిస్తానని గతంలోనే ఆయన హామీ ఇచ్చారు. ఈ చట్టం వల్ల ప్రజలకు సాయంత్రం పూట ఎక్కువ సమయం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ ఈ బిల్లుపై అతి త్వరలో సంతకం చేయనున్నారు. సూర్యుడు త్వరగా ఉదయించే వేసవి నెలల్లో.. ఉదయం 4 నుంచి 5 గంటలకే ఎండ వచ్చేస్తుంది. ఆ సమయంలో చాలామంది నిద్రపోతుంటారు. చాలా వరకు సమయం నిద్రలోనే వృథా అవుతుంది. గడియారాన్ని ఒక గంట ముందుకు జరపడం వల్ల.. సాయంత్రం పూట సహజమైన సూర్యకాంతిని ఎక్కువ సమయం ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. అమెరికా, కెనడా, బ్రిటన్, ఐరోపా దేశాలతో పాటు దాదాపు 70కి పైగా దేశాలు ఈ విధానాన్ని పాటిస్తున్నాయి.

# మాదాపూర్‌లో వ్యక్తి దారుణ హత్య

- కత్తులతో దాడి చేసి హతం



**శేరిలింగంపల్లి, జూలై 15 (జనంసాక్షి) :** నగరంలోని మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కత్తులతో దాడి చేసి మరీ యువకుడిని కొందరు వ్యక్తులు కిరాతకంగా చంపేశారు. మృతుడు వరంగల్ జిల్లా మాదన్నపేట్ మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చిన్నపల్లి భాస్కర్‌గా పోలీసులు గుర్తించారు. కులాంతర ప్రేమ వ్యవహారమే హత్యకు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువతిని భాస్కర్ ప్రేమించాడు. అయితే కులం వేరు కావడంతో వారి ప్రేమను అమ్మాయి కుటుంబ సభ్యులు అగింకరించలేదు. మూడు సంవత్సరాల క్రితం అమ్మాయిని వేరే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్లి అయినప్పటి నుంచీ అమ్మాయికి భర్తతో తరుచూ గొడవలు జరిగాయి. దీంతో ఆమెకు భర్త విడాకులు ఇచ్చేశాడు. తన కూతురి విడాకులకు కారణం గతంలో ప్రేమించిన భాస్కర్ కారణమని అమ్మాయి తండ్రి రాజు కక్ష పెంచుకున్నాడు. గతంలో భాస్కర్‌ను చంపుతామంటూ అమ్మాయి తండ్రి, కుటుంబసభ్యులు బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీలో భాస్కర్ ఉంటున్న హాస్టల్‌కు ఐదుగురు వ్యక్తులు వచ్చారు. హాస్టల్ నుంచి కిందకు వచ్చిన భాస్కర్‌ను దుండగులు అతికిరాతకంగా కత్తులతో పొడిచి చంపేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అయితే అమ్మాయి కుటుంబసభ్యులే తన తమ్ముడిని హత్య చేశారంటూ భాస్కర్ అన్న మధు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత రెండేళ్లుగా భాస్కర్ మా వద్ద చెఫ్‌గా పని చేస్తున్నాడు. భాస్కర్ కోసం రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో కొందరు వ్యక్తులు వచ్చారు. భాస్కర్‌తో మాట్లాడాలని చెప్పడంతో గేటు బయటకు రాగానే అతడిపై దాడి చేశారు. కత్తులు, కర్రలతో కొట్టారు... దీంతో స్పాట్‌లోనే చనిపోయాడు. రెండేళ్లలో భాస్కర్ కోసం ఎవరూ రాలేదు.. రాత్రి వచ్చిన వాళ్లను మొదటిసారి చూశాము. మేము అడ్డుకునే ప్రయత్నం చేసినా వారు ఆగలేదు . 'మా పరువు తీశావ్' అంటూ భాస్కర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు' అంటూ తోటి సిబ్బంది చెప్పారు.

# చట్టవిరుద్ధంగా పోడు చేస్తే చర్యలు

- అటవీ అధికారి హెచ్చరిక

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై15 (జనంసాక్షి) :** అటవీ హక్కుల చట్టం ప్రకారం చెల్లుబాటయ్యే అటవీ హక్కు పత్రాలు లేకుండా భూముల్లో పోడు సాగు చేయవద్దని, దుక్కులు దున్ని పంటలు వేయొద్దని ముసలిమడుగు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అనార్కలి అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామంలోని ఆదివాసీలకు అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పోడు సాగుపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్ట విరుద్ధంగా అడవులను నరికి ప్రభుత్వ ప్లాంటేషన్లు ధ్వంసం చేసి పోడు సాగు చేస్తే అటవీ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా అడవులను ఆక్రమించి పోడు భూములు సృష్టించవద్దని, అడవులకు నిప్పు పెట్టకూడదని, వన్యప్రాణులను వేటాడరాదని, అటవీ సంపదను భావితరాలకు పరిరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని వివరించారు. అటవీ పరిరక్షణలో గ్రామస్తులు అటవీశాఖ సిబ్బందికి సహకరించాలని, ఎలాంటి అక్రమాలు అడవుల్లో జరిగినా అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో సోంపల్లి మాజీ సర్పంచ్ తాటి వీరాంజనేయులు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, బీట్ ఆఫీసర్లు సోడె శ్రీరాములు, మడకం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్కొండ సమస్యలపై ఎమ్మెల్యే వేముల దీక్ష

- ఇంట్లోనే గృహనిర్బంధం చేసిన పోలీసులు



**నిజామాబాద్, జూలై15 (జనంసాక్షి) :** బాల్కొండ నియోజకవర్గం, భీంగల్ ప్రజల దశాబ్దాల కల అయిన అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఒకరోజు నిరాహారదీక్ష చేపట్టారు. అయితే తాను తలపెట్టిన శాంతియుత 'కఠోర నిరాహార దీక్ష'ను పోలీసు బలగాలతో అడ్డుకోవడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, రాక్షస చర్య అని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా సమస్యల సాధన కోసం తాను అహింసా మార్గంలో నిరసన తెలియజేస్తుంటే, ప్రభుత్వం పోలీసులతో ఉక్కుపాదం మోపాలని చూడటం శోచనీయమన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై, దాదాపు 75 శాతం పనులు పూర్తి చేసుకున్న భీంగల్ 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే, భీంగల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలని, మూతపడిన భీంగల్ బస్ డిపోను పునఃప్రారంభించాలని కోరారు. గత మున్సిపల్ ఎన్నికల ముందు రూ. 12 కోట్ల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పెండింగ్ పనుల సాధన కోసమే 15వ తేదీన చుక్క మంచి నీరు కూడా ముట్టకుండా ఒక రోజు కఠోర నిరాహార దీక్షకు పూనుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి పనులను నెల లేదా రెండు నెలల్లో పూర్తి చేస్తామని అధికారికంగా స్పష్టమైన హామీ ఇస్తే తాను తక్షణమే ఈ ఒక్కరోజు చేపట్టిన దీక్ష విరమిస్తానని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. అది చేతకాక, పోలీసులతో బెదిరిస్తే భయపడేది లేదని తేల్చిచెప్పారు. ప్రజా ప్రతినిధిగా ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తనను ఇంట్లో నిర్బంధించినా, పోలీస్ స్టేషన్ కు తరలించినా, లేదా జైల్లో పెట్టినా తన సత్యాగ్రహం, కఠోర నిరాహార దీక్ష ఎక్కడ ఉంటే అక్కడే కొనసాగుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యేను నిర్బంధించడం దారుణం : హరీష్

**హైదరాబాద్, జూలై15 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని పోలీసులు నిర్బంధించడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీ అభివృద్ధి, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణ వంటి ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ శాంతియుతంగా నిరాహార దీక్ష చేపట్టాలని ప్రశాంత్ రెడ్డి నిర్ణయించుకుంటే ఆయనను పోలీసులు నిర్బంధించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. తమది 'ప్రజా ప్రభుత్వం' అని చెప్పుకుంటూ ప్రతిపక్షాన్ని నిర్బంధించడం, పోలీసు రాజ్యాన్ని నడపడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. హిట్లర్ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష గొంతులపై అణిచివేత చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

# సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బోనాల పండుగ

- తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే మహోత్సవం 'ఆషాఢ బోనాలు
- అమ్మవార్ల కరుణాకటాక్షాలతో రాష్ట్రంలో వర్షాభావం తొలగాలి
- బోనాల పండువగా నిర్వహించేందుకు రూ. 20 కోట్లు కేటాయింపు
- 16న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం
- రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జూలై15 (జనంసాక్షి) :** తెలంగాణ ఆత్మను, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ఆషాఢ బోనాల ఉత్సవాలు తెలంగాణకు ప్రత్యేకమైన శక్తి ఆరాధనా పండుగ అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. ఆషాడ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ కేవలం ఒక ఉత్సవం కాదు, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక మహోత్సవం అని మంత్రి సురేఖ అన్నారు. జూలై 16 నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న సుమారు 3వేలకు పైగా దేవాలయాల్లో అట్టహాసంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని మంత్రి సురేఖ తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని, లౌకిక స్ఫూర్తిని చాటుతాయని మంత్రి పేర్కొన్నారు. ఆషాఢ బోనాల ఉత్సవాలు గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ప్రారంభమై, ఆగష్టు 13 న హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయంలోని అమ్మవారికి బోనాల సమర్పణ అనంతరం ఘటాల నిమజ్జనంతో ముగుస్తాయని మంత్రి సురేఖ తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు బోనాల ఉత్సవాల్లో పాల్గొనే పరిస్థితుల నేపథ్యంలో, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ యేడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించడం పై మంత్రి సురేఖ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవార్ల దయతో ఈ యేడాది వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి, సమృద్ధిగా పంటలు పండేలా పరిస్థితులు నెలకొనాలని మంత్రి ఆకాంక్షించారు. భక్తులు సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని, బోనాలు సమర్పించి, తిరిగి సంతోషంగా ఇండ్లకు చేరుకునేలా అన్ని శాఖలు ఏర్పాట్లను పూర్తిచేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# 21న బీసీ గురుకులాలపై సమగ్ర సమీక్ష

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల మెరుగైన ఫలితాల కోసం కీలక సమీక్ష సమావేశం ఈనెల 21న ప్రజా భవన్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాల మాయాదేవి, ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు హాజరు కానున్నారు. రానున్న విద్యా సంవత్సరం 2026 – 27 లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మెరుగైన విద్యా ప్రమాణాలు, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ నెల 21న హైదరాబాద్‌లో కీలక సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఎం జె పి విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, ప్రాంతీయ సమన్వయకర్తలు పాల్గొననున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ కు సన్మానం చేయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవాల్సిన అనేక చర్యలపై చర్చిస్తారు. ముఖ్యంగా పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలపై సమగ్ర విశ్లేషణ చేస్తూ... తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తారు. బీసీ గురుకుల విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఆహార నాణ్యత, విద్యా ప్రమాణాలు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రిగారు దిశానిర్దేశం చేయనున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, బోధనా విధానాల్లో మార్పులు వంటి అంశాలు చర్చకు రానున్నాయి. 5వ తరగతి ప్రవేశాలు, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ, ఇంటర్మీడియట్, డిగ్రీ అడ్మిషన్‌ల అడ్మిషన్‌ల పరిస్థితిపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ సమావేశంలో చర్చకు రానున్న మరో ముఖ్యమైన అంశం మౌలిక సదుపాయల కల్పన, పాఠశాలల భవనాల పరిస్థితి. సొంత భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న విద్యాసంస్థల వివరాలను పరిశీలించనున్నారు. భవనాల మరమ్మతులు, భద్రతా ప్రమాణాలు, విద్యార్థుల వసతులపై సమీక్ష జరగనుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు వీలుగా అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ అమలు కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలను సమీక్షిస్తారు. ఆహారం అందించడంలో ఎలాంటి సమస్యలు రాకుండా కిచెన్ ఆధునీకరణ , తాగునీటి కోసం =ా ప్లాంట్లు గురించి తీసుకుంటున్న చర్యలను చర్చిస్తారు. ఆహార నాణ్యత, పోషకాహార ప్రమాణాలు, వంటశాలల నిర్వహణ వంటి అంశాలపై చర్చ జరగనుంది. విద్యార్థుల భద్రత కోసం జజ కెమెరాలు, తరగతి గదుల్లో ఫర్నిచర్ తదితర అంశాలు సమీక్షిస్తారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన సి ఓ ఈలు, ప్రాంతీయ ఎస్ ఓ ఈ ల పనితీరును సమీక్షించి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు పదోతరగతి, ఇంటర్, డిగ్రీలో, పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంపై చర్చిస్తారు. విద్యార్థుల భద్రత, హాస్టళ్ల నిర్వహణ, క్రమశిక్షణ, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు.

# గోదావరి జలాల వృధాను అరికట్టండి

- మోటర్లు ఆన్ చేస్తే నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు
- ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు విమర్శలు



**ఖమ్మం, జూలై15 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రాకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జూలూరుపాడు మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ బిఎల్ఏల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేయడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా ఎండగట్టారు. గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయడం లేదని ఆయన ఆరోపించారు. కన్నెపల్లి, దేవాదుల పంప్ హౌస్ లలో నీటిమట్టం పుష్కలంగా ఉన్నప్పటికీ పంపింగ్ చేయడం లేదన్నారు. కానీ, ఆంధ్రా బోర్డర్ కు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం జూలూరుపాడు నుంచి ఏన్కూర్ మండలంలోని సాగర్ కాల్వ వరకు కాలువ తవ్వి సత్తుపల్లి వైపు నీటిని తరలించేందుకు ఆగమేఘాల మీద కాలువలు తవ్వుతున్నారని మండిపడ్డారు. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం, సీతారామ లాంటి ప్రాజెక్టులను నిర్మిస్తే.. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ప్రస్తుత ప్రభుత్వం వాటిని ఉద్దేశపూర్వకంగా నిరుపయోగంగా మారుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల హామీలను గాలికొదిలేసిందని, నిధులు లేవని సాకులు చెబుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో కరువు ఛాయలు అలుముకుం టున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, సలహాలు ఇస్తే స్వీకరించకపోగా పచ్చి బూతులు మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సాగు కోసం నానా అవస్థలు పడుతున్నారని, కనీసం యూరియా కూడా దొరకని పరిస్థితి దాపురించిందన్నారు. పండించిన ధాన్యం కొనుగోలు చేయకుండా రైతుల కళ్లల్లో మట్టి కొడుతున్న ఈ దుర్మార్గపు పాలనపై ప్రజలు, రైతులు ఏకమై నిలదీయాలని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా వంద శాతం ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కదలాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. పార్టీకి మూలస్తంభాలైన బీఎల్‌ఏలు రాబోయే వారం రోజుల పాటు సైనికుల్లా శ్రమించాలన్నారు. ప్రతి బిఎల్ఏ స్వయంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, అర్హులైన వారందరితో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయించి, వాటిని బూత్ లెవెల్ అధికారులకు అందజేసే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరికైనా ఫారాలు అందకపోతే వెంటనే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి సకాలంలో సమర్పించేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. అప్పటికే ఖమ్మం జిల్లాలో 65 నుంచి 75 శాతం ఓట్ల నమోదు ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన పనిని ఈ నెల 24వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# తుదిదశకు అహ్మదాబాద్ విమాన దుర్ఘటన దర్యాప్తు

- కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు





**న్యూఢిల్లీ, జూలై15 (జనంసాక్షి) :** అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరిందని కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అతి త్వరలోనే ఈ ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక వస్తోందని పేర్కొన్నారు. త్వరగా నివేదిక ఇవ్వడం కంటే.. ప్రమాదం అసలు నిజాన్ని బయటపెట్టడమే తమకు ముఖ్యమని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదికపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. గతేడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా ఎఐ-171 బోయింగ్ విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో పాటు భూమిపై ఉన్న 19 మంది.. మొత్తం 260 మంది మృతిచెందారు. ఈ ఘటనలో విమాన వ్యవస్థలు, బ్లాక్ బాక్స్ డేటా, ఇంజిన్ భాగాల విశ్లేషణలో ౦౦ఎః కీలక పురోగతి సాధించింది. పౌర విమానయాన శాఖకు ఐదు ప్రధాన డిమాండ్లతో బాధితుల కుటుంబ సభ్యులు లేఖలు రాశారు. ౹÷నైల్ రిపోర్ట్ ఇచ్చే ముందు స్వతంత్ర 'ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్ వాలిడేషన్ టెస్టులు' నిర్వహించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు పురోగతిపై ప్రతి 15 లేదా 30 రోజులకు ఒకసారి కుటుంబాలకు అధికారికంగా సమాచారం అందించాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించారు. కేసు విచారణ బృందంలో బోయింగ్ 787 నడిపిన అనుభవం ఉన్న సీనియర్ కమర్షియల్ పైలట్‌ను చేర్చాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు చట్టపరమైన హక్కులను కోల్పోయేలా బాధితులపై ఎలాంటి బలవంతపు ఒప్పందాల సంతకాలు చేయించవద్దని అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై తుది నివేదిక విడుదలకు ఓ కచ్చితమైన కాలపరిమితిని ప్రకటించాలని కుటుంబ సభ్యులు కోరారు. బాధితుల కుటుంబ సభ్యుల లేఖపై కేంద్రమంత్రి స్పందించారు. అంతర్జాతీయ దర్యాప్తు నిబంధనల ప్రకారమే విచారణ వేగంగా సాగుతోందని కేంద్రమంత్రి రామ్మోహన్ స్పష్టం చేశారు.

## కరీంనగర్ అభివృద్ధికి కృషి

### సీసీ రోడ్డు పనులకు బండి శంకుస్థాపన

**కరీంనగర్, జూలై15 (జనంసాక్షి) :** కరీంనగర్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో యూడీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం 62వ డివిజన్ మంకమ్మతోటలో రూ. 98లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్దే లక్ష్యంగా భాజపా పని చేస్తోందన్నారు. కరీంనగర్ నగరాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని.. మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

## సుప్రీంలో సినీ నిర్మాత బండ్ల గణేష్ పిటిషన్

**న్యూఢిల్లీ, జూలై15 (జనంసాక్షి) :** ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణెశిశ్ ఆస్తి వేలం వివాదం కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గణెశ్ తన ఆస్తి వేలం వ్యవహారంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న చర్యలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు వెళ్లారు. హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ శ్రీ పరమేశ్వర పౌల్టీ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు యూనియన్ బ్యాంక్ అందించిన రుణాలకు గానూ, బండ్ల గణెశిశ్ ఆయన కుటుంబ సభ్యులు తమ సొంత ఆస్తులను పూచీకత్తుగా తాకట్టు పెట్టారు. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ సమయంలో, బ్యాంక్ తనఖా పెట్టిన ఆస్తిని చట్టం కింద వేలం వేసింది. ఈ వేలం ప్రక్రియను సవాలు చేస్తూ బండ్ల గణెశ్ డెబ్ట్స్ రికవరీ ట్రిబ్యునల్ ను ఆశ్రయించగా, అది ఆయనకు అనుకూలంగా తీర్పునిచ్చింది. వేలం ప్రక్రియ నిలవదని పేర్కొంటూ, ఆస్తిని తిరిగి యజమానులకు అప్పగించాలని, కొనుగోలుదారుకు సొమ్మును వడ్డీతో సహా వాపసు చేయాలని డీఆర్టీ ఆదేశించింది. అయితే, ఈ తీర్పును సవాలు చేస్తూ బ్యాంక్ తెలంగాణ హైకోర్టుకు వెళ్లింది. డీఆర్టీ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేస్తూ బ్యాంక్ చర్యను సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ బండ్ల గణెశిశ్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు వచ్చే సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## పవర్ ప్లాంట్ ఎంప్లాయీస్ నిరసన

**కరీంనగర్, జూలై15 (జనంసాక్షి) :** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాల నిర్వహణను ప్రైవేట్ కు కట్టబెట్టే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ పవర్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి కరీంనగర్ సర్కిల్ కార్యాలయం ముందు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత కొద్ది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న మేనేజ్ మెంట్ మొండి వైఖరితో వ్యవహరిస్తూ టెండర్లను రద్దు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I, Rangarigari Vivek S/O Rangarigari Kashiram (Old Name), Age : 19 Years, H.no 2-78/1, Hanmajipet (V), Banswada (M), Dist : Kamareddy, T.G.
I Have Changed as per My SSC Memo (Roll No.2415111356) My New Name RANGARI GARI VIVEKANANDA S/O KASHIRAM.

# వర్షం దేవుడిది కాదు.. ప్రభుత్వ బాధ్యత!

*కరువు అనేది ప్రకృతి వైపరీత్యంగా చెప్పుకుంటూ ప్రభుత్వాలు తప్పించుకోవాల్సిన అంశం కాదు. వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, పంటలు ఎండిపోవడం.. ఇవ్వాలటి ఆధునిక ప్రపంచంలో కేవలం దైవాధీనమైన విషయాలు కావు. సాంకేతికత ఇంతగా అభివృద్ధి చెందిన నేటి కాలంలో, వర్షపాతాన్ని కృత్రిమంగా పెంచే మార్గాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా, ప్రజల విశ్వాసాల మీదకు బాధ్యతను నెట్టేయడం పాలకుల నిర్లక్ష్యానికి, చేతకానితనానికి తార్కాణం.*

సంపాదకీయం

క్లౌడ్ సీడింగ్ అనే సాంకేతికత దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉంది. మేఘాల్లో సిల్వర్ అయోడైడ్ వంటి రేణువులను ప్రవేశపెట్టి, తేమను వర్షంగా మలిచే ఈ పద్ధతిని చైనా ప్రపంచంలోనే అతిపెద్ద వాతావరణ మార్పిడి కార్యక్రమంగా నిర్వహిస్తోంది. కరువును ఎదుర్కోవడానికి, వడగళ్లను అరికట్టడానికి, వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ పద్ధతిని వినియోగిస్తున్నారు. తీవ్రమైన కరువును ఎదుర్కొన్న సందర్భంలో వేల ఆర్టిలరీ షెల్స్‌ను ఆకాశంలోకి పేల్చి వర్షం కురిపించే ప్రయత్నం కూడా చైనా చేసింది. లక్షలాది చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కప్పే స్థాయికి ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని చైనా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏడాదికి కేవలం వంద మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయ్యే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా ఈ విషయంలో ముందంజలో ఉంది. దశాబ్దాలుగా వాతావరణ మార్పిడి కార్యక్రమాన్ని అమలు చేస్తున్న యుఏఈలో, ఏటా వేల గంటల సీడింగ్ విమానాలను నడుపుతున్నారు. అంతర్జాతీయ సంస్థలతో కలిసి పరిశోధనలు చేస్తూ, కృత్రిమ వర్షాన్ని తమ నీటి భద్రతా వ్యూహంలో భాగంగా మలుచుకున్నారు. మన దేశం కూడా ఈ దిశగా అడుగులు వేస్తోంది. కరువు పీడిత ప్రాంతాల్లో వర్షపాతాన్ని పెంచడం, వర్షాభావ జిల్లాల్లో వ్యవసాయానికి తోడ్పాటునివ్వడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ కృత్రిమ వర్ష ప్రాజెక్టును ప్రారంభించింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు బలహీన రుతుపవనాల సమయంలో క్లౌడ్ సీడింగ్ ప్రయోగాలు చేపట్టాయి. లక్ష్యంగా ఎంచుకున్న ప్రాంతాల్లో వర్షపాతం గణనీయంగా పెరిగినట్టు నివేదికలు వెల్లడించాయి. ఢిల్లీ ప్రభుత్వం సైతం వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు కృత్రిమ వర్షాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసింది.

అమెరికా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఫ్రాన్స్, రష్యా, సౌదీ అరేబియా వంటి దేశాల్లోనూ ఇది కొత్త కాదు. నీటి కొరతను అధిగమించడంతో పాటు, విమానాశ్రయాల్లో పొగమంచును తొలగించడానికి, వడగళ్ల నష్టాన్ని తగ్గించడానికి, పెద్ద ఈవెంట్ల సమయంలో వాతావరణాన్ని అనుకూలంగా మార్చుకోవడానికి కూడా దీన్ని వినియోగిస్తున్నారు. ఈ ఉదాహరణలు చెప్పేది ఒక్కటే.. వర్షం కురవకపోవడం అనేది కేవలం “దైవ శాపం” కాదని, శాస్త్రసాంకేతికతతో ఎదుర్కోగల సవాలు అని ఆధునిక ప్రభుత్వాలు గుర్తించాయి. అయితే క్లౌడ్ సీడింగ్ ఒక సంపూర్ణ పరిష్కారం కాదని, స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి ఫలితాలు మారుతాయని, దీర్ఘకాలిక పర్యావరణ ప్రభావాలపై ఇంకా అధ్యయనాలు జరగాల్సి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ ఈ పరిమితులను గుర్తించి బాధ్యతాయుతంగా వినియోగించాలే తప్ప, పూర్తిగా విస్మరించి ప్రజల మూఢనమ్మకాల మీదకు తోసేయడం సమర్థనీయం కాదు.

మన దగ్గర పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. వర్షాలు కురవకపోతే కప్పతల్లి ఆటలు ఆడించడం, దేవుళ్ల విగ్రహాలకు జలాభిషేకం చేయించడం, యాగాలు హోమాలు నిర్వహించడం - ఇవన్నీ శతాబ్దాలుగా వస్తున్న ఆచారాలే. కానీ ఈ ఆచారాలను ప్రజల మనోధైర్యం కోసం, సంఘీభావం కోసం చేసుకోవడం వేరు; ప్రభుత్వమే స్వయంగా ఈ మార్గాన్ని ప్రోత్సహిస్తూ, తన అసలైన బాధ్యత నుంచి తప్పించుకోవడం వేరు. కరువు రావడానికి ప్రజల పాపాలు కారణమని, దేవుడు కరుణించకపోవడమే కారణమని ప్రచారం చేయడం అంటే  నీటిపారుదల ప్రణాళికల వైఫల్యాన్ని, భూగర్భ జల నిర్వహణ లోపాలను, శాస్త్రసాంకేతిక పెట్టుబడుల కొరతను మరుగుపరచడమే. నిజంగా దైవం ఉన్నదని నమ్మేవారికి కూడా ఒక సూటి ప్రశ్న వేయాలి. ఏ మతగ్రంథమైనా దేవుడిని కరుణామయుడిగా, ప్రేమమూర్తిగానే చిత్రిస్తుంది తప్ప, ప్రజలను శిక్షించే క్రూరుడిగా చెప్పదు. కరువు వచ్చిందంటే అది పాపాల ఫలితం అనే భావన మతానికే విరుద్ధమైనది. ఈ తర్కాన్ని ప్రజలపైకి నెట్టడం ద్వారా, వైఫల్యానికి కారణమైన పాలనా లోపాలను భగవంతుని ఖాతాలో వేసేసి ప్రభుత్వాలు తప్పించుకుంటున్నాయి.

కరువు నివారణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం, అవసరమైన చోట కృత్రిమ వర్షం వంటి ఆధునిక పద్ధతుల అమలు.. ఇవన్నీ ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యాలు. అభివృద్ధి చెందిన దేశాలు దీన్ని ఇప్పటికే రుజువు చేశాయి. అక్షరాస్యత తక్కువగా ఉన్న, వనరులు పరిమితంగా ఉన్న దేశాల్లో ఈ బాధ్యతను విస్మరించి, మూఢనమ్మకాల చాటున దాక్కోవడం అంటే ప్రజలను రెండోసారి మోసం చేయడమే. ఒకసారి కరువుతో, మరోసారి తప్పుడు కారణాలతో..!!

# “పిచ్చుక పై బ్రహ్మాస్త్రం (యూఏపీఏ) ప్రయోగం”




ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఎంత సహజమో, విమర్శించడం కూడా అంతే సహజం. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక స్వేచ్ఛల్లో భాగం. ఆ హక్కును వినియోగించిన ప్రతి ఒక్కరినీ శత్రువులుగా చూడటం, వారి మాటలను దేశ భద్రతకు ముప్పుగా చిత్రీకరించడం, కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధం. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో యూట్యూబర్ రావణ్‌పై అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) ప్రయోగించిన ఘటన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఒక వ్యక్తి వ్యాఖ్యలు ఎంత తీవ్రమైనవైనా, వాటిని ఎదుర్కోవడానికి చట్టం పేరుతో అత్యంత కఠినమైన ఆయుధాలను ఉపయోగించడం ప్రజాస్వామ్య బలాన్ని కాకుండా, అధికార అసహనాన్ని ప్రతిబింబిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

***అన్ లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్ష్ యాక్ట్ (యూఏపీఏ) ఉద్దేశం ... దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం. ఈ చట్టం సాధారణ క్రిమినల్ చట్టాల కంటే భిన్నమైనది. ఇందులో బెయిల్ పొందడం అత్యంత క్లిష్టం. విచారణ పూర్తికాకముందే దీర్ఘకాలం జైలులో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి. అందుకే దీనిని “ప్రక్రియే శిక్ష” (ప్రాసెస్ ఇట్సెల్ఫ్ బికమ్స్ పనిష్మెంట్) అనే విమర్శ తరచూ వినిపిస్తుంది. అలాంటి చట్టాన్ని సాధారణ రాజకీయ విమర్శలు, సోషల్ మీడియా వ్యాఖ్యలు లేదా ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేసిన వారిపై ప్రయోగిస్తే, అది చట్ట దుర్వినియోగంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది.***

దేశంలో గత కొన్ని సంవత్సరాలుగా కవులు, రచయితలు, కళాకారులు, ప్రజా గాయకులు, స్టాండప్ కమెడియన్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, యూట్యూబర్లు, స్వతంత్ర జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులపై యూఏపీఏ, దేశద్రోహం వంటి కఠిన చట్టాల వినియోగం పెరిగిందనే విమర్శలు కేవలం ప్రతిపక్షాల నుంచే కాదు, మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు, మానవ హక్కుల సంస్థలు కూడా వ్యక్తం చేస్తున్నాయి. వివిధ నివేదికల ప్రకారం యూఏపీఏ కింద నమోదైన కేసుల్లో శిక్షల శాతం చాలా తక్కువగా ఉండగా, బెయిల్ పొందక ముందే నిందితులను సంవత్సరాల పాటు జైలులో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో చివరకు నిర్దోషిగా బయటకు వచ్చినా, వారి వ్యక్తిగత జీవితం, కుటుంబం, ఉపాధి, సామాజిక గౌరవం తీవ్రంగా దెబ్బతింటాయి. ఈ నేపథ్యంలో చట్టం శిక్షించక ముందే, ప్రక్రియే శిక్షగా మారుతోందనే విమర్శ బలపడుతోంది.

ప్రభుత్వాన్ని విమర్శించడం దేశద్రోహం కాదు. ప్రభుత్వాన్ని, దేశాన్ని ఒకటిగా చూడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ప్రభుత్వాలు ఎన్నికల ద్వారా వస్తాయి, పోతాయి. కానీ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశం శాశ్వతం. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం అంటే దేశాన్ని వ్యతిరేకించడం కాదు. వాస్తవానికి విమర్శలే ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం. అధికారంలో ఉన్నవారు చేసే తప్పులను ఎత్తిచూపే స్వేచ్ఛ లేకపోతే, అవినీతి, అధికార దుర్వినియోగం, నియంతృత్వ ధోరణులు మరింత బలపడతాయి.

ఒక వ్యక్తిపై ఒకేసారి అనేక పోలీస్ స్టేషన్లలో వేర్వేరు కేసులు నమోదు చేయడం, ఒక కేసులో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసులో అరెస్టు చేయడం, పదేపదే కస్టడీలో ఉంచే ప్రయత్నాలు చేయడం వంటి పరిణామాలు ఇటీవలి కాలంలో అనేక రాష్ట్రాల్లో కనిపిస్తున్నాయి. చట్టపరంగా ప్రతి కేసుకు ప్రత్యేక పరిస్థితులు ఉండవచ్చు. అయితే ఒకే సంఘటన లేదా ఒకే తరహా వ్యాఖ్యల ఆధారంగా వరుస కేసులు నమోదు చేసి వ్యక్తిని నిరంతరం వేధించడం న్యాయస్ఫూర్తికి విరుద్ధమనే అభిప్రాయాన్ని న్యాయ నిపుణులు పలుమార్లు వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాలు ప్రజల్లో చట్ట వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది.

పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి కాదు, రాజ్యాంగానికి సేవ చేయాల్సిన సంస్థ. చట్టాన్ని అమలు చేసే ప్రతి అధికారి రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరించాలి. నేరం నిజంగా ఉగ్రవాదానికి సంబంధించినదా? దేశ భద్రతకు వాస్తవ ప్రమాదమా? లేక కేవలం ఘాటైన రాజకీయ విమర్శేనా? అనే అంశాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించకుండా యూఏపీఏ వంటి చట్టాలను ప్రయోగించడం వల్ల చివరకు చట్టం విశ్వసనీయతే దెబ్బతింటుంది.

**రాజకీయ నాయకులు కూడా అధికారాన్ని విమర్శలను అణచివేయడానికి కాకుండా, వాటికి సమాధానం చెప్పడానికి వినియోగించాలి. ప్రజాస్వామ్యంలో విమర్శకు సమాధానం మరొక వాదన కావాలి; కేసు కాదు. అసత్య ప్రచారం జరిగితే పరువు నష్టం చట్టాలు ఉన్నాయి. ద్వేష ప్రసంగం ఉంటే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో తగిన నిబంధనలు ఉన్నాయి. కానీ ప్రతి రాజకీయ విమర్శను ఉగ్రవాదానికి అనుసంధానం చేయడం చట్టం ఉద్దేశాన్ని వక్రీకరించినట్లే అవుతుంది.**

అదే సమయంలో సోషల్ మీడియా కార్యకర్తలు, యూట్యూబర్లు, రాజకీయ వ్యాఖ్యాతలు కూడా తమ బాధ్యతను గుర్తుంచుకోవాలి. భావ ప్రకటన స్వేచ్ఛకు రాజ్యాంగం రక్షణ కల్పించినప్పటికీ, అది అపరిమిత హక్కు కాదు. వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలు, హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు, తప్పుడు సమాచార ప్రచారం ప్రజాస్వామ్యానికి కూడా హానికరమే. విమర్శ వాస్తవాల ఆధారంగా, బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రజల విశ్వాసం సంపాదించేది సంచలనంతో కాదు, విశ్వసనీయతతో.

ఈ మొత్తం పరిణామంలో అత్యంత కీలకమైన పాత్ర న్యాయవ్యవస్థదే. వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులు గతంలో అనేక చారిత్రాత్మక తీర్పులు ఇచ్చాయి. యూఏపీఏ వంటి కఠిన చట్టాల దుర్వినియోగంపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు అవసరమని న్యాయవాదులు, పౌర సమాజ సంస్థలు చాలాకాలంగా కోరుతున్నాయి. ఒక వ్యక్తిపై ఒకే తరహా ఆరోపణలతో వరుసగా అనేక కేసులు నమోదు చేసే ధోరణిపై కూడా అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన ప్రమాణాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. అలా జరిగితే చట్టబద్ధమైన దర్యాప్తుకు ఆటంకం కలగదు; అదే సమయంలో పౌర హక్కుల దుర్వినియోగం కూడా తగ్గుతుంది.

ప్రజాస్వామ్యం బలపడేది భయంతో కాదు, భిన్నాభిప్రాయాలతో. ప్రభుత్వం విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజల స్పందనగా స్వీకరిస్తే పాలన మెరుగుపడుతుంది. పోలీసులు రాజ్యాంగ నిబద్ధతతో వ్యవహరిస్తే చట్టంపై గౌరవం పెరుగుతుంది. రాజకీయ నాయకులు సహనాన్ని ప్రదర్శిస్తే ప్రజాస్వామ్య సంస్కృతి బలపడుతుంది. మీడియా, యూట్యూబర్లు బాధ్యతాయుతమైన విమర్శలు చేస్తే ప్రజల విశ్వాసం పెరుగుతుంది. న్యాయవ్యవస్థ పౌర స్వేచ్ఛలను దృఢంగా కాపాడితే రాజ్యాంగం మరింత సజీవంగా ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో “పిచ్చుక పై బ్రహ్మాస్త్రం” ప్రయోగించడం పాలకుల బలానికి సంకేతం కాదు; అసహనానికి, అసమర్థతకు నిదర్శనం. ప్రజల ప్రశ్నలకు సమాధానం చట్టాల బెదిరింపులు కాదు, పారదర్శక పాలన. విమర్శలను అణచివేసే ప్రభుత్వాలు తాత్కాలికంగా నిశ్శబ్దాన్ని సృష్టించవచ్చు; కానీ ఆ నిశ్శబ్దం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి ప్రమాదకరం. ప్రశ్నించే గొంతులను రక్షించినప్పుడే రాజ్యాంగం బతుకుతుంది. భిన్నాభిప్రాయాలకు స్థానం కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో ఊపిరి పీలుస్తుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.


## చైతన్యంతో !

సినిమావాళ్లు
సినిమాల్లో
నటించండి!
దేశ సేవలో
నటించొద్దు!
దేశమంటే
సినిమాకాదు!
స్క్రీన్ ప్లేలేదు!
దర్శకత్వం
అసలే ఉండదు!
చట్టసభలు
కార్యనిర్వహణ
కోర్టులుంటాయి!
ఐనా దరిద్రం
ఎప్పటికీపోదు!
అందుకేకదా
మీరొచ్చారు!
మీరొచ్చి కూడా
నటిస్తే ఎలా?
దేశం ఏంకావాలి!
145 కోట్ల జనం!
కులాలు మతాలు
వర్గాలు జాతులు
భాషలు యాసలు
ఈ వైవిధ్యం
తెలుసా మీకు?
చాతుర్వర్ణాలు
సంస్కృతి
అస్పృస్యత
వేదకాలంనుండి
తెలిస్తేనే రండి!
వేదాల్లో అన్నీ లేవు
ఆర్య ద్రావిడ
యుద్ధాలే ప్రధానం!
ప్రచారం ఎక్కువ
వేదం చదవండి!
వేదంచదివితే
నాలుకకోసేవాళ్లు
వింటే చెవుల్లో
సీసం పోసేవాళ్లు
ఇప్పుడు లేరు!
ఆర్య జాతులు
ఈ దేశం వచ్చి
భూమిని కాజేసి
మూలవాసుల్ని
హింసలు పెట్టారు!
మూలవాసుల ఐక్యత
తమకు ప్రమాదమని
వర్ణవ్యవస్థతో
విభజించి
పాలించారు!
మంత్రాలు
మాయలతో
జనాన్ని
భయభ్రాంతం
చేసారు!
దేవుడు దెయ్యం
స్వర్గనరకాలు
పూర్వ జన్మలు
పునర్జన్మలు
సృష్టించారు!
వాళ్లు పెట్టిన
ఆ భయాలు
మూఢనమ్మకాలు
ఇప్పటికీ ప్రజల్లో
అలాగే ఉన్నాయి!
నటసోదరులారా
ఇవన్నీమీకు
తెలిస్తేనే
సేవకు రండి!
లేకపోతే వద్దు!
జరిగినమోసాన్ని !
సనాతనమంటూ
సంస్కృత పదజాలంతో
జనాన్ని మీరూ
మోసాగించవద్దు!
నిరంతరం
అన్నదానాలతో
తాత్కాలిక
పథకాలతో
ముష్టి వెయ్యొద్దు!
శాశ్వతంగా
దరిద్రాన్ని
రూపుమాపే
సేవకు మీరు
పునరంకితులుకండి!
అలా ఐతేనే రండి
మానవవాదులుగా
ప్రగతిశీలురుగా
వామపక్ష
మేధావులుగారండి!
దొంగ భక్తులుగా
రోజుకొకవేషం తో
భక్తినటించకండి!
మీ అంతరాత్మ మీ
గుండెలుపిండేస్తుంది!
సినిమాల్లో
మీరు ‘హీరో’లు!
దేశ సేవలో
‘జీరో’లు కావద్దు!
ఆలోచించండి!
భారత దేశం
ఒకప్పుడు
ప్రపంచానికి
ఆదర్శం!
వైజ్ఞానికం!
ఆర్యుల రాకతో
పతనం మొదలు!
విదేశీదండయాత్రలతో
ఇంకా పతనం!
ఇది గుండెల్ని
పిండేసే బాధ!
ఈ బాధ అంతా
ఉన్నవాళ్లే రండి!
లేనివాళ్లు పొండి!
ఇప్పుడుదేశం మళ్ళీ
‘మనువు’ల చేతుల్లో!
ఇదంతా చరిత్ర!
మీకోసమే కాదు!
రాబోయేవాళ్ళకోసం!
అందరికోసంచెప్పాను!
ప్రజలేచరిత్ర నిర్మాతలు
రండి చైతన్యంతో !

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ఉద్యమ ఫలాలు అందరికీ అందాయా?

## *తెలంగాణ ఉద్యమకారులకు ఇక న్యాయం ఎప్పుడు?*



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక గొప్ప రాజకీయ, సామాజిక మలుపు. అది కేవలం రాష్ట్ర విభజన కాదు.. దశాబ్దాల పాటు సాగిన ప్రజల ఆకాంక్షలకు లభించిన గుర్తింపు. “నీళు - నిధులు- నియామకాలు” అనే నినాదంతో ప్రారంభమైన ఉద్యమం, చివరికి కోట్లాది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటంగా మారింది. ముఖ్యంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు, రైతులు, మహిళలు సమిష్టిగా పాల్గొనడం వల్లే ఉద్యమం జాతీయ స్థాయిలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యా లయాలు ఉద్యమానికి కేంద్ర బిందువులుగా నిలిచాయి. ఎన్నో కుటుంబాలు తమ పిల్లలను కోల్పోయాయి. వందలాది మంది విద్యార్థులు అమరులయ్యారు. వేలాది మంది కేసులు ఎదుర్కొన్నారు. చదువులు, ఉద్యోగాలు, ఆరోగ్యం, భవిష్యత్తును పణంగా పెట్టి తెలంగాణ కోసం పోరాడారు.

2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజు ప్రతి ఉద్యమకారుడు తన త్యాగానికి ఫలితం దక్కిందని భావించాడు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని ఆశించాడు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఆశలు ఎంతవరకు నెరవేరాయన్న ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. రాజకీయ నాయకత్వం మారినా, అధికార పార్టీలు మారినా, ఉద్యమకారుల ఆవేదన మాత్రం పూర్తిగా తగ్గలేదన్న భావన సమాజంలో వినిపిస్తోంది.

పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషించినప్పటికీ, ఉద్యమంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన అనేక మంది విద్యార్థి నాయకులు, ఉద్యమకారులు తమకు తగిన గుర్తింపు దక్కలేదని పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొన్నవారు, విద్యను మధ్యలోనే వదిలేసినవారు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయినవారు, తమ జీవితాలను ఉద్యమానికి అంకితం చేసినవారు నేడు కూడా సాధారణ జీవితానికే పరిమితమయ్యారు.  ఆ దిశగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేశవరావు (కేకే) కమిటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యమంలో పాల్గొన్న అసలైన ఉద్యమకారులను గుర్తించడం, వారి అభిప్రాయాలను సేకరించడం, వారికి అందించాల్సిన ప్రయోజనాలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఈ కమిటీ కేవలం నివేదిక సమర్పించే కమిటీగా కాకుండా, ఉద్యమకారుల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకువచ్చే కమిటీగా నిలవాల్సిన అవసరం ఉంది.

ఉద్యమకారులు చేస్తున్న అనేక డిమాండ్లలో కొన్ని సామాజికంగా, చారిత్రకంగా, నైతికంగా పరిశీలించదగినవే. అమరవీరుల కుటుంబాలకు మరింత భరోసా కల్పించడం, వారి త్యాగాలను శాశ్వతంగా గుర్తుంచేలా విశ్వవిద్యాలయాల్లో స్మారక స్తూపాలు ఏర్పాటు చేయడం, ఉద్యమ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడం వంటి అంశాలు భవిష్యత్ తరాలకు చరిత్రను చేరవేసే కార్యక్రమాలుగా నిలుస్తాయి. ఇవి కేవలం సంక్షేమ చర్యలు కాదు; తెలంగాణ ఆవిర్భావానికి కారణమైన చరిత్రను సంరక్షించే బాధ్యత.  అయితే మరోవైపు కొన్ని డిమాండ్లు ఆర్థిక, రాజ్యాంగ, పరిపాలనా పరమైన కోణాల్లో సమగ్ర పరిశీలన అవసరం. ఉదాహరణకు ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్, పెద్ద మొత్తంలో నగదు సాయం, భారీ సబ్సిడీలతో రుణాలు, ప్రతి ఉద్యమకారునికి గృహ స్థలం, ఇల్లు వంటి ప్రతిపాదనలు అమలులోకి తీసుకురావాలంటే వాటి చట్టపరమైన, ఆర్థిక ప్రభావాలను ప్రభుత్వం నిశితంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రజా ధనాన్ని వినియోగించే ప్రతి నిర్ణయం రాజ్యాంగ నిబంధనలు, సమాన అవకాశాల సూత్రం, రాష్ట్ర ఆర్థిక సామర్థ్యానికి అనుగుణంగా ఉండాలి. కాబట్టి ఈ అంశాలపై భావోద్వేగాల కంటే వాస్తవ పరిస్థితుల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం అవసరం. అయినప్పటికీ ఒక విషయం మాత్రం స్పష్టం. ఉద్యమకారులు కోరుకుంటున్నది కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాదు; తమ త్యాగానికి సమాజం, ప్రభుత్వం నుంచి గుర్తింపు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో తమ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలవాలనే ఆకాంక్ష. తమ పోరాటం వల్లే నేటి తెలంగాణ సాధ్యమైందనే భావనకు తగిన గౌరవం లభించాలనే అభిలాష.

ప్రభుత్వం కూడా ఉద్యమకారుల అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా చారిత్రక బాధ్యతగా చూడాలి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి కారణమైన వేలాది మంది సాధారణ విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజా సంఘాల కార్యకర్తలు చరిత్రలో భాగమే. వారి త్యాగాన్ని ఏ రాజకీయ పార్టీ సొంతం చేసుకోలేను. అలాగే ఏ ప్రభుత్వం వారిని విస్మరించే హక్కు కూడా లేదు.కేకే కమిటీపై ఇప్పుడు భారీ బాధ్యత ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల అభిప్రాయాలను సేకరించి, పారదర్శక ప్రమాణాలతో సమగ్ర నివేదిక రూపొందించి, అమలు చేయగల సూచనలను ప్రభుత్వానికి అందించాలి. నివేదికలు సిద్ధం చేసి అల్మారాల్లో దాచే సంప్రదాయం కాకుండా, నిర్దిష్ట కాలపట్టికతో అమలు జరిగే విధంగా సిఫార్సులు ఉండాలి. ముఖ్యంగా అమరవీరుల కుటుంబాల సంక్షేమం, ఉద్యమ చరిత్ర పరిరక్షణ, నిజమైన ఉద్యమకారుల గుర్తింపు వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఇప్పటికే దశాబ్దం దాటింది. ఉద్యమకారుల ఆశలు కూడా అంతే కాలంగా ఎదురుచూస్తున్నాయి. ఈ నిరీక్షణ మరింత పొడగకూడదు. ఎందుకంటే చరిత్రను నిర్మించిన వారిని చరిత్ర మర్చిపోతే అది సమాజానికి మంచిది కాదు. ఉద్యమకారులకు న్యాయం చేయడం అనేది ఒక వర్గానికి మేలు చేయడం కాదు; తెలంగాణ ఆవిర్భావ చరిత్రకు గౌరవం ఇవ్వడం. అందుకే ఈ అంశాన్ని ప్రభుత్వం రాజకీయ వాగ్దానంగా కాకుండా, రాష్ట్ర నిర్మాణంలో భాగమైన ప్రజల పట్ల తన నైతిక బాధ్యతగా స్వీకరించి, పారదర్శకంగా, న్యాయబద్ధంగా, సమయపాలనతో చర్యలు తీసుకుంటేనే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది.



జనార్ధన్
తెలంగాణ విద్యార్థి
ఉద్యమకారుడు
9603972251

# శిలల్లో శాస్త్రం... కాకతీయుల అపూర్వ ఇంజనీరింగ్ వైభవం

తెలంగాణ చరిత్రను తిరగేస్తే శౌర్యం, సాహసం, సంస్కృతి మాత్రమే కాదు... శాస్త్రీయ ఆలోచన, సాంకేతిక ప్రతిభ, నిర్మాణ విజ్ఞానం కూడా ప్రతి పుటలో దర్శనమిస్తాయి. అలాంటి మహోన్నత నాగరికతకు ప్రతీకగా నిలిచిన కాకతీయుల వేయి స్తంభాల గుడి కేవలం ఒక దేవాలయం కాదు; అది భారతీయ ఇంజనీరింగ్ ప్రతిభకు చిరస్మరణీయ సాక్ష్యం. శతాబ్దాలు గడిచినా చెక్కుచెదరని దృఢత్వంతో నిలిచిన ఈ కట్టడం, ఆధునిక యంత్రాలు, కంప్యూటర్లు, సిమెంట్, ఉక్కు లేకుండానే మన పూర్వీకులు ఎంతటి శాస్త్రీయ దృష్టితో నిర్మాణాలు చేపట్టారో ప్రపంచానికి చాటుతోంది.

ఈరోజు ప్రపంచం “సస్టైనబుల్ ఇంజనీరింగ్”, “గ్రీన్ బిల్డింగ్స్”, “ఎర్త్‌క్వేక్ రెసిస్టెంట్ స్ట్రక్చర్స్”, “నేచురల్ వెంటిలేషన్” వంటి భావనలను గొప్ప ఆవిష్కరణలుగా చర్చిస్తోంది. కానీ ఎనిమిది వందల సంవత్సరాల క్రితమే కాకతీయులు ఈ సూత్రాలను ఆచరణలో పెట్టారు. ప్రకృతిని గురువుగా స్వీకరించి, స్థానిక వనరులను శాస్త్రీయంగా వినియోగించి, కళ--శాస్త్రాలను సమన్వయం చేసి నిర్మించిన వేయి స్తంభాల గుడి నేటి ఇంజనీరింగ్ ప్రపంచానికీ ఆశ్చర్యం కలిగిస్తోంది.

క్రీ.శ. 1163 ప్రాంతంలో రుద్రదేవుడు నిర్మించిన ఈ ఆలయం త్రికూటాలయ శైలికి అద్భుత ఉదాహరణ. శివుడు, విష్ణువు, సూర్యదేవునికి ఒకే ప్రాంగణంలో ఆలయాలు నిర్మించడం ద్వారా మతసామరస్యాన్ని ప్రతిబింబించడమే కాకుండా, నిర్మాణ పరంగా కూడా సమతుల్యతను సాధించారు. ప్రతి గర్భగృహం, ప్రతి మండపం, ప్రతి స్తంభం ఒక నిర్దిష్ట గణిత సూత్రం ఆధారంగా అమర్చబడింది. ఇది యాదృచ్ఛిక నిర్మాణం కాదు; ఖచ్చితమైన ప్రణాళికతో రూపొందించిన శాస్త్రీయ నిర్మాణం.

వేయి స్తంభాల గుడి పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది స్తంభాల వైభవం. అయితే అవి కేవలం అలంకరణ కోసం చెక్కిన శిల్పాలు కావు. మొత్తం నిర్మాణ భారాన్ని సమానంగా మోయడానికి రూపొందించిన శాస్త్రీయ వ్యవస్థ. ఒకే ప్రాంతంలో భారం కేంద్రీకృతం కాకుండా అనేక స్తంభాల ద్వారా విభజించడం వల్ల నిర్మాణం శతాబ్దాల పాటు నిలిచింది. నేడు ఆధునిక నిర్మాణ శాస్త్రంలో ఉపయోగిస్తున్న “లోడ్ డిస్ట్రిబ్యూషన్” సూత్రానికి ఇది అద్భుత ఉదాహరణ. ఈ దేవాలయంలో ఉపయోగించిన రాతి ఎంపిక కూడా విశేషమే. భారాన్ని మోయాల్సిన చోట దృఢమైన డోలరైట్, గ్రానైట్ వంటి రాళ్లను, శిల్పకళ కోసం మృదువైన రాళ్లను ఉపయోగించడం ద్వారా నిర్మాణ శాస్త్రంపై కాకతీయులకు ఉన్న అవగాహన స్పష్టమవుతుంది. ఒక నిర్మాణానికి ఏ పదార్థం ఎక్కడ ఉపయోగించా లనే ఇంజనీరింగ్ దృష్టి లేకుండా ఇది సాధ్యం కాదు.



ఇంకా ఆశ్చర్య కరమైన విషయం ఏమిటంటే ఈ ఆలయంలో సిమెంట్ లేదు, ఇనుప కడ్డీలు లేవు. అయినప్పటికీ రాళ్లను ఖచ్చితమైన కొలతలతో చెక్కి, ఒకదానితో ఒకటి బిగుసుకునే విధంగా అమర్చారు. దీనినే నేడు “డ్రై స్టోన్ జాయింటింగ్” అని పిలుస్తున్నారు. ప్రతి రాయి తన బరువుతోనే నిర్మాణాన్ని నిలబెట్టేలా రూపకల్పన చేయడం అప్పటి శిల్పుల అసాధారణ ప్రతిభకు నిదర్శనం. పునాది నిర్మాణం కూడా అంతే శాస్త్రీయంగా ఉంది. నేల స్వభావాన్ని పరిశీలించి ఇసుక, కంకర, రాళ్లు, సున్నంతో పొరలుగా పునాది వేయడం ద్వారా భూకంపాలు, వర్షాల ప్రభావాన్ని తగ్గించే విధానా న్ని అనుసరించారు. నేటి భూకంప నిరోధక నిర్మాణ సూత్రాలను గుర్తు చేసే ఈ విధానం కాకతీయుల శాస్త్రీయ దూరదృష్టిని చాటుతుంది.

వేయి స్తంభాల గుడి మరో ప్రత్యేకత సహజ గాలి, వెలుతురు వినియోగం. మండపాల నిర్మాణం వల్ల అన్ని వైపుల నుంచి గాలి ప్రసరిస్తుంది. వేసవిలో కూడా ఆలయం చల్లగా ఉండేలా రూపకల్పన చేశారు. విద్యుత్ లేని కాలంలో సహజ వాతావరణ నియంత్రణకు ఇది అత్యుత్తమ ఉదాహరణ. వర్షపు నీరు నిల్వ కాకుండా ప్రత్యేక పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా నిర్మాణం దీర్ఘకాలం మన్నేలా చేశారు. నేడు “గ్రీన్ ఆర్కిటెక్చర్” పేరుతో ప్రచారం చేస్తున్న అంశాలు అప్పుడే ఆచరణలో ఉండటం విశేషం.

ఈ ఆలయంలోని ప్రతి శిల్పం ఒక చరిత్ర. ఏనుగులు, గుర్రాలు, నర్తకులు, యోధులు, దేవతామూర్తులు కేవలం కళాత్మక అలంకరణ మాత్రమే కాదు; కాకతీయుల సామాజిక జీవనం, సంస్కృతి, సంగీతం, యుద్ధకళలు, వస్త్రధారణ, వ్యవసాయ సంపదకు ప్రతిబింబం. అంటే ఈ దేవాలయం ఒక శిలా గ్రంథం. చరిత్రను చదవాలంటే పుస్తకాలు మాత్రమే కాదు, ఈ శిల్పాలను కూడా చదవాలి.

నేటి యువతకు, ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు వేయి స్తంభాల గుడి ఒక ప్రత్యక్ష పాఠ్యాంశంగా మారాలి. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఇటువంటి వారసత్వ కట్టడాలను అధ్యయనం చేసే అవకాశం కల్పించాలి. భారతీయ నిర్మాణ విజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలంటే మనమే ముందుగా దానిని అర్థం చేసుకోవాలి. విదేశీ విశ్వవిద్యాలయాలు మన పురాతన నిర్మాణాలను అధ్యయనం చేస్తుంటే, మన విద్యా వ్యవస్థలో వాటికి తగిన స్థానం లేకపోవడం విచారకరం.

ఇటీవలి కాలంలో రామప్ప దేవాలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించడం తెలంగాణకు గర్వకారణం. అదే సమయంలో వేయి స్తంభాల గుడి వంటి చారిత్రక కట్టడాలపై అంతర్జాతీయ స్థాయిలో మరింత పరిశోధన, ప్రచారం అవసరం. పురావస్తు శాఖ, విశ్వవిద్యాలయాలు, నిర్మాణ శాస్త్ర నిపుణులు కలిసి ఈ ఆలయంలోని నిర్మాణ సూత్రాలను శాస్త్రీయంగా డాక్యుమెంట్ చేయాలి. ఆధునిక నిర్మాణ రంగానికి ఉపయోగపడే అనేక అంశాలు ఈ అధ్యయనాల ద్వారా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అభివృద్ధి అంటే కేవలం కొత్త భవనాలు నిర్మించడం కాదు; గతం నుంచి వచ్చిన జ్ఞానాన్ని భవిష్యత్తుకు అందించడం కూడా. కాకతీయుల నిర్మాణ వారసత్వం మన చరిత్రలో ఒక అధ్యాయం మాత్రమే కాదు; అది శాస్త్రీయ ఆలోచనకు, ప్రకృతి పట్ల గౌరవానికి, కళాత్మక సృజనకు ప్రతీక. ఈ వారసత్వాన్ని సంరక్షించడం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడి బాధ్యత కూడా. చారిత్రక కట్టడాలను కాపాడితేనే చరిత్రను కాపాడినట్టవుతుంది.

వేయి స్తంభాల గుడి మనకు చెప్పే గొప్ప సందేశం ఒక్కటే- సాంకేతికత అనేది యంత్రాల్లో మాత్రమే ఉండదు; అది మనిషి మేధస్సులో ఉంటుంది. ప్రకృతిని అర్థం చేసుకున్నప్పుడు, గణితాన్ని కళతో మేళవించినప్పుడు, విజ్ఞానాన్ని సంస్కృతితో కలిపినప్పుడు శాశ్వత సృష్టులు పుడతాయి. అందుకే వేయి స్తంభాల గుడి తెలంగాణ గర్వకారణం మాత్రమే కాదు; భారతీయ మేధస్సుకు, కాకతీయుల సృజనాత్మక దూరదృష్టికి, ప్రపంచ నిర్మాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే శాస్త్రీయ వారసత్వానికి ప్రతీక. దానిని కేవలం పర్యాటక కేంద్రముగా కాకుండా, ఇంజనీరింగ్ విశ్వవిద్యాలయంలా అధ్యయనం చేసే రోజు వచ్చినప్పుడే మనం నిజమైన అర్థంలో మన వారసత్వాన్ని గౌరవించినవారమవుతాం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజం తోడ్పడాలి

- డాక్టర్ జయప్రకాశ్ నారాయణ




**అల్వాల్, జూలై 15 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజమంతా భాగస్వాములు కావాలని ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ పిలుపునిచ్చారు. అల్వాల్‌లోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్‌డీఆర్ సైన్స్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలపై ఏటా భారీగా నిధులు వెచ్చిస్తున్నప్పటికీ, నాణ్యమైన విద్య కోసం స్థానికులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకొచ్చి సైన్స్ ల్యాబ్‌లు, ఇతర విద్యా సదుపాయాల కల్పనకు తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు ఎవరి సొత్తు కావని, అవి సమాజ ఆస్తి అని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాల పిల్లలకు కూడా నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, సమాజం కలిసి పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు.

# హనీట్రాప్ పేరుతో అంతర్రాష్ట్ర ముఠా దోపిడి

- పోలీసుల వేషంలో దోపిడీ.. ముఠా అరెస్ట్
- రూ.8 లక్షల వసూళ్లు.. బంగారం, నగదు స్వాధీనం

**అల్వాల్, జూలై 15 (జనంసాక్షి) :** హనీట్రాప్‌తో వ్యాపారిని వలలో వేసి, పోలీసులమంటూ అపహరించి దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను అల్వాల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో హర్యానా, చండీగఢ్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, 3.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.3.8 లక్షల నగదు, నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మాచబొల్లారం ఐస్‌ఫ్యాక్టరీ రోడ్డులో గతేడాది నవంబరు 14న వ్యాపారి గార్లపాటి వెంకట దుర్గ నాగేశ్వర సిద్ధార్థను పోలీసులు అంటూ స్కార్పియో




వాహనంలో ఎక్కించుకున్న నిందితులు తుపాకీతో బెదిరించి దాడి చేశారు. అనంతరం 98.3 గ్రాముల బంగారు ఆభరణాలు, డెల్ ల్యాప్‌టాప్, వన్‌ప్లస్ మొబైల్ ఫోన్‌ను దోచుకుని, కుటుంబ సభ్యుల నుంచి రూ.8 లక్షలు వసూలు చేశారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ –ఒడిశా సరిహద్దులోని బెర్హంపూర్ అటవీ ప్రాంతంలో బాధితుడిని వదిలేసి పరారయ్యారు. వీసా ఇప్పిస్తామని నమ్మించి బాధితుడిని వలలోకి దింపడంతో పాటు అతడి కదలికలను ప్రధాన నిందితులకు చేరవేసిన మరో ఇద్దరిని పోలీసులు గతంలోనే అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు నాగరాజు రఘువర్మ మరో కేసులో ఇప్పటికే జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. కేసు దర్యాప్తులో భాగంగా అల్వాల్ ఇన్‌స్పెక్టర్ కె. వీరబాబు, ఎస్ఐ చంద్రశేఖర్ నేతృత్వంలోని బృందం హర్యానా, చండీగఢ్‌లో ప్రత్యేక గాలింపు చేపట్టి పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసింది. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. డీసీపీ చి. శ్రీధర్ పర్యవేక్షణలో అదనపు డీసీపీ కె. రామ్‌కుమార్, ఏసీపీ పి. గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని డీసీపీ అభినందించారు.

# రైతులను కించపరిచే వైఖరి మంచిది కాదు

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**మక్తల్, జూలై 15 (జనంసాక్షి) :** రైతులను కించపరిచే వైఖరి మంచిది కాదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మక్తల్‌లో నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఎన్నికల హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. యూరియా రైతులకు అందుబాటులో లేకపోవడంతో పాటు యూరియా యాప్ కూడా సరిగా పనిచేయడం లేదన్నారు. సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, రెండు రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వం ఉన్నప్పటికీ సమన్వయం లేకపోవడం వల్ల నీటి విడుదల జరగడం లేదని విమర్శించారు. నియోజకవర్గంలో తరచూ విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మక్తల్ కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు సరైన



పరిహారం చెల్లించడం లేదని ఆరోపించారు. పైపులైన్ పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయని, దీంతో పైపులు పగిలి రైతులకు మరింత నష్టం జరుగుతోందన్నారు. ఇసుక, మొరం, మట్టి అక్రమ రవాణాతో భారీ టిప్పర్లు రహదారులను ధ్వంసం చేస్తున్నాయని, అభివృద్ధికి తమ మద్దతు ఉన్నప్పటికీ ప్రకృతికి నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవంగా శంకుస్థాపనలకే పరిమితమైందని, ఒకే పనికి పలుమార్లు శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులపై ముందుగానే రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించి ఉంటే పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉండేదని అన్నారు. సగం సీజన్ పూర్తయిన తర్వాత వరి సాగు చేయొద్దని చెప్పడం రైతులకు ఉపయోగం కాదని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు రౌడీయిజం, గుండాయిజానికి పాల్పడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రైతులను కించపరిచే విధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు, గుర్లపల్లి సర్పంచ్ గాల్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ ఈశ్వర్ యాదవ్, గార్లపల్లి నర్సింహా రెడ్డి, జుట్ల సాగర్, శివారెడ్డి, గుంటి రఘు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో భద్రత మరింత పటిష్ఠం

- ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్



**బోడుప్పల్, జూలై 15 (జనంసాక్షి) :** కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మేడిపల్లి పోలీసుల ఆధ్వర్యంలో చెంగిచెర్లలోని బీఎంఆర్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 100 సీసీ కెమెరాలను ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, ఐపీఎస్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన 'మీ సురక్ష' అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నిబంధనలు, షీ టీమ్స్ సేవలు, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుని తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఏసీపీ, డీఐ ఎలక్షన్ రెడ్డి, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి, సెక్టార్ ఎస్ఐ, పోలీసు సిబ్బంది, పాఠశాల యాజమాన్యం జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ఫరూక్‌నగర్, జూలై 15 (జనంసాక్షి) :** ఫరూఖ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. బుధవారం 12, 13, 14 వార్డుల పరిధిలోని బూత్ నంబర్లు 227, 228, 231, 234 కేంద్రాలను సందర్శించి జరుగుతున్న నమోదు, ధృవీకరణ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులు, బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు సేవలు అందిస్తూ సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్ దిలీప్ కుమార్, రిజ్వానా బేగం, ముబారక్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, నవీన్, గంగామోని సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ ముదిరాజ్, బీఎల్‌వోలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయోగాత్మక విద్యతో శాస్త్రీయ దృక్పథం పెంపు

- అల్వాల్‌లో ఎఫ్‌డీఆర్ సైన్స్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**అల్వాల్, జూలై 15 (జనంసాక్షి) :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు ప్రయోగాత్మక విద్యకు ప్రాధాన్యం అవసరమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అల్వాల్‌లోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆరో నుంచి పదో తరగతి విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ అంశాలను ప్రయోగాల ద్వారా సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఈ కేంద్రం కల్పిస్తుందని తెలిపారు. బట్టీ పట్టే విధానానికి బదులుగా పరిశీలన, ప్రయోగాలు, జిజ్ఞాస, విమర్శనాత్మక ఆలోచనకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అనుభవపూర్వక బోధనపై దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఇతర పాఠశాలల్లోనూ ఇలాంటి సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. విద్యాభివృద్ధికి ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తే ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి సైన్స్ సెంటర్‌లోని పరికరాలను పరిశీలించి, వాటి వినియోగంపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ కేంద్రం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అనుభవపూర్వక విజ్ఞానాన్ని అందించే వేదికగా



నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వి. విజయేంద్ర ప్రసాద్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బల్కంపేట బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్ఆర్‌నగర్ పోలీసుల అఖిలపక్ష శాంతి సమావేశం
- శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి
- జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ రమణారెడ్డి

**హైదరాబాద్, జూలై 15 (జనం సాక్షి) :** బాల్కంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి బోనాలు, కల్యాణోత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ రమణారెడ్డి పిలుపునిచ్చారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సోమవారం అఖిలపక్ష శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీపీ రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు సమన్వయంతో, సహనంతో వ్యవహరించాలని సూచించారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్‌తో




పాటు భారీ పోలీసు బందోబస్తు ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ శ్రీకాంత్, ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ రాఘవేంద్ర రావు, బాల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వినోద్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐలు మధుసూదన్, రాజు రాథోడ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## షాద్‌నగర్ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- 12వ వార్డులో 10 లక్షల సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**ఫరూక్‌నగర్, జూలై 15 (జనంసాక్షి) :** షాద్‌నగర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ 12వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో షాద్‌నగర్ వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి



వార్డులో అవసరమైన నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ కుమార్, రిజ్వానా బేగం, ముబారక్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, నవీన్, గంగామోని సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ ముదిరాజ్, బీఎల్‌ఓలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలి

- బోగస్ ఓట్లకు తావుండొద్దు
- నాలుగు వార్డుల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ పరిశీలన
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల

**తాండూర్, జూలై 15 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని తాండూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ తాండూర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల బుధవారం తాండూర్ మండలంలో విస్తృతంగా పర్యటించి ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. తాండూర్ టౌన్‌లోని 1, 8, 28, 36 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి జరుగుతున్న ప్రక్రియను స్వయంగా పరిశీలించడంతో పాటు బిఎల్ ఓలు, బిఎల్ ఎలు, స్థానిక ప్రజలతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి పంజుగుల



మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటే ప్రాణం. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకూడదు. అదే సమయంలో బోగస్ ఓట్లకు ఏమాత్రం అవకాశం ఉండకూడదు. ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారమే రూపొందాలి అని స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ విధుల్లో ఉన్న కొందరు బిఎల్ ఓలకు పూర్తి స్థాయి అవగాహన అవసరమని, అధికార యంత్రాంగం వారికి తగిన మార్గదర్శకాలు అందించి ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఫామ్ – 6, ఫామ్ – 8 దరఖాస్తులపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని, అపోహలకు తావివ్వకుండా ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని కోరారు. ఈ నెల 24వ తేదీతో సర్ ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటి వరకు ఫారాలు అందని వారు వెంటనే బిఎల్ ఓలు లేదా బిఎల్ఎలను సంప్రదించి ఫారాలు తీసుకుని నింపి తిరిగి అప్పగించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే, తమ దృష్టికి వచ్చే బోగస్ ఓట్ల వివరాలను పార్టీ ప్రతినిధులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటుకు విలువ ఉందని, నిజమైన ఓటరికి న్యాయం జరగడం, అక్రమ నమోదు జరగకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీశైల్ రెడ్డి పంజుగుల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, పెట్లోళ్ల నర్సింహులు, ఫ్లోర్ లీడర్ దీపా నర్సింహులు, సీనియర్ మహిళా నాయకురాలు శోభారాణి, శ్రీనివాస్ చారి, సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హస్తినాపురం ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్, జూలై 15 (జనం సాక్షి) :** హస్తినాపురం డివిజన్ శ్రీరమణ కాలనీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఘటనాస్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమీపంలోని ఓ ఇంటిలో ఫర్నిచర్, సామగ్రి అగ్నికి ఆహుతి కాగా, ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. నివాస ప్రాంతాల్లో గోదాములు ఏర్పాటు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించిన ఎమ్మెల్యే, బాధితులకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో డివిజన్ బారస అధ్యక్షులు ఆందోజు సత్యం చారి శ్రీనివాస్ నాయక్ గోపి మధు, భీమ్ నాయక్ నాగిరెడ్డి ఆది యాదవ్ బిక్షపతి విష్ణు మధు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
16 జూలై 2026

# అద్దె వాహనాల సంఘం ఆధ్వర్యంలో కార్లతో ర్యాలీ, నిరసన

- యజమానుల ఆందోళన
- నెలవారీ అద్దె పెంచాలి, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి
- జీవన వ్యయం, డీజిల్ ధరలు పెరిగినా అద్దె మాత్రం పెరగలేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలి
- జిల్లా అద్దె వాహనాల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్



**నాగర్‌కర్నూల్, జూలై 15 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో అద్దె ప్రాతిపదికన వాహనాలు నడుపుతున్న యజమానుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం జిల్లా అద్దె వాహనాల సంఘం ఆధ్వర్యంలో తమ కార్ల తో ర్యాలీ నిర్వహించి,భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న అద్దె ప్రాతిపాదికన పనిచేస్తున్న కార్ల యజమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వాహన యజమానులు, డ్రైవర్లు, సంఘం నాయకులు నిరసనలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అద్దె వాహనాల సంఘం అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ శాఖలకు అద్దెకు వాహనాలు అందిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో కీలక భాగస్వాములుగా పనిచేస్తున్నప్పటికీ తమ సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా నెలవారీ అద్దెను ప్రభుత్వం పెంచలేదని, అదే సమయంలో డీజిల్ ధరలు, వాహనాల విడిభాగాల ధరలు, టైర్ల ధరలు, ఇంజిన్ ఆయిల్, బీమా ప్రీమియంలు, ఫిట్‌నెస్ ఫీజులు, రోడ్ ట్యాక్స్, డ్రైవర్ల వేతనాలు, వాహనాల మరమ్మతుల ఖర్చులు విపరీతంగా పెరిగాయని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం చెల్లిస్తున్న పాత అద్దెతో వాహనాలను నడపడం అసాధ్యంగా మారిందని, అనేక మంది వాహన యజమానులు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల నుంచి తీసుకున్న రుణాల వాయిదాలు సకాలంలో చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇతర కుటుంబ అవసరాలు తీర్చుకోవడం కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలకు వాహనాలు అందించడంలో ఎప్పుడూ వెనుకడుగు వేయలేదని, అధికారులు పర్యటనలు, అభివృద్ధి కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితులు, ఎన్నికలు, విపత్తుల సమయంలో రాత్రింబవళ్లు సేవలందిస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ తమ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ దయనీయ పరిస్థితిని అర్థం చేసుకుని నెలవారీ అద్దెను ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని, భవిష్యత్తులో బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా ప్రత్యేక విధానాన్ని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించి వేలాది మంది వాహన యజమానుల కుటుంబాల్లో వెలుగు నింపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి అద్దె వాహనాలు అందిస్తున్న యజమానులు నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అద్దె రేట్లు ప్రస్తుత పరిస్థితులకు ఏమాత్రం సరిపోవడం లేదని, పెరుగుతున్న నిర్వహణ వ్యయంతో వాహనాలను నడపడం భారంగా మారిందని తెలిపారు. అధికారుల పర్యటనలు, వైద్య, విద్య, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, పోలీస్, ఎన్నికలు తదితర అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో అద్దె వాహనాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం సేవలను వినియోగించుకుంటున్నప్పటికీ వాహన యజమానుల సమస్యల పరిష్కారంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. అద్దె రేట్లను వెంటనే పెంచడంతో పాటు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, వాహనాల నిర్వహణ వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జీవో జారీ చేయాలని, ప్రభుత్వ శాఖల్లో అద్దె వాహనాల విధానంపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే జిల్లా స్థాయిలో ప్రారంభమైన ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వాహన యజమానులు చేతుల్లో స్టీరింగ్ మీదనుంచే తమ సమస్యలను నినాదాల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అద్దె రేట్లు పెంచాలి, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి, వాహన యజమానులను ఆదుకోవాలి, జై డ్రైవర్ అన్న, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై త్వరగా స్పందించి సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రహమాన్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ శంకర్, అద్దె వాహనాల సంఘం నాయకులు బాలరాజ్ గౌడ్, నరేందర్ , రామకృష్ణ, శ్రీధర్, అశోక్, సందీప్, కాశీ, కురుమూర్తి, వినోద్, పరశురాం, శంకర్ వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్లు, సభ్యులు, జిల్లాలోని పలు మండలాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని సంఘం నాయకులు స్పష్టం చేశారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు నిధులు కేటాయిస్తాం

- మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్, జూలై 15 (జనంసాక్షి) :** మక్తల్ మండలంలోని పారేవుల శంకర లింగేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పారేవుల విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. చాలాకాలంగా మరమ్మతులకు నోచుకోని లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని ప్రతినిధులు కోరగా, అవసరమైన నిధులు విడుదల చేయించి మరమ్మతులు పూర్తి చేసి సాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పారేవుల విష్ణువర్ధన్ రెడ్డి, లిఫ్ట్ ఇరిగేషన్ అధ్యక్షుడు ఎం. గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేష్, మాజీ సర్పంచ్ మనీ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్ప్‌డెస్క్ పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**మక్తల్, జూలై 15 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపాలిటీ 16వ వార్డులోని హెల్ప్ డెస్క్ ను అడిషనల్ కలెక్టర్ శీను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో జరుగుతున్న సర్ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను గురించి స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కారి పావని ని అడిగి తెలుసుకున్నారు. 16వ వార్డులో దాదాపు 62 శాతం సర్ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిందని, మున్సిపాలిటీలోనే అత్యధికంగా ఈ వార్డులో ప్రక్రియ జోరుగా సాగుతుందని కొనియాడారు. హెల్ప్ డేస్ లో అందుతున్న సహకారం గురించి వార్డు కౌన్సిలర్ ను అభినందించారు. ఇంకా సర్ ఫార్ములా ప్రక్రియ పూర్తికాని వారు త్వరగా ఫామ్ లో నింపి సిబ్బందికి అందించడంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాసిల్దార్ సతీష్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి, తాహెర్ ,బిఎల్ఓ మంజుల, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్కారి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ శాలం, కోఆప్షన్ సభ్యులు ఉసాముద్దీన్,16వ వార్డు నాయకులు రంజాన్, బాసిత్, యూసుఫ్ ,మహమ్మద్, అఫ్రోజ్, ఆనంపల్లి రమేష్, రాజేష్, సంతోష్, రాము, ఖదీర్, నాదర్, అలీ, గులాం నబి, రషీద్, నాసర్ తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**పటాన్‌చెరు, జూలై 15 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసులు, అత్యాచార కేసులు, డౌరీ డెత్ కేసుల్లో న్యాయమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి కేసులో చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం నాడు పటాన్ చెర్వు సబ్-డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయాన్ని సందర్శించి డీఎస్పీ ప్రభాకర్ తో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం డీఎస్పీ కార్యాలయ రికార్డులను, దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులను పరిశీలిస్తూ వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. హైదరాబాద్ నగరానికి పటాన్చెరు అనుకోని ఉండటం, పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఉద్యోగులు,కార్మికులు, ఉపాధి కూలీలు రాకపోకల కారణంగా అధిక ట్రాఫిక్ సమస్య ఉంటుందని, భూముల విలువ పెరగడంతో ఆస్తి సంబంధిత నేరాలు జరిగే అవకాశాలు కూడా అధికంగా ఉంటాయని అన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ కార్యక్రమాలు నిర్వహించడం, ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను (క్రైమ్ ప్రోన్ ఏరియాలు) బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, పగలు-రాత్రి బీట్ విధుల్లో నిఘా పెంచెలా సబ్ డివిజన్ పరిదిలో ఎస్ హెచ్ ఓ లకు సూచనలు చేయాలని డిఎస్పీకి సూచించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ఆయా కాలనీ లలో,గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని అన్నారు. తనిఖీలకు సంబంధించిన విజిటింగ్ కాపీలను జిల్లా పోలీసు కార్యాలయానికి సకాలంలో పంపించాలని సూచించారు. ప్రతి రికార్డు సీసీటీఎన్ఎస్‌లో నమోదు అయ్యేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు.డీఎస్పీ కార్యాలయ సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## మెథడిస్ట్ చర్చి భూముల పరిరక్షణకు సీఎం జోక్యం చేసుకోవాలి

**సంగారెడ్డి, జూలై 15 (జనం సాక్షి) :** జహీరాబాద్‌లోని మెథడిస్ట్ చర్చి, మెథడిస్ట్ రూరల్ హైస్కూల్ భూములను రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని వాటిని పరిరక్షించి, శాంతి భద్రతలు కాపాడాలని కోరుతూ మెథడిస్ట్ చర్చ్ ఇన్ ఇండియా – హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ ప్రతినిధులు జిల్లా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కు వినతిపత్రం సమర్పించారు. బుధవారం నాడు సంగారెడ్డి జిల్లా మెథడిస్ట్ పాస్టర్లు, హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ ప్రతినిధులు, డీకన్స్‌లు, విద్యాసంస్థల ప్రతినిధులు, చర్చ్ సభ్యులు సంగారెడ్డి పట్టణంలోని సి ఎస్ ఐ చర్చ్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి వారు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏవో ద్వారా జిల్లా కలెక్టర్ కు అందచేశారు. ఈ సందర్భంగా మెథడిస్ట్ ప్రతినిధులు బిషప్ డా.సిమియోన్, రెవరెండ్ డా.స్టీవెన్ లు మాట్లాడుతూ జహీరాబాద్ మెథడిస్ట్ చర్చ్ కు సుమారు 170 ఏళ్ల చరిత్ర ఉందని, మెథడిస్ట్ రూరల్ హైస్కూల్‌ను దాదాపు 100 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్ పరిధిలోని జహీరాబాద్ లో అనేక చర్చిలు, వందలాది మంది పాస్టర్లు




ఎలాంటి సమస్యలు లేకుండా సేవలందిస్తున్నారని వారు తెలిపారు. ఇటీవల కొందరు సంఘ విద్రోహ, చర్చి వ్యతిరేక శక్తులు చర్చి, పాఠశాల భూముల విషయంలో జోక్యం చేసుకుంటున్నారని, చట్టాన్ని అమలు చేసి ఆస్తులను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. చర్చి, విద్యాసంస్థల పరిపాలన యథావిధిగా కొనసాగేందుకు అవసరమైన భద్రత, పరిరక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## గ్రామాల రీసర్వేకు లైసెన్స్ సర్వేయర్లు సహకరించాలి



**గద్వాల నడిగడ్డ, జూలై 15 (జనం సాక్షి) :** ప్రభుత్వం గ్రామాల రీసర్వేకు జిల్లాలో మొదటి దశలో 70 గ్రామాలను ఎంపిక చేసిందని, లైసెన్స్ సర్వేయర్లు సహకరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రీసర్వేకు సంబంధించి జిల్లాలోని లైసెన్స్ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల రీసర్వేకు నిర్ణయించినందున లైసెన్స్ పొందిన సర్వేయర్లకు పారితోషికం చెల్లించి సర్వే పనులు చేయించుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే పారితోషికం సరిపోదనే విమర్శలు చేయకుండా భవిష్యత్తులో లైసెన్స్ సర్వేయర్లకు మంచి అవకాశాలు వస్తాయనే ఆశావహ దృక్పథంతో ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు లైసెన్స్ సర్వేయర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు సర్వేకు సంబంధించి శిక్షణ ఇచ్చి అర్హులైన వారందరికీ లైసెన్స్ సర్వేయర్లుగా గుర్తింపు ఇచ్చినప్పటికీ తమకు స్థిరమైన ఉపాధి, ఆదాయ అవకాశాలు ఇవ్వనందున ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. గ్రామాల రీసర్వేకు తమ సేవలందించాలంటే ప్రభుత్వం పారితోషికం పెంచాలని, టిఏ, డిఏ, తదితర అలవెన్స్ లు కల్పించాలన్నారు. లేదంటే ప్రతినెల కనీస వేతనంగా తమకు రూ.30000 చొప్పున చెల్లించాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో సర్వే ఏడి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలి



**తూప్రాన్, జూలై 15 (జనం సాక్షి) :** రసాయన ఎరువుల వాడు కానీ తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని తూప్రాన్ ఎంపీడీవో శాలిక తెలిపారు మండలం లోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో వాసన్ స్వచ్ఛంద సంస్థ ,టాటా గ్రూపు వారి సహకారంతో ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని తూప్రాన్ ఎంపీడీవో తేలు శాలిక, సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ తో కలిసి ప్రారంభించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాలని ఎంపీడీవో శాలిక సూచించారు. అధిక దిగుబడుల కోసం విషపూరితమైన రసాయన ఎరువులతో కూడిన పంటలను పండించి మన ఆరోగ్యాలను మనమే పాడు చేసుకుంటున్నామని సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గో ఆధారిత వ్యవసాయము భవిష్యత్ మానవ మునగడకు ఎంతో అవసరమని ఎంపీఓ సతీష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సతీష్, ఉప సర్పంచ్ స్వామి, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, వాసన్ కోఆర్డినేటర్లు వినయ్, బసవరాజు, పాలకవర్గ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఐకేపీ వివో ఏ, రైతులు పాల్గొన్నారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీ మూతపడే వరకు బీఆర్ఎస్ ఉద్యమం


- రసమయి బాలకిషన్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించం
- కాంగ్రెస్ నాయకుల ప్రజాక్షేత్రంలో చర్చ సవాల్
- మండల ప్రజల ఆరోగ్యం కోసం బాధ్యతతో ప్రజాక్షేత్రంలోకి చర్చకు మేము వస్తాం
- తేదీ, సమయం మీరే నిర్ణయించండి
- బీఆర్ఎస్ నాయకులు



**బెజ్జంకి, జూలై 15 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ మంగళవారం కాంగ్రెస్ నాయకులు ప్రజాక్షేత్రంలో చర్చలకు సిద్ధమని విసిరిన సవాలను మేము మండల ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి సవాలుగా కాకుండా ఇథనాల్ ఫ్యాక్టరీ మూసివేతే లక్ష్యంగా బాధ్యతతో స్వీకరిస్తున్నామని ప్రజాక్షేత్రంలోకి పూర్తి ఆధారాలతో మేము రావడానికి సిద్ధంగా ఉన్నామని మీరే తారీకు,సమయం తెలిపితే మేము వస్తామని అన్నారు.ఇథనాల్ ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేసే వరకు భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం కొనసాగుతుందని,మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని పాకాల మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.సీనియర్ నాయకుడు లింగాల లక్ష్మణ్ మాట్లాడుతూ స్థానిక ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల పర్యావరణ కాలుష్యం,నీటి వనరుల కలుషితం,చేపల మరణాలు,ప్రజల ఆరోగ్యం,పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని అన్నారు.ఈ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ నేతృత్వంలో ప్రజా ఉద్యమం కొనసాగుతోంది అనీ అన్నారు.ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు కాంగ్రెస్ హయాంలోనే మంజూరయ్యాయని,ఇప్పుడు ఉద్యమంపై విమర్శలు చేసే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదు అనీ అన్నారు.ఒకవేళ మీకే ప్రజల ఆరోగ్యంపై పట్టి ఉంటే మాతో కలిసి నడవండి లేదా మీరే ముందు నడిచి ఉద్యమంలో పాల్గొంటే మీతో కలిసి మేము కూడా నడుస్తాం అని అన్నారు.సవాళ్లు విసరడం కాదు మండల ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచించి మీరు కూడా ఉద్యమంలో పాల్గొనాలని అన్నారు.సీనియర్ నాయకులు కనగండ్ల తిరుపతి మాట్లాడుతూ బయో-పవర్ ప్లాంట్ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించి అనంతరం ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేశారని ఆరోపించారు.గ్రామసభ తీర్మానాల ద్వారా స్థానికులు అప్పట్లోనే తమ వ్యతిరేకతను వ్యక్తం చేసినప్పటికీ పట్టించుకోలేదు అనీ అన్నారు.ప్రభుత్వ భూములను పట్టా భూములుగా మార్చి పలుమార్లు రిజిస్ట్రేషన్ చేసిన అంశాలపై కూడా కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మేము మాటలతో సమాధానం చెప్పకుండా ఆధారాలతో మాట్లాడుతున్నామని ప్రజాక్షేత్రానికి రావడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.ప్రజల ఆరోగ్యం,పర్యావరణ పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమానికి కాంగ్రెస్ నాయకులు కూడా మద్దతు ఇవ్వాలని,లేకుంటే ప్రజలే రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేట జిల్లాను కరవు ప్రాంతంగా ప్రకటించాలి

- టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



**నారాయణపేట, జూలై 15 (జనం సాక్షి) :** ఎల్నోనో కారణంగా వర్షాలు కురియక నారాయణపేట జిల్లాలో పంటలు ఎండిపోయాయని రైతులను ఆదుకోవడం కోసం జిల్లాను కరవు ప్రాంతంగా ప్రకటించాలనీ టి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు గావినోళ్ల శ్రీనివాస్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం బాపన్‌పల్లి గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో తగినంత వర్షపాతం లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికిరాక తీవ్ర నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, జిల్లా వ్యాప్తంగా పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని,నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలపై వడ్డీ మినహాయింపు, అవసరమైన ఇతర సహాయ చర్యలు వెంటనే చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# యూరియా నేరుగా అందించాలి

- జిల్లా కలెక్టరేట్ ముందు ఏఐకేఎంఎస్ ధర్నా



**వరంగల్ ఈస్ట్, జూలై 15 (జనం సాక్షి) :** జిల్లా రైతులకు ఎరువులను నేరుగా అందించాలని అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) వరంగల్ జిల్లా నాయకులు ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చారు . సెల్ యాప్ ద్వారా గాని మీసేవ ద్వారా గాని రైతులకు కావలసినటువంటి యూరియా సకాలంలో అందక నష్టపోతారని సంఘం నాయకులు కలెక్టర్ గారికి వివరించారు. కొంతమంది రైతులకు భూములు ఉన్న పాస్ బుక్కులు లేకపోవడం మరి కొంతమందికి ఉన్న సెల్ నెంబరు లింకు కాకపోవడం వల్ల యూరియా బస్తాలు అందే అవకాశం కోల్పోతున్నారని కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానమైందని వారన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు పత్తి విత్తనాలు నాటి రెండు నెలలు కావస్తున్నదని ఎల్ నేనినో ప్రభావం వల్ల వర్షాలు పడనందున రైతులు ఇప్పటికీ రెండు సార్లు పత్తి విత్తనాలు నాటారని విత్తనాలు మొలకెత్తితే పరిస్థితి లేదని ఎకరానికి పదివేల రూపాయలు నష్టపోయిన రైతులు ఆదుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న ప్రత్యామ్నాయ పంటలు వేయడం కోసం విత్తనాలను ప్రభుత్వమే రైతులకు ఉచితంగా అందించాలని వారు డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి వడ్డీ మాఫీ చేయాలని కోరారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోయారని నకిలీ విత్తనాల అమ్మిన షాప్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని వారు కోరారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రెండు వందల రోజులు పని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వమును వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు ఉపాధ్యక్షులు గట్టి కృష్ణ కోశాధికారి బండి వెంకటేశ్వర్లు భద్రాజి భీమ గాని మల్లయ్య ప్రదీప్ అశోక్ ఇనుముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే..

- అందరూ సహకరించి సమస్యలు పరిష్కరించుకోవాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రీ సర్వేతో అన్ని రకాల భూముల సమస్యలు పరిష్కారమవుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం గణపురం మండలం, చెల్పూర్ రైతు వేదిక, ధర్మరావుపేటలో నిర్వహించిన భూముల రీ సర్వే గ్రామ సభలలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూముల రీ సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో ఆక్రమించిన అంశాలను బయటికి తీసి హద్దులు వేయడం జరుగుతుందని తెలిపారు. సర్వేలో రైతులందరూ పాల్గొనాలని సూచించారు. ఎన్నో ఏండ్లుగా దున్నుకుంటున్న రైతులందరికీ పట్టాలు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక చేపట్టిన కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వం స్పష్టమైనటువంటి ఆదేశాలతో సర్వే నిర్వహించి మోకా మీద దున్నుకున్నటువంటి రైతులందరికీ పాసుబుక్కులు ఇచ్చి రైతు బీమా, రైతుభరోసా పంట రుణాలు ఇచ్చే విధంగా చేసేందుకు ఈ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే షెడ్యూల్ ప్రకారం ముందస్తుగా గ్రామాలలో టామ్ టామ్ ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. భూమి కన్నతల్లి లాంటిదని భూ హక్కులు లేక ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా, రైతు బీమా, బ్యాంకు రుణాలు విక్రయాలు నిర్వహణకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే ప్రక్రియకు జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. లైసెన్స్ సర్వేలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇచ్చామని వారందరూ సర్వేలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సర్వే నిర్వహణపై లైసెన్స్ డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నో ఏళ్ల నాటి భూ సమస్యలు కూడా సర్వే ద్వారా పరిష్కారం అవుతాయని అందరూ సహకరించాలని సూచించారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లయితే సర్వే చేస్తారని తెలిపారు. సర్వే నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని తెలిపారు. గ్రామంలో ఉన్న అన్ని భూములు రీ సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించి గ్రామ సభలు నిర్వహిస్తున్నదని, సర్వే జరిగితే తప్ప భూ సమస్యలు పరిష్కారం కావని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలో 5 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా తీసుకుని సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామసభల్లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్, సర్పంచులు, కావటి రజిత, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన రైతులకు పట్టాలు అందించాలి

భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులను గుర్తించి, నిబంధనల ప్రకారం వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చెప్పారు. భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎం. కొత్తపల్లి గ్రామంలో భూ సర్వేపై స్థానిక సర్పంచ్ ఎలగొండ లక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో భూములు సాగు చేస్తున్న వారు ఒకరైతే, పట్టా పాస్ పుస్తకాలు మరొకరి పేరుపై ఉండటం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సమగ్ర భూ సర్వే తప్పనిసరిగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలను సమన్వయం చేసుకొని పారదర్శకంగా భూ సర్వే నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా రెవెన్యూ భూములు, గ్రామకంఠం భూములు, ప్రభుత్వ భూములపై ఉన్న ఆక్రమణలను గుర్తించేందుకు భూ సర్వే ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం కూడా ఈ సర్వే ద్వారా సులభతరం అవుతుందని తెలిపారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అత్యంత ముఖ్యమని, పాస్ పుస్తకాలు ఉంటే పంట రుణాలు, రైతు భరోసా, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. అర్హులైన రైతులకు భూ పట్టాలు, పాస్ పుస్తకాలు అందించే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఆర్డీవో, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు ఉండొద్దు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. రోవర్ పరికరం ద్వారా అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలని సూచించారు. సర్వే ద్వారా సరిహద్దు వివాదాలు పరిష్కారమైతే రైతులకు హక్కులు లభిస్తాయని తెలిపారు. ప్రక్రియ అంతా పారదర్శకంగా జరగాలని, రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, తహశీల్దార్ రాజేశ్వరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

### తాడిచర్ల డేంజర్ జోన్ లో విచారణ పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్

తాడిచర్ల డేంజర్ జోన్‌లో భూ సేకరణ విచారణను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడిఓసి కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ నెల 17 నుండి డేంజర్ జోన్ లోని ప్రతి ఇంటిని తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. విచారణ కోసం ఐదు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి వత్తిళ్లు లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, కుటుంబ వివరాలను చెక్‌లిస్ట్ ప్రకారం నమోదు చేసి రోజువారీ నివేదికలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, కాటారం ఆర్డిఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, జూలై 15(జనం సాక్షి):** మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కురవి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనుమరేషన్స్ ఫార్మ్ పంపిణీ చేయడం పూర్తి అయ్యిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుందని క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి బూతు లెవల్ అధికారులు వెళ్లి వివరాలు సేకరించి 2002 ఓటరు జాబితా ప్రకారం వివరాలు సేకరించాలని, అందుబాటులో లేని వివరాలను గుర్తించాలని, వేగంగా ఈ ప్రక్రియ మొత్తం కొనసాగాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగడంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కుబీర్ కాంగ్రెస్‌లో 'న్యూ వర్సెస్ ఓల్డ్'..

- ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు తప్పని 'అధ్యక్ష' సెగ!
- ఏళ్ల తరబడి జెండా మోస్తే పక్కన పెడతారా?..
- మండల అధ్యక్షుడిని మార్చకుంటే మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం: సీనియర్ నాయకులు



కుబీర్, జులై 15, (జనంసాక్షి): నిర్మల్ జిల్లా కుబీర్ మండల కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి జ్వాలలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మండల అధ్యక్ష పదవి ఎంపిక తీవ్ర వివాదాస్పదంగా మారడంతో బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీలో ఏళ్ల తరబడి జెండా మోసి, బలోపేతానికి నిరంతరం కృషి చేసిన నిబద్ధత గల నాయకులను పూర్తిగా పక్కన పెట్టడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ డీసీసీ నాయకుడు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇటీవల వేరే పార్టీ నుండి వచ్చిన వలస నాయకులకు మండల అధ్యక్ష పదవిని కట్టబెట్టారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వేరే పార్టీల నుంచి వచ్చిన వారికి తక్షణమే కుబీర్ మండల అధ్యక్ష పదవిని మార్చాలని, పార్టీ కోసం కష్టపడిన వారికే అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే మండలంలోని సర్పంచులు, ముఖ్య నాయకులతో పాటు కార్యకర్తలమంతా మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించారు.

### ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం

మండల అధ్యక్ష పదవుల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కుబీర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుబీర్ మండల పరిధిలోని 25 గ్రామాల్లో ఎస్సీ ఓటర్లు అత్యంత బలంగా ఉన్నారని, అలాగే మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఎస్టీ సామాజిక వర్గం ప్రజలు విస్తరించి ఉండి ఎన్నికల్లో పార్టీ విజయానికి కీలక పాత్ర పోషించారని వారు గుర్తు చేశారు. అంతటి ఆదరణ, బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ, కీలకమైన నాయకత్వ పదవుల్లో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకుని, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించి, సీనియర్లకు, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డి.సి.సి. జనరల్ సెక్రటరీ బంక బాబు. డి.సి.సి. సెక్రేటరీ రవి కుమార్, మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ వాహెద్, నాయకులు బషీర్, సందీప్, రాందాస్, గణేష్, సాహెబ్ రావు, జైవంత్, శ్రీనివాస్, ఆనంద్ రావ్, రాములు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

# సరిహద్దు పాలకుల నిర్లక్ష్యానికి 'ఇంచంపల్లి' సజీవ సాక్ష్యం!

- జలవిద్యుత్ ప్రాజెక్టును గాలికొదిలేస్తారా?
- అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరిపై కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ నిప్పులు!





**పలిమెల, జూలై 15 (జనంసాక్షి) :** మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో, ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా, పలిమెల మండలంలోని ఇంచంపల్లి ప్రాజెక్టు పాలకుల, అధికారుల ఘోర నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. తరతరాలుగా ఈ ప్రాంత అభివృద్ధికి ఊపిరిపోసే సత్తా ఉన్న ఈ ప్రాజెక్టును పునరుద్ధరించడంలో నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ అధికారులు ప్రదర్శిస్తున్న ఉదాసీనతపై కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ కార్యవర్గ బృందంతో కలిసి ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించి, ఇక్కడి వాస్తవ పరిస్థితులను వివరించడమే కాకుండా అధికారుల అలసత్వాన్ని ఘాటుగా నిలదీశారు. ఇంచంపల్లి ప్రాజెక్టుకు దశాబ్దాల ఘన చరిత్ర ఉందని పీక కిరణ్ గుర్తుచేశారు. ఆనాటి నిజాం పరిపాలకులు సైతం ఎన్నో పరిశోధనలు జరిపి, ఈ ప్రాంత అనుకూలతను గుర్తించి ఇక్కడ భారీ ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. నాడు ప్రాజెక్టు పనులు ప్రారంభించే సమయంలో కలరా అదేవిధంగా ప్లేగు వంటి వ్యాధి మహమ్మారి అప్పట్లో ఆ ప్రాంతాన్ని పట్టిపీడించి, కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడం వల్లే నిజాం పాలకులు వెనకడుగు వేశారు. లేదంటే ఈ పాటికి ఇంచంపల్లి ప్రాజెక్టు రూపురేఖలే వేరుగా ఉండేవి. నాడే పాలకులకు ఉన్న విజన్, నేడు సాంకేతికత అందుబాటులో ఉన్నా ఆధునిక పాలకులకు, అధికారులకు ఎందుకు కరువైంది? అని పీక కిరణ్ ఘాటుగా ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో జల విద్యుత్ కేంద్రం నిర్మించడానికి కావాల్సిన అన్ని వనరులు ఉన్నాయని, దీనిపై తక్షణమే సర్వే జరపాలని జేఏసీ డిమాండ్ చేసిందని, సరిహద్దు గ్రామాలైన పలిమెల ప్రాంతంలో పరిశ్రమలు లేక, ఉపాధి దొరక్క వందలాది పేద కుటుంబాలు వలసపోతున్నాయి. ఇక్కడ జల విద్యుత్ కేంద్రం నిర్మిస్తే స్థానిక నిరుద్యోగులకు, నిరుపేద కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, పచ్చటి పంట పొలాలు ప్రాజెక్టు పునరుద్ధరణ జరిగితే వేలాది ఎకరాల బీడు భూములు పచ్చటి పంట పొలాలుగా మారుతాయని, ఈ ప్రాంత రైతాంగం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, టి జి జెన్‌కో విద్యుత్ ప్రాజెక్టుల అధికారులు ఏసీ గదులకే పరిమితం కాకుండా, వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ రామగిరి రాజు. లింగమల్ల సడవలి రావు. పాల్గొన్నారు.



# నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**కాసిపేట జూలై 15 (జనంసాక్షి) :** కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల, మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వంటశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తయారీకి వినియోగించే నిత్యవసర సరుకుల నాణ్యతను పరిశీలించి ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో బీఎల్‌ఏలు క్రియాశీలక పాత్ర పోషించాలి
- ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి



**ములుగు ప్రతినిధి, జులై 15(జనంసాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి అన్నారు. బుధవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు కేవలం వారం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రజలను చైతన్యపరుస్తూ, వార్డు వారీగా బీఎల్ఏలు, బీఎల్‌వోలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ములుగు మున్సిపాలిటీ, గోవిందరావుపేట మండలం పసర గ్రామం, ఏటూరునాగారం మండలం ఏటూరు నాగారం గ్రామం, మంగపేట మండలం కమలాపూర్ గ్రామ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌వో, తహసీల్దార్ విజయభాస్కర్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ జిల్లాకే గర్వకారణం

- ఎమ్మెల్యే ఏలేటి



**నిర్మల్ బ్యూరో , జూలై 15 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జే.ఆర్. ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన నిర్మల్ జిల్లాకు చెందిన 16 మంది విద్యార్థులకు బీజేపీ శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం ఆయన నివాసం లోఅభినందించారు. ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జే.ఆర్. ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అటెంప్ట్‌లో సుమారు 1,800 మంది విద్యార్థులు ఒకేసారి 30 నిమిషాల పాటు కరాటేకు సంబంధించిన విన్యాసాలను ప్రదర్శించి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల్ జిల్లాకు చెందిన 16 మంది విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అటెంప్ట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందుకోవడం జిల్లాకు గర్వకారణమని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, కోచ్‌లను, జే.ఆర్. ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి నిర్మల్ జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జవ్లా-బి, కోలూర్ గ్రామాల్లో ఆరోగ్య విప్లవం

- రెండు కొత్త ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- తానూర్ మండలంలో గ్రామీణ వైద్య సేవలకు మరింత బలోపేతం
- 27 ప్యాకేజ్ పనులతో మండలం సస్యశ్యామలం అవుతుందన్న ఎమ్మెల్యే




**ముధోల్, జూలై 15 (జనం సాక్షి) :** గ్రామాలకే నాణ్యమైన వైద్యం తీసుకెళ్లే దిశగా తానూర్ మండలంలో ముఖ్యమైన అడుగు పడింది. ముధోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ బుధవారం తానూర్ మండలంలోని జవ్లా-బి, కోలూర్ గ్రామాల్లో ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకం కింద జవ్లా-బి గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని, అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కోలూర్ గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బి"గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దనే మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. గతంలో చిన్న ఆరోగ్య సమస్యలకే ప్రజలు పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రతి గ్రామానికి ఉపకేంద్రాలను నిర్మించి ఆ లోటును పూడ్చుతున్నాం"అని తెలిపారు. ఆరోగ్య రంగంతో పాటు విద్య, సాగునీరు, రహదారుల వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. తానూర్ మండల అభివృద్ధికి కీలకమైన 27 ప్యాకేజ్ పనులు పూర్తయితే మండలం పూర్తిగా సస్య శ్యామలం అవుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీటి వసతులు మెరుగుపడితే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, రైతుల ఆర్థిక పరిస్థితి బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ అంశాలను తాను పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వ్యవసాయాభివృద్ధికి గ్రామీణ రహదారులు ఎంతో అవసరమని చెప్పిన ఎమ్మెల్యే, రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ రహదారులను నిర్మించుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో రైతులందరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య శాఖ సిబ్బంది, మండల నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
16 జూలై 2026

# శాలరీ ప్యాకేజ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



● జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం కార్పొరేషన్, జూలై 15 (జనం సాక్షి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక భద్రత, మెరుగైన బ్యాంకింగ్ సేవలు, కుటుంబ సభ్యులకు అదనపు ప్రయోజనాలు కల్పించే లక్ష్యంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ ద్వారా లభించే ప్రయోజనాలను ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సద్వినియోగం చేసుకో వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బీఐ రూపొందించిన ఎస్.జి.ఎస్.పి. శాలరీ ప్యాకేజ్ కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌బీఐ అధికారులు ప్యాకేజ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు అందుబాటులో ఉన్న ప్రత్యేక సౌకర్యాలు, భీమా రక్షణ, కుటుంబ సభ్యులకు లభించే ప్రయోజనాలు, రుణ సదుపాయాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, ప్రభుత్వ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎస్‌బీఐ ప్రత్యేకంగా రూపొందించిన స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ (ా+ుూా) ద్వారా అనేక విలువైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం సాధారణ శాలరీ ఖాతాలను నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఖాతాలను స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ శాలరీ ప్యాకేజ్ ఖాతాలుగా మార్చుకోవడం ద్వారా అదనపు ఆర్థిక భద్రతతో పాటు పలు ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఉద్యోగులు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా ఎస్బిఐ రిష్తే ద్వారా ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను పొందగలరని, అవసరమైన సమయంలో ఆకర్షణీయమైన రుణ సదుపాయాలు, ప్రాధాన్య సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్యాకేజ్ ద్వారా లభించే ప్రయోజనాలపై అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పూర్తి అవగాహన పెంపొందించుకుని వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వనపల్లి శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ రామ్ బరన్, ఎల్డీఎం ఎ. రవిప్రసాద్, కలెక్టరేట్ ట్రెజరీ బ్రాంచ్ మేనేజర్ డి. సునీత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధిర మండలంలో పర్యటించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



మధిర, జూలై 15 (జనంసాక్షి) : మధిర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి బుధవారం మధిర మండలంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా మండలంలోని మాటూరుపేట గ్రామంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాదాల రామారావు ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మాదాల రామారావు కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా గడిపారు. గ్రామంలోని రాజకీయ, అభివృద్ధి అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. ఈ సందర్భంగా మాటూరుపేట గ్రామ అభివృద్ధికి కేంద్రం నుండి పూర్తి సహకారం అందిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ముందుగా మాటూరు పేటలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాటూరుపేట గ్రామ సర్పంచ్ చిలువేరు పూర్ణమ్మబుచ్చిరామయ్య, నాగవరపాడు సర్పంచ్ భీమనబోయిన ఈశ్వరమ్మ, గ్రామ ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్గొండ ప్రతినిధి, జూలై 15 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల స్థితి, సీసీ కెమెరాల పనితీరు,సిబ్బంది హాజరు, స్టేషన్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, బెయిల్‌పై ఉన్న నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలపై తరచూ తనిఖీలు, నాకాబందీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేసి ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేలా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సున్నితంగా స్వీకరించి చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించే విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ శరత్ చంద్ర పవార్,శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా,నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌ను పకడ్బందీగా అమలు చేయాలి



కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ బ్యూరో, జూలై 15 (జనం సాక్షి) : మెదక్ జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 67.08 శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తయ్యిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్ల తొలగింపు ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే, ఫీల్డ్ వెరిఫికేషన్, దరఖాస్తుల పరిశీలన వంటి ప్రతి దశను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అందిన దరఖాస్తులను ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.

## రంగనాయక సాగర్‌లోకి నీరు విడుదల చేయాలి



● దర్గపల్లి గ్రామ రైతుల విజ్ఞప్తి

నంగునూర్, జులై 15 (జనం సాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రంగనాయక సాగర్‌లోకి వెంటనే నీటిని విడుదల చేసి, దర్గపల్లి వాగు ద్వారా చెక్‌డ్యామ్‌లను నింపి రైతులు తమ పంటలను సాగు చేసుకునేలా తెలంగాణ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని దర్గపల్లి గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం రెండు నెలలుగా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు వేసే పరిస్థితి లేదని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి రంగనాయక సాగర్‌కు నీటిని విడుదల చేయడం ద్వారా చెక్‌డ్యామ్‌లు నిండి భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులకు సాగునీరు అందుతుందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దర్గపల్లి సర్పంచ్ పెంబర్ల శైలజ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే కాళేశ్వరం పంపులను ఆన్ చేసి, రంగనాయక సాగర్ ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్నీ కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు వంద్ర మల్లారెడ్డి, కొల్ల నరేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మల్లేశం, నరేందర్ రెడ్డి, ప్రసాద్, నరసింహారెడ్డి, రామ్ రెడ్డి, వెంకట్ నర్సయ్య, మహేందర్ రెడ్డి, రాములు, జోగి రెడ్డి, అంజయ్య, కొండల్ రావు, పోచయ్య గ్రామ రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లోనే ఇసుక బుకింగ్ ప్రక్రియ జరగాలి


● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం కార్పొరేషన్, జూలై 15 (జనం సాక్షి) : జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక సరఫరా ఆన్లైన్ లోనే బుకింగ్ జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇసుక సరఫరాపై వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక సరఫరా ఆన్లైన్ లో పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. జిల్లాలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ఎంత పరిమాణం ఇసుక, ఎక్కడెక్కడి నుండి పొందింది నివేదిక స్మర్పించాలన్నారు. ఇసుకను టీజీఎండీసీ, స్యాండ్ బజార్, స్థానికంగా సమకూర్చుకోవాలని, ఇదీ బుకింగ్ ఆన్లైన్ లోనే చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని స్యాండ్ బజార్ లలో 1000 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక అందుబాటులో ఉంచామన్నారు. ఇసుక రీచ్ ల వారీగా వచ్చిన ఆదాయం వివరాలు వెంటనే సమర్పించాలని, ఇట్టి ఆదాయాన్ని నిబంధనల మేరకు ఆయా గ్రామ పంచాయతీ తదితరాలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంజనీరింగ్ శాఖలు తమ తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయమై సమస్యలు ఉంటే వెంటనే నివేదిక అందించాలని, అట్టి సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖలచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్ణీత గడువులోపు అభివృద్ధి పనుల పూర్తికి కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీవో టిజిఎండిసి జి. శంకర్, మైన్స్ ఏజి ఏ. రమేష్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, పీఆర్ ఇఇ లు మహేష్ బాబు, రామకోటి, డిఇ లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

● కలెక్టర్ అనురాగ్ జయంతి



యాదాద్రి కరస్పాండెంట్, జూలై 15 (జనం సాక్షి) : జిల్లాలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏఈలు, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలోని మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి మండలంలో పనులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని సూచించారు. అదేవిధంగా కొండమడుగు, జిబ్లాక్‌పల్లి, సిగన్నగూడెం ప్రాంతాల్లోని 2బీహెచ్‌కే కాలనీల భవనాలు, మౌలిక సదుపాయాల పనుల స్థితిగతులపై ఆరా తీశారు. కొండమడుగులోని 30 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేసి, పూర్తిగా అర్హులైన వారినే ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలాల్లో పూరి గుడిసెలు, డేరాలు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణ పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పీడీ (హౌసింగ్), ఎంపీడీఓలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (హౌసింగ్), అసిస్టెంట్ ఇంజినీర్లు (హౌసింగ్), పంచాయతీరాజ్ శాఖ అధికారులు , మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

● పెండింగ్ నమోదును వెంటనే పూర్తి చేయాలి
● కలెక్టర్ బి. చంద్ర శేఖర్

నాగార్జునసాగర్, జూలై 15 (జనం సాక్షి) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న నమోదును ఆలస్యం లేకుండా ముగించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నాగార్జునసాగర్ మున్సిపాలిటీ పరిధిలోని 7, 10, 12 వార్డుల్లో ఇంటింటికీ నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి నమోదును పరిశీలిస్తూ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక వార్డులో మొత్తం ఓటర్ల సంఖ్య, ఇప్పటివరకు నమోదు పూర్తయిన వారి సంఖ్య, ఇంకా పెండింగ్‌లో ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి ఓటరును గుర్తించి ఎలాంటి ఆలస్యం లేకుండా నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటికి తాళం వేసి ఉండడం వల్ల అందుబాటులో లేని ఓటర్లను దూరవాణి ద్వారా సంప్రదించి నమోదు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటి సంఖ్యను నమోదు చేస్తూ ఓటర్ల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని చెప్పారు. ఇంకా నమోదు కాని ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, వారి ఓటరు గుర్తింపు సంఖ్య అందుబాటులో ఉంటే నమోదు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నమోదు పూర్తయిన అనంతరం వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఓటరు తమ ఓటరు గుర్తింపు సంఖ్య తెలిపితే వెంటనే అంతర్జాలంలో పరిశీలించి వారి వివరాలను నిర్ధారించవచ్చని కలెక్టర్ వివరించారు. పదో వార్డులో ఓటరు తన గుర్తింపు కార్డు చూపించగా, వెంటనే పరిశీలించి ఆయన పేరు ఓటరు జాబితాలో ఉందని నిర్ధారించారు. మరణించిన వారి పేర్లను తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వివాహం అనంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు నివాసం మార్చుకున్నవారు, ఇంకా గుర్తింపు కాని ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా గుర్తించాలని ఆదేశించారు. ఇంకా నమోదు కాని వారి కుటుంబ సభ్యులను దూరవాణి ద్వారా సంప్రదించి అవసరమైన సమాచారం సేకరించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సైదులు, తహసీల్దార్ ఖాసీం, మున్సిపల్ చైర్‌పర్సన్ మానస స్వర్ణ సుమన్, కౌన్సిలర్ వినిష, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, రెవెన్యూ పరిశీలకుడు సందీప్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 3.65 కోట్ల వ్యయంతో కస్తూర్బా గాంధీ మోడల్ స్కూల్‌లలో అన్ని వసతులు

● గ్రామీణ విద్యార్థులకు ఐఓసీఎల్ సేవలు అమోఘం
● ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



యాదాద్రి కరస్పాండెంట్, జూలై 15 (జనం సాక్షి) : జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఐఓసీఎల్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ ల్యాబ్‌తో పాటు పలు మౌలిక సదుపాయాలను ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అదేవిధంగా రూపాయలు 3.65 కోట్ల వ్యయంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో ఐ-స్పార్క్ ల్యాబ్‌లు, బంకర్ బెడ్స్, సోలార్ ఫెన్సింగ్, మెష్ డోర్లు, కిటికీలు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారు కోరుకున్న రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, నిర్మాణ్ సంస్థలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొంటూ, సంస్థల ప్రతినిధులను అభినందించారు. ఐఓసీఎల్ ప్రతినిధులు ఎలిమరన్, కైలాష్ కాంత్ మాట్లాడుతూ ప్రభుత్వంతో కలిసి గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు అనురాధ, నీరజ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో తమ వంతు సహకారం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేష్ చిస్తీ, సెక్టోరియల్ అధికారులు సీహెచ్ రాధ, పెసరు లింగారెడ్డి, మండల విద్యాధికారి సీహెచ్ రంగరాజన్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ నుండి యూకేకు బియ్యం ఎగుమతులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 15 (జనం సాక్షి) : భారత్ - యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (జశీఎజూతీవష్ట్రవఅంఱజవ జుఛశీఅశీఎఱష ఎతీఘఎవ ాూస్త్రతీవవఎవత్ - జజుూూ) ద్వారా ఎగుమతులకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ నిజామాబాద్ నగరంలోని గజానన్ రైస్ మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది. ఈ మేరకు గజానన్ రైస్ మిల్లు నుండి యూ.కే కు ఎగుమతి అవుతున్న సోనా మసూరి ఎక్స్పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యూకేకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు, ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, గజానన్ రైస్ మిల్ ప్రతినిధి హితేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఇన్‌స్టామార్ట్‌తో హెచ్‌పీసీఎల్ జట్టు..

### ఇక నిమిషాల్లోనే ఇంటికి ఎల్‌పీజీ సిలిండర్

**న్యూఢిల్లీ:** ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. దేశంలోనే తొలిసారి ఆన్ డిమాండ్ ఎల్‌పీజీ సిలిండర్ల డోర్‌స్టెప్ డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టాయి. ఇకపై వస్తువుల తరహాలోనే గ్యాస్ సిలిండర్లనూ నిమిషాల్లోనే ఇంటికి చేరవేయనున్నాయి. తొలుత బెంగళూరులో ఈ సేవలను ప్రారంభించనున్నట్లు ఇరు సంస్థలు బుధవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

ఈ భాగస్వామ్యంలో భాగంగా హెచ్‌పీ నవ్య 10 కిలోల సిలిండర్లు లేదా 5 కిలోల మెటల్ సిలిండర్‌లను ఇన్‌స్టామార్ట్ యాప్ ద్వారా వినియోగదారులు ఆర్డర్ చేయొచ్చు. హెచ్‌పీ నవ్య సిలిండర్లను ప్రత్యేకంగా రూపొందించడంతో తుప్పు పట్టకుండా ఉంటాయి. వీటి బరువు కూడా తక్కువగా ఉండటం విశేషం. గ్యాస్ ఎంతుందో ఎప్పటికప్పుడు చూసుకునేలా ఏర్పాటూ ఉంటుంది. ఈ సిలిండర్ పొందడానికి ముందుగా ఎలాంటి కనెక్షన్ కూడా అవసరం లేదు. కాబట్టి విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న కుటుంబాలకు అనుకూలంగా ఉంటుంది. మొదటిసారి ఆర్డర్ చేసేటప్పుడు గుర్తింపు కార్డు, డెలివరీ డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఉంటుంది. ఆపై రీఫిల్ ఆర్డర్ చేసినప్పుడు, డెలివరీ బాయ్‌కు ఖాళీ సిలిండర్‌ను అప్పగిస్తే సరిపోతుంది. వ్యక్తుల రోజువారీ అవసరాలు తీర్చడంలో భాగంగా హెచ్‌పీసీఎల్‌తో ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నామని, వినియోగదారులను అంచనాలను అందుకునేలా సేవల్లో నాణ్యతకు, భద్రతకు ప్రాధాన్యమిస్తామని ఇన్‌స్టామార్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమితేష్ ఝా వెల్లడించారు. అందరికీ సిలిండర్లను తక్కువ సమయంలో సరఫరా చేయడానికి ఇన్‌స్టామార్ట్‌తో జట్టుకట్టామని హెచ్‌పీసీఎల్ డైరెక్టర్ అమిత్ గార్గ్ పేర్కొన్నారు. ఇన్‌స్టామార్ట్‌లో సిలిండర్లు ఆర్డర్ పెట్టేవారికి స్థానికంగా ఉండే హెచ్‌పీసీఎల్ అధీకృత డిస్ట్రిబ్యూటర్ల నుంచి హోమ్ డెలివరీ చేస్తారు.





# స్వల్ప లాభాల్లో సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరుగుదల వంటి ఆందోళనలు ఉన్నా.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తక్కువగా నమోదైనట్లు గణాంకాలు వెలువడడంతో వడ్డీ రేట్ల పెంపు భయాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. దీనికితోడు హర్మూజ్ జలసంధిపై 20 శాతం సుంకాల డిమాండ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకోవడమూ కాస్త కలిసొచ్చింది

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరుగుదల వంటి ఆందోళనలు ఉన్నా.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తక్కువగా నమోదైనట్లు గణాంకాలు వెలువడడంతో వడ్డీ రేట్ల పెంపు భయాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. దీనికితోడు హర్మూజ్ జలసంధిపై 20 శాతం సుంకాల డిమాండ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకోవడమూ కాస్త కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 130 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 24వేల మార్కును నిలబెట్టుకుంది. సెన్సెక్స్ 130.49 పాయింట్ల లాభంతో 77,185.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 26.45 పాయింట్ల లాభంతో 24,078.50వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 96.29గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రా సిమెంట్, ఎటర్నల్, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. పవర్ గ్రిడ్, టాటాస్టీల్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 85.55 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**బ్యాంకింగ్, వాహన షేర్లు డీలా**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రం కావడంతో చమురు ధర భారీగా పెరుగుతూ, ఈక్విటీ మదుపర్లకు ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా మూడు రోజుల తర్వాత దేశీయ సూచీలు నష్టాలు నమోదు చేశాయి. బ్యాంకింగ్, వాహన షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 48 పైసలు తగ్గి 96.16 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు ధర 4.26% పెరిగి 86.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు



లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.94 లక్షల కోట్లు తగ్గి రూ.479.47 లక్షల కోట్ల (4.99 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 344 పాయింట్ల (క్రితం ముగింపు 77,616.40) నష్టంతో 77,272.34 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఒకదశలో 77,001.48 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 561.46 పాయింట్ల నష్టంతో 77,054.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 158.95 పాయింట్లు కోల్పోయి 24,052.05 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,023.70- 24,157.10 పాయింట్ల మధ్య కదలాడింది. త్రైమాసిక ఫలితాలు మదుపర్లను మెప్పించకపోవడంతో హెచ్‌సీఎల్ టెక్ షేరు 4.42% కుదేలై రూ.1167 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.14,653.78 కోట్లు తగ్గి రూ.3.16 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో 24 డీలాపడ్డాయి. ఇండిగో 2.30%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.21%, ఎస్‌బీఐ 2.13%, ఎం అండ్ ఎం 2.10%, ఎల్ అండ్ టీ 2.01%, బజాజ్ ఫైనాన్స్ 1.60%, కోటక్ బ్యాంక్ 1.53%, ఐటీసీ 1.48%, మారుతీ 1.44%, టెక్ మహీంద్రా 1.35% నష్టపోయాయి. భారతీ ఎయిర్‌టెల్ 1.75%, టీసీఎస్ 0.89%, సన్‌ఫార్మా 0.84%, టాటా స్టీల్ 0.64% లాభపడ్డాయి. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు మొదటి రోజు 68% స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 12,45,63,636 షేర్లను ఆఫర్ చేయగా, 8,50,65,136 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 62% స్పందన కనిపించింది. ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా కొనుగోలుకు ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్, ఎమిరేట్స్ ఎన్‌డీబీల నుంచి సవరించిన ఆర్థిక బిడ్‌లను ప్రభుత్వం అందుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీటిని తెరిచిన తర్వాత, విజయవంతమైన బిడ్డర్‌ను ప్రభుత్వం త్వరలో ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,53,140 | ₹ 1,67,064 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)


హైదరాబాద్

₹ 2,60,000

# ఐబీఎంకు ఏమైంది..?

### ఒక్కరోజే రూ.6.7 లక్షల కోట్లు ఆవిరి..

అమెరికా టెక్ దిగ్గజం ఐబీఎం షేర్లు ఒక్క రోజే కుప్పకూలాయి. దాదాపు 25 శాతం పతనమయ్యాయి. దీంతో కొన్ని గంటల వ్యవధిలోనే కంపెనీ మార్కెట్ విలువలో దాదాపు 70 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.6.7లక్షల కోట్లకు పైమాటే) మేర సంపద ఆవిరైంది. ఐబీఎం (ఎ:ఓ) కంపెనీ షేరు విలువ ఒక్క రోజులో ఇంత దారుణంగా పడిపోవడం గత 58 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. త్రైమాసిక ఫలితాలు, ఏఐపై కంపెనీ సీఈఓ చేసిన వ్యాఖ్యలే షేర్ల పతనానికి కారణమయ్యాయి. మంగళవారం నాటి (అమెరికా కాలమానం ప్రకారం) వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్‌లో ఐబీఎం కార్పొరేషన్ షేరు విలువ ఏకంగా 25.21 శాతం కుంగి 217.07 డాలర్లకు



పడిపోయింది. దీంతో మార్కెట్ విలువలో దాదాపు 70 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. కంపెనీ షేరు విలువ ఒక రోజు వ్యవధిలో ఈ స్థాయిలో పడిపోవడం 1968 జనవరి 3 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి గానూ ప్రాథమిక ఫలితాల వివరాలను ఐబీఎం ప్రకటించింది. అనంతరం షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన ఫలితాలను ఐబీఎం వచ్చేవారం విడుదల చేయనుంది. అంతకంటే ముందు తాజాగా ప్రాథమిక వివరాలను వెల్లడించింది. ఈసారి కంపెనీ ఆదాయం అంచనాల కంటే తక్కువగా కేవలం ఒకే ఒక్క శాతం పెరిగి 17.2 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని ఐబీఎం పేర్కొంది. సాఫ్ట్‌వేర్ విభాగ ఆదాయం 5శాతం పెరగొచ్చని, అయితే ఐబీఎం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారం మాత్రం 7శాతం నష్టాలను చవిచూసిందని ప్రకటించింది. ఈ క్రమంలోనే మదుపర్లకు రాసిన లేఖలో ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. "కృత్రిమ మేధపై దృష్టిపెట్టిన కంపెనీలు.. ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా వెచ్చిస్తున్నాయి. రాబోయే కాలంలో ధరలు పెరుగుతాయన్న ఆందోళనలతో ఈ మధ్య సర్వర్లు, స్టోరేజ్ వ్యవస్థలు, నెట్‌వర్క్ పరికరాలు, మెమొరీ చిప్‌ల కొనుగోళ్లకే ఎక్కువగా మొగ్గుచూపాయి. దీంతో ఐబీఎం ఉత్పత్తులకు గిరాకీ తగ్గింది. ఈ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో మేం విఫలమయ్యాం. వేగంగా స్పందించడంలో తడబడ్డాం. మార్పులను అందిపుచ్చుకోలేకపోయాం. కస్టమర్ల వ్యయ ప్రాధాన్యతలు ఎంత వేగంగా మారుతాయో గ్రహించలేకపోయాం" అని సీఈఓ వెల్లడించారు.

# అమల్లోకి భారత్-యూకే వాణిజ్య ఒప్పందం

**న్యూఢిల్లీ:** భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య గతేడాది జులై 25న కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. మోదీ ప్రభుత్వ హయాంలో కుదిరిన ఆరో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఇది. అంతక్రితం మారిషస్, యూఏఈ, ఆస్ట్రేలియా, ఈఎఫ్‌టీఏ(యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్), ఒమన్‌లతో ఈ తరహా ఒప్పందాలను మనదేశం అమలు చేసింది. గత కొన్నేళ్లలో ప్రభుత్వం కుదుర్చుకున్న అతిపెద్ద ఒప్పందం ఇదే. దీని వల్ల 99% మన ఎగుమతులకు సుంకం రహిత ప్రయోజనాలు లభిస్తాయి. కార్మిక ఆధారిత రంగాలకు భారీ ప్రయోజనం: బ్రిటన్ మార్కెట్‌కు ఎటువంటి సుంకం లేకుండా దుస్తులు, జౌళి, పాదరక్షలు, కార్పెట్లు, ప్రాసెస్డ్ ఆహారం, తృణ ధాన్యాలు, కూరగాయలు, పళ్లు-సుగంధ ద్రవ్యాలు, చేపలు, మాంసం, ప్రాసెస్డ్ ఉత్పత్తులను మనం ఎగుమతి చేయొచ్చు. ప్రస్తుతం వీటిపై 4-16% పన్ను పడుతోంది. వాహన రంగం, మోటార్‌సైకిళ్లు, విడిభాగాలు; మెషినరీ, ఎలక్ట్రానిక్స్, ఫ్యాబ్రికేటెడ్ లోహ ఉత్పత్తులు; సెరామిక్స్, గ్లాస్, సిమెంటు ఉత్పత్తులకూ



ప్రయోజనాలు లభించనున్నాయి. బ్రిటన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న భారత కంపెనీలు తమ ఉద్యోగులకు అయిదేళ్ల వరకు సామాజిక భద్రతా చెల్లింపులు చేయనక్కర్లేదు. టీసీఎస్, ఇన్ఫీ వంటి సంస్థలకు కలిసివచ్చే అంశమే.

బ్రిటన్ వస్తువులకు గిరాకీ..

మనదేశంలోకి బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే సాల్మన్ చేపలు, గొర్రెపిల్ల మాంసం, ఎలక్ట్రానిక్స్, మెషినరీ, చాకోలెట్లు, సాఫ్ట్ డ్రింక్‌లు, కాస్మోటిక్స్, సబ్బులు, పర్‌ఫ్యూమ్‌లు, షేవింగ్ క్రీములు, నెయిల్ పాలిష్‌ల ధరలు తగ్గొచ్చు. బ్రిటన్‌కు చెందిన ప్రీమియం ఆల్కహాల్స్ రమ్, జిన్, ఓడ్కా, బ్రాందీ, టకీలా వంటి వాటిపై టారిఫ్‌లు తగ్గనున్నాయి. స్కాచ్ విస్కీపై టారిఫ్ 150% నుంచి 75 శాతానికి తగ్గుతుంది. 10 ఏళ్లలో 40 శాతానికి పరిమితమవుతుంది. బ్రిటన్ నుంచి పూర్తిగా తయారై, దిగుమతి అయ్యే కార్లు, ట్రక్కులపై టారిఫ్‌లు 110% నుంచి క్రమేణ 10 శాతానికి పరిమితం అవుతాయి. బ్రిటన్ నుంచి ఎక్కువగా దిగుమతయ్యే వెండిపై టారిఫ్‌ను 10 ఏళ్లలో సున్నాకు చేరుస్తారు. తొలిసారిగా కేంద్ర మంత్రిత్వశాఖలు, విభాగాల్లో 40,000కు పైగా అధిక విలువ గల కాంట్రాక్టులకు బ్రిటన్ కంపెనీలు బిడ్ వేసేందుకు వీలు కల్పించనున్నారు.

**వీటికి మినహాయింపులేదు**

భారత్‌లోకి వచ్చే తాజా యాపిళ్లు, వాల్‌నట్స్, చీజ్, పసిడి బార్లు, స్మార్ట్‌ఫోన్లకు భారత్ ఎటువంటి సుంకం మినహాయింపులు ఇవ్వడం లేదు. అలాగే కొన్ని మాంసం ఉత్పత్తులు, గుడ్డు ఆధారిత వస్తువులు, బియ్యం, బీట్ షుగర్ వంటి వాటికి మనకు బ్రిటన్ మినహాయింపులు ఇవ్వదు. 2025-26లో బ్రిటన్‌తో భారత వాణిజ్యం 8.62% పెరిగి 25.12 బి. డాలర్లకు చేరుకుంది. ఇదే ఏడాదిలో ఆ దేశం నుంచి 1 బి. డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులనూ అందుకుంది.

# 'సర్' గడువు పొడిగింపు

బూత్ స్థాయి అధికారులు ఇప్పటికే జూన్ 25 నుంచి ప్రారంభించిన ఇంటింటి సర్వే ప్రక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పనులను సైతం అధికారులు ఆగస్టు 3 నాటికి పూర్తి చేస్తారు. ఆ తర్వాత ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితా అధికారికంగా విడుదల కానుంది. ముసాయిదా జాబితా విడుదలైన అనంతరం, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు , తప్పుల మార్పులు-చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నెల రోజుల పాటు గడువునిచ్చింది. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చే ఈ అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు సంబంధించిన నోటీసుల జారీ, వాటి పూర్తి స్థాయి పరిష్కార ప్రక్రియను అధికారులు ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత అన్ని సవరణలతో కూడిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనున్నారు.



# ప్రత్యక్ష పన్నుల్లో 16% వృద్ధి

**దిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు ఈనెల 13 వరకు రూ.6.51 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో వసూలైన మొత్తం కంటే ఇది 16% ఎక్కువ. కార్పొరేట్ పన్ను వసూళ్లు పెరగడం ఇందుకు ఉపకరించింది. కార్పొరేట్ పన్ను నికర వసూళ్లు 22% అధికమై రూ.2.40 లక్షల కోట్లకు చేరాయి. వ్యక్తిగత, అవిభక్త హిందూ కుటుంబాలు సంస్థల నుంచి వసూలైన మొత్తం 12% పెరిగి రూ.3.84 లక్షల కోట్లుగా నమోదైంది. సెక్యూరిటీల లావాదేవీల పన్ను 48% వృద్ధితో రూ.26,429 కోట్లకు చేరింది. రిఫండ్‌లు కూడా 14.57% అధికంగా రూ.1.22 లక్షల కోట్లుగా ఉన్నాయి. ప్రత్యక్ష పన్నుల స్థూల వసూళ్లు 16.11% వృద్ధితో రూ.7.73 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో కార్పొరేట్ పన్నులు రూ.3.35 లక్షల కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంమీద ప్రత్యక్ష పన్ను కింద రూ.26.97 లక్షల కోట్లు వసూలు చేయాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. 2025-26లో వసూలైన రూ.23.40 లక్షల కోట్ల కంటే ఈ మొత్తం 15% అధికం.


## స్థిరాస్తి కుబేరుల్లో గౌతమ్ అదానీ టాప్

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది దేశీయ స్థిరాస్తి రంగంలో భారీ విలువను సృష్టించిన కంపెనీగా అదానీ ప్రాపర్టీస్ నిలిచింది. దేశీయ అతిపెద్ద స్థిరాస్తి సంస్థ డీఎల్‌ఎఫ్ ఛైర్మన్ రాజీవ్ సింగ్‌ను అధిగమించి గౌతమ్ అదానీ, కుటుంబం దేశంలోనే అత్యంత ధనవంతులైన స్థిరాస్తి రంగ కంపెనీ యజమానులుగా నిలిచారు. విలువ తగ్గినా.. దేశంలో అత్యంత విలువైన స్థిరాస్తి కంపెనీగా డీఎల్‌ఎఫ్ నిలిచింది. ఈ ఏడాదిలో అదానీ ప్రాపర్టీస్ రూ.38,000 కోట్ల విలువను జత చేయడంతో గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం గ్రోహే-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ రిచ్ లిస్ట్‌లో తొలిసారిగా అగ్రస్థానంలో నిలిచారు. 2025 ఇదే సమయం కంటే 72.5% వృద్ధితో అదానీ ప్రాపర్టీస్ విలువ రూ.90,400 కోట్లకు చేరుకుంది. దీంతో నాలుగు స్థానాలు మెరుగుపరచుకుని దేశంలోనే అత్యంత విలువైన నాలుగో స్థిరాస్తి కంపెనీగా ఇది నిలిచింది. అత్యంత విలువైన, అన్‌లిస్టెడ్ స్థిరాస్తి డెవలపర్‌గా కొనసాగింది. తొమ్మిదేళ్లలోనే మందగమనం..: జాబితాలోని మొత్తం 150 కంపెనీల విలువ మొత్తం మీద 2 శాతమే (రూ.34,300 కోట్లు) పెరిగి రూ.16.5 లక్షల కోట్లకు చేరుకుంది. తొమ్మిదేళ్ల కిందట స్థిరాస్తి సంస్థలకు ర్యాంకింగ్‌లు ఇవ్వడం మొదలుపెట్టాక.. ఇంత తక్కువ వృద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి.

## రూ.11వేల కోట్ల కంపెనీకి సీఈఓ..

### బ్యాంక్‌లో హోమ్‌లోన్ అప్లికేషన్ రిజెక్ట్

రూ.11వేల కోట్ల విలువైన కంపెనీకి సీఈఓ ఆయన. కానీ, సొంతింటి కోసం రుణం తీసుకుందామని బ్యాంకుకు వెళ్తే.. ఆయన దరఖాస్తు తిరస్కరణకు గురైంది హైరిస్క్ కేటగిరీ జాబితాలో ఉండటం వల్లే ఆయనకు రుణం ఇవ్వలేమని బ్యాంక్ చెప్పిందంట..! ఇప్పుడీ పోస్టు ఎక్స్ వేదికగా వైరల్ అవుతోంది. ఇంతకీ ఆయన ఎవరంటే..? ఫిన్‌టెక్ సంస్థ రెయిజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఖీజీతిబవ ఈతినిజీనిఇతిజీశ్రీ రావతీలతిఇవబ) వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రవీణ్ జాధవ్ తన హోమ్‌లోన్ దరఖాస్తు తిరస్కరణకు గురైందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఒక సంస్థ వ్యవస్థాపకుడి జీవితం ఎంతో కష్టంగా ఉంటుంది. నేను ఫౌండర్‌ని కావడంతో ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ నా హోమ్‌లోన్ దరఖాస్తును తిరస్కరించింది. రూ.11 వేల కోట్ల కంపెనీకి నాయకత్వం వహిస్తున్నప్పటికీ.. ఆ బ్యాంక్ నన్ను ఇప్పటికీ హైరిస్క్ రుణ గ్రహీతగానే పరిగణిస్తోంది. 25 ఏళ్లకుపైగా ఆ బ్యాంక్ కస్టమర్‌గా ఉన్నాను. సిబిల్ స్కోర్ 800 పైనే. ప్రముఖ ఫిన్‌టెక్ ఇన్నోవేటర్‌గా ఇదే బ్యాంక్ నన్ను గౌరవించింది కూడా. నా సంస్థలో ఉద్యోగులకు రుణాలు ఇస్తోంది. కానీ వ్యవస్థాపకుడినైన నామీద మాత్రం విశ్వాసం ఉంచలేకపోయింది. చూస్తుంటే జీవితాంతం ఆఫీసులోనే ఉండాల్సివస్తుందేమో" అని పోస్టు చివర్లో చమత్కరించారు.




## హైదరాబాద్‌లో 18% పెరిగితే.. బెంగళూరులో 21% తగ్గింది

### జనవరి-జూన్‌లో కార్యాలయ స్థలాల లీజుపై జేఎల్ఎల్

**న్యూఢిల్లీ:** దేశంలోనే కార్యాలయ స్థలాలకు అతిపెద్ద విపణి అయిన బెంగళూరులో గిరాకీ తగ్గితే, హైదరాబాద్‌లో మాత్రం పెరిగిందని స్థిరాస్తి కన్సల్టెంట్ జేఎల్ఎల్ తెలిపింది. ఈ ఏడాది జనవరి - జూన్‌లో హైదరాబాద్‌లో 53.8 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాల స్థూల లీజింగ్ జరిగింది. 2025 ఇదే కాలంలో జరిగిన 45.8 లక్షల చ.అ. లీజింగ్ కంటే ఇది 18% అధికం. ఇదే సమయంలో బెంగళూరులో మాత్రం 117.9 లక్షల చ.అ. నుంచి 93.7 లక్షల చ.అ.కు పరిమితమైందని వివరించింది. వీటితో సహా దేశంలోని 7 ప్రధాన నగరాల్లో కలిపి ఈ ఏడాది ప్రథమార్ధంలో 379 లక్షల చ.అ. కార్యాలయ స్థలం లీజుకు వెళ్లింది. 2025 ఇదే సమయంలో లీజుకు వెళ్లిన 394.5 లక్షల చ.అ. కంటే ఇది 4% తక్కువ. అంతర్జాతీయ అనిశ్చితులు, వివిధ రంగాలు ఏఐ (కృత్రిమమేధ) సాంకేతికత ఆధారితంగా మార్పు చెందుతుండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, కొత్త స్థలాలు లీజుకు తీసుకోవడంలో సంస్థలు అప్రమత్తతతో వ్యవహరించాయి. 41.7% జీసీసీలే: మొత్తం కార్యాలయ స్థలాల లీజులో గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాల (జీసీసీ) వాటాయే 41.7 శాతమని నివేదిక వివరించింది. 2025 మొత్తంమీద జీసీసీలు లీజుపై తీసుకున్న స్థలాన్ని ఈ ఏడాది మించుతుందని.. ఈ ఏడాది ప్రథమార్ధంలోనే 158 లక్షల చ.అ. స్థలాన్ని ఇవి తీసుకున్నాయని వెల్లడించింది. కో వర్కింగ్ సంస్థలు కూడా 102.3 లక్షల చ.అ. స్థలాన్ని పొందాయి. ఐటీ కంపెనీలతో పాటు బ్యాంకింగ్-ఆర్థిక సేవలు-బీమా, తయారీ, రిటెయిల్, లాజిస్టిక్స్, మౌలిక వసతులు, ఏరోస్పేస్ రంగాల సంస్థలు అధికంగా కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకుంటున్నాయి.

# మొబైల్ తయారీకి కేంద్రం దన్ను..

### రూ.62,500 కోట్లతో పీఎల్ఐ స్కీమ్

దేశీయంగా మొబైల్ తయారీని ప్రోత్సహించే దిశగా కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.62,500 కోట్లతో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం 2.0కు బుధవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దీంతో పాటు సెమీకండక్టర్లు, ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి పలు ప్రాజెక్టులను క్యాబినెట్ ఆమోదించింది. గతంలో మొబైల్ ఫోన్ల కోసం భారత్ ఇతర దేశాల నుంచి వచ్చే దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ క్రమంలోనే దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం పీఎల్ఐ పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా 300 మొబైల్ తయారీ కేంద్రాలతో మన దేశం నుంచే ఫోన్ల ఎగుమతులు జరుగుతున్నాయి. గతేడాది రూ.2.62లక్షల కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను భారత్ ఎగుమతి చేసింది. వీటిలో అత్యధికం యాపిల్ ఫోన్లే. ఇక, దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ కూడా గతంలో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2.14లక్షల కోట్లు విలువైన ఫోన్లు దేశీయంగా తయారవ్వగా.. 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి ఆ మొత్తం రూ.5.5లక్షల కోట్లకు పెరిగింది.

మెమొరీ చిప్‌ల తయారీ కోసం..

ఇక, భారత్ అంతర్జాతీయ చిప్ తయారీ హబ్‌గా మార్చే దిశగా కేంద్రం చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే రూ.1.27లక్షల కోట్లతో సెమీకాన్ 2.0 ప్రోగ్రామ్‌ను ఆమోదించింది. చిప్ డిజైన్, తయారీ, సెమీకండక్టర్ల (రావఎతిఇనీనిటబీఇబినీతీబ) సరఫరా, అధ్యయనాలు, ప్యాకేజింగ్ సామర్థ్యం వంటి వాటికి దీర్ఘకాల మద్దతు అందించేందుకు ఈ ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చింది.

రెండు మెగా కారిడార్లు..

ఈ సందర్భంగా వారణాసిలో రెండు మెగా కారిడార్లకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వారణాసి రింగ్ రోడ్, 31వ జాతీయ రహదారిని కలుపుతూ 43.21 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌కు క్యాబినెట్ అనుమతిలిచ్చింది. రూ.10,998 కోట్లతో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. ఇక, ఎన్‌హెచ్ 19-వారణాసి రింగ్‌రోడ్ మధ్య రూ.14,467 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎలివేటెడ్ కారిడార్‌ను కేంద్రం ఆమోదించింది.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
16 జూలై 2026

# గన్నేరువరంలో భూవివాదం.. ఎస్టీ కుటుంబం నిరసన

- పాలకవర్గం కక్షసాధింపు ఆరోపణ
- తాతల కాలం నాటి భూమి రక్షణకు ఆందోళన
- అధికారుల సంప్రదింపులు.. సర్పంచ్ వివరణ
- హక్కుల కోసం కోర్టు ద్వారా న్యాయపోరాటం



**గన్నేరువరం, జూలై 15 (జనంసాక్షి) :** తమ తాతల కాలం నాటి భూమిని లాక్కునేందుకు స్థానిక పాలకవర్గం వేధిస్తోందంటూ ఓ పేద ఎస్టీ (ఎరుకల) సామాజికవర్గానికి చెందిన కుటుంబం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసనకు దిగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన కుర్ర హరీష్ అనే ఎస్టీ యువకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఆందోళనకు దిగాడు. ఊరి చివరన సర్వే నెంబర్ 18లో ఉన్న 12 గుంటల భూమిలో తమ తాతల కాలం నుండి ఇల్లు కట్టుకుని నివసిస్తున్నామని, దీనికి సంబంధించిన పట్టా పత్రాలు కూడా తమ వద్ద ఉన్నాయని బాధితుడు స్పష్టం చేశాడు. అయితే తాము ఆ గ్రామంలో ఒకే ఒక్క ఎరుకల కుటుంబం ఉన్నామనే చులకన భావంతో, రాజకీయ కక్షతో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇద్దరు వార్డు మెంబర్లు కలిసి తమను వేధిస్తున్నారని హరీష్ ఆవేదన వ్యక్తం చేశాడు. తమకున్న 12 గుంటల స్థలంలో నుండి 3 గుంటల భూమిని వీవో బిల్డింగ్‌కు ఇవ్వాలంటూ నిరంతరం ఒత్తిడి తెస్తున్నారని తెలిపాడు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ ఇప్ప నరేందర్ స్పందించారు. బాధితుడికి చట్టపరమైన హక్కులు ఉన్నాయని, కోర్టు ద్వారా న్యాయపోరాటం చేయాలని సూచించారు.
మరోవైపు ఈ వివాదంపై సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సును వివరణ కోరగా.. తాము ఎవరినీ వేధించడం లేదని, అధికారుల సూచనల మేరకే ప్రభుత్వ భూమిని పరిరక్షించే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బాధితులు తమ భూమి రక్షణకు అన్ని చట్టపరమైన మార్గాలు అనుసరిస్తామని తెలిపారు.

# సింగరేణిని కాపాడింది బీజేపీయే!

- భట్టి విక్రమార్క వాస్తవాలు గుర్తు చేసుకుని మాట్లాడాలి
- విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్‌రెడ్డి
- తాడిచెర్ల బ్లాక్-2 కేటాయింపు చారిత్రాత్మక నిర్ణయం
- మంథని అభివృద్ధికి కొత్త ఆశలు

**మంథని, జూలై 15 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా మంథని లోని రామ్‌రెడ్డి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంథని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి మాట్లాడుతూ సింగరేణి భవిష్యత్తు, కార్మికుల సంక్షే మం, మంథని అభివృద్ధే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర ప్రజల్లో కొత్త ఆశలను నింపిందన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్న ఈ యాత్ర సింగరేణి కార్మికులు, మంథని ప్రజల్లో భరోసా కల్పించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉన్నప్పటికీ సింగరేణిని బలోపేతం చేయకుండా ఆదాయ వనరుగా మాత్రమే ఉపయోగించుకున్నారని విమర్శించారు.
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 2013 తర్వాత జరిగిన పరిణామాలను గుర్తు చేసుకుని మాట్లాడాలని సూచించారు. 2013-14లో వెలుగులోకి వచ్చిన బొగ్గు గనుల కేటాయింపుల కుంభకోణం అనంతరం సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని పాత కేటాయింపులను రద్దు చేసి, బొగ్గు గనుల కేటాయింపులు వేలం విధానం ద్వారానే జరగాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల బ్లాక్-2ను ఎలాంటి ప్రైవేట్ టెండర్లు లేకుండా నేరుగా సింగరేణికి కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. మంథని బీజేపీ నాయకుల విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి సింగరేణికి కేటాయింపు జరిగేలా కీలక పాత్ర పోషించారని తెలిపారు. మంథని కూడా రామగుండం, భూపాలపల్లి, మంచిర్యాల తరహాలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఈ నిర్ణయంతో ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కొండపాక సత్య ప్రకాష్, బోగోజు శ్రీనివాస్, సిలివేరి సతీష్, లక్ష్మణ్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గం చెరువు మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలకు కమిషనర్ ఆదేశాలు



**శేరిలింగంపల్లి, జూలై 15 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ జి సృజన బుధవారం సిఎంసి మరియు హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు ఉన్నతాధికారులతో కలిసి దుర్గం చెరువు ఎస్టీపి ఇంటర్‌సెప్షన్ అండ్ డైవర్షన్ వ్యవస్థను పరిశీలించి, చెరువులోకి చేరుతున్న మురుగునీటి ప్రవాహాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం అమల్లో ఉన్న మురుగునీటి మళ్లింపు ఏర్పాట్లను సమీక్షించిన కమిషనర్, దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో చెరువులోకి మురుగునీటిని తీసుకువస్తున్న వెంట్లను రేపటిలోగా మూసివేయాలని, సోమవారం నాటికి మురుగునీటి ప్రవాహాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు మళ్లించాలని ఆమె ఆదేశించారు. ఇంటర్ సెక్షన్ అండ్ డైవర్షన్ నిర్మాణంవద్ద సోమవారంనాటికి ఎరేటర్లను ఏర్పాటు చేయాలని రహేజా సంస్థకు సూచించడం జరిగిందని అధికారులు తెలిపారు. ఎస్ఎన్డిపి బాక్స్ డ్రెయిన్ పనుల సమయంలో ప్రభావితమైన సీవర్ లైన్‌ను పునరుద్ధరించాలని, భవిష్యత్తులో మురుగునీరు చెరువులోకి చేరకుండా శాశ్వత మళ్లింపు పైప్‌లైన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సిఎంసి కమిషనర్ అధికారులను ఆదేశించారు. టి-హబ్ టిజిఐఐసి లేఅవుట్ ప్రాంతంనుంచి వస్తున్న మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులకు సిఎంసి కమిషనర్ సూచించారు. ఆదేశాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్ ఈ నేపథ్యంలో సోమవారం మరోసారి దుర్గం చెరువును సందర్శించి పనుల పురోగతి, తీసుకున్న చర్యలను స్వయంగా సమీక్షిస్తానని అధికారులకు స్పష్టం చేశారు.

# సర్ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయండి

**శేరిలింగంపల్లి జెడ్సి నారాయణ్ అమిత్**

**శేరిలింగంపల్లి, జూలై 15 (జనంసాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను శేరిలింగంపల్లి జోన్ పరిధిలో మరింత వేగవంతంగా అమలు చేయడంతో పాటు పారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా ఒకే సమయంలో పూర్తి చేయాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్/ జోన్ ఈఆర్ఓ నారాయణ్ అమిత్ స్పష్టం చేశారు. ఈ మేరకు సర్ నోడల్ అధికారులు, జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో స్పెషల్ సమ్మరీ రివిజన్ - సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేసే విధంగా ఆయన బుధవారం జోన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లు, నోడల్ అధికారులు ఇంటింటికి సరఫరా చేస్తున్నఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించారు. సేకరించిన దరఖాస్తులను తక్షణమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక డిజిటలైజేషన్ కౌంటర్లను ఏర్పాటు చేయించడంతోపాటు పనితీరును సమీక్షించారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలని మరియు అర్హులైన వారందరూ నమోదు చేసుకోవాలని ఈ క్రమంలో ప్రజలకు శేరిలింగంపల్లి జోన్ ఈఆర్వో నారాయణ్ అమిత్ అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చూడాలని, ఎటువంటి లోపాలు లేకుండా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శేరిలింగంపల్లి జోన్ ఈఆర్ఓ తోపాటు సర్ నోడల్ అధికారులుసైతం వివిధ కాలనీలలో క్షేత్ర పరిశీలన నిర్వహించడం గమనార్హం. తనిఖీలు నిర్వహించిన ప్రాంతాలలో భాగంగా పాపిరెడ్డినగర్, శేరిలింగంపల్లి, అంజయ్యనగర్, ప్రేమ్‌నగర్, న్యూ హాఫీజ్‌పేట్, ఆదర్శ్‌నగర్, గుల్మోహర్ పార్క్ కాలనీలలో అధికారులు పరిశీలించారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేదు

- ప్రభుత్వ పథకాలు లక్ష్యాలకు అనుగుణంగా సకాలంలో పూర్తి చేయాలి
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు
- సర్వేలు, భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి పనులపై ప్రత్యేక దృష్టి



**కామారెడ్డి, జూలై 15 (జనంసాక్షి):** జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, వివిధ శాఖల పనితీరు, పెండింగ్ అంశాలు, క్షేత్రస్థాయి అమలుపై సమగ్రంగా సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలులో జాప్యానికి తావివ్వకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.
సమగ్ర ఇంటింటి సర్వే (ఎస్ఐఆర్) ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో ఆశించిన మేర కొనసాగుతోందని పేర్కొన్న కలెక్టర్, పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా కామారెడ్డి మున్సిపాలిటీలో సర్వే వేగాన్ని మరింత పెంచాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో రేషనలైజేషన్ చేపట్టి అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 20వ తేదీలోగా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని ఈఆర్వోలు, ఏఆర్వోలకు ఆదేశించారు.
భూ భారతి కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించి అందుతున్న ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా పరిష్కరించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని ఆదేశించారు. తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్వో) కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూములను త్వరగా గుర్తించి కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
సింగూర్ ప్రాజెక్టుపై ఆధారపడిన 14 మండలాలు, రెండు మున్సిపాలిటీలలో నీటి లభ్యత తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో నీటి సంరక్షణ చర్యలను తక్షణమే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవోలు, డీఆర్‌డీఓ పీడీ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కాంటింజెన్సీ తాగునీటి పనులను గ్రౌండింగ్ చేసి, నీటి వృథాను అరికట్టే చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో గృహాల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందజేయాలని ఆదేశించారు. డెమో ఆథెంటికేషన్ వంటి సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా గరిష్ట స్థాయిలో వ్యక్తి పనిదినా లు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాల్సి న బాధ్యత తమపై ఉందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మూడు నెలలుగా ఆర్‌సీ, లైసెన్స్ కార్డుల పంపిణీ నిలిచివేత

- ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయంలో కుప్పలుగా పేరుకుపోయిన వందలాది కార్డులు
- నిత్యం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వాహనదారులు
- 'వాహన్' పోర్టల్ సాంకేతిక మార్పులే కారణమంటున్న అధికారులు



**ఉప్పల్, జూలై 15 (జనంసాక్షి):** ఉప్పల్ ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఏ) కార్యాలయంలో వాహనాల రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు (ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్ కార్డుల పంపిణీ గత మూడు నెలలుగా నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసిన వారు, యాజమాన్య మార్పులు చేయించుకున్న వారు, కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ పొందిన వారు తమ కార్డుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో వందల సంఖ్యలో కార్డులు సిద్ధంగా ఉన్నప్పటికీ వాటిని లబ్ధిదారులకు అందజేయలేక పోతుం డటంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. కార్డులు ఎప్పుడు అందుతాయో తెలియక ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వాహనదారులు కార్యాలయానికి చేరుకుని అధికారులను నిలదీస్తున్నారు. అయితే సమస్య ఎప్పుడు పరిష్కార మవుతుందనే అంశంపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతు న్నారని బాధితులు వాపోతున్నారు. దీంతో కార్యాలయానికి పలుమార్లు తిరగాల్సి రావడంతో సమయం, ప్రయాణ వ్యయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఇదిలా ఉండగా, ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో అసలు రిజిస్ట్రేషన్ కార్డును చూపించాలని కోరుతుండగా, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినా కార్డు ఇంకా అందలేదని వాహనదారులు వివరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల ఈ విషయమై ట్రాఫిక్ పోలీసులకు, వాహనదారులకు మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారిక ధ్రువపత్రం చేతిలో లేకపోవడంతో అనవసర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు అంటున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ పొందిన వారికీ ఇదే పరిస్థితి నెలకొంది. ఉద్యోగ నియామకాలు, బ్యాంకింగ్ లావాదేవీలు, ప్రభుత్వ సేవలు, ఇతర అధికారిక అవసరాల కోసం లైసెన్స్ కార్డు తప్పనిసరి కావడంతో కార్డు అందక ఇబ్బందులు పడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. డిజిటల్ కాపీ ఉన్నప్పటికీ అనేక సందర్భాల్లో భౌతిక కార్డునే అధికారులు కోరుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . ఉప్పల్ రవాణా కార్యాలయంలో పేరుకుపోయిన అన్ని రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులను తక్షణమే లబ్ధిదారులకు అందజేయడంతో పాటు, 'వాహన్' పోర్టల్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని వాహనదారులు రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఆలస్యం కొనసాగితే ప్రజలకు ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని, డిజిటల్ సేవల పేరుతో సాధారణ పౌరులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడకూడదని వారు అభిప్రాయపడుతున్నారు.



# యువ సంగ్రామ సభను విజయవంతం చేయాలిలి

**తలసాని శ్రీనివాస్ యాదవ్ సబితా ఇంద్రారెడ్డి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

**ఎల్బీనగర్ జులై 15 (జనం సాక్షి) :** సరూర్‌నగర్ స్టేడియంలో జూలై 18న బీఆర్ఎస్ నిర్వహించనున్న 'యువ సంగ్రామ సభ' ఏర్పాట్లకు మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో పాటు బండారు లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, శంబిపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి శుభారంభం చేశారు. సభా వేదిక, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలు కోసం నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



# ఉప్పల్ విద్యార్థులకు విదేశీ విద్యలో అండగా ఎమ్మెల్యే

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ ప్రతినిధితో బండారి లక్ష్మారెడ్డి కీలక భేటీ
- వీసా సమస్యలు, విదేశీ ఉన్నత విద్య అవకాశాలపై సుదీర్ఘ చర్చ
- ఉప్పల్ విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందించేందుకు కృషి

ఉప్పల్, జూలై 15 (జనం సాక్షి): విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఉప్పల్ నియోజకవర్గ విద్యార్థులకు అండగా నిలుస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరో కీలక అడుగు వేశారు. విద్యార్థులు వీసా ప్రక్రియలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల సమయంలో ఎదురయ్యే సమస్యలు, భవిష్యత్తులో వారికి మరింత మెరుగైన సహకారం అందించే అంశాలపై బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ ప్రతినిధి నళిని రఘు రామన్‌తో విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెం.1లో ఉన్న తాజ్ డెక్కన్ హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో విదేశీ విద్యకు సంబంధించిన పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా బ్రిటన్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు వీసా దరఖాస్తు ప్రక్రియను మరింత సులభతరం చేయడం, అవసరమైన మార్గదర్శకత్వం కల్పించడం, విద్యార్థులకు సరైన సమాచారం అందించడం, విద్యా అవకాశాలను విస్తరించడం వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "ఉప్పల్ విద్యార్థులకు విదేశీ విద్యలో అండగా నిలవడం నా బాధ్యత. ఆర్థిక, సాంకేతిక లేదా పరిపాలనా కారణాలతో ఏ విద్యార్థి తన కలలను కోల్పోకూడదు. ప్రతిభ కలిగిన ప్రతి విద్యార్థికి అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం, సహాయ సహకారాలు అందేలా నిరంతరం కృషి చేస్తాను" అని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఎదుర్కొంటున్న వీసా జాప్యాలు, పత్రాల ధృవీకరణ, అడ్మిషన్ ప్రక్రియలో తలెత్తే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ ప్రతినిధిని ఎమ్మెల్యే కోరారు. అలాగే భవిష్యత్తులో అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల కోసం ప్రత్యేక సమాచార సదస్సులు నిర్వహించే అవకాశాలపైనా చర్చించినట్లు తెలిపారు.
విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధే లక్ష్యంగా సంబంధిత అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ, అవసరమైన ప్రతి విషయంలో తన కార్యాలయం ద్వారా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఉప్పల్ నియోజకవర్గ యువత ప్రపంచస్థాయి విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో గంధం నాగేశ్వరరావు, జెట్టా కిషోర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బహదూర్‌గూడ రైతులకు అన్యాయం చేస్తే సహించం

**బీఆర్ఎస్ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి**



**శంషాబాద్,జూలై15(జనంసాక్షి) :** బహదూర్‌గూడ భూములపై అత్యున్నత న్యాయస్థానం స్టేటస్‌కో కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఆ ఆదేశాలను ఆర్డీఓ, ఎమ్మార్వో ఎలా అమలు చేస్తారో ప్రజలకు వివరించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బహదూర్‌గూడ గ్రామ రైతులు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేటస్‌కో అమల్లో ఉన్న భూముల్లో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. రైతుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే పేరుతో రైతుల భూములపై అనవసర జోక్యం చేసుకోవడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రైతులు, పేదల హక్కులు దెబ్బతింటున్నాయని విమర్శించిన ఆయన, జిల్లా కలెక్టర్‌కు స్టేటస్‌కోలో ఉన్న భూములపై ఏ అధికారంతో చర్యలు తీసుకుంటున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇదే విధంగా కొనసాగితే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బుల్లెట్ రైలు, బస్ టెర్మినల్, మెట్రో రైలు వంటి అభివృద్ధి పనుల పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రైతుల హక్కులను కాపాడేందుకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బహదూర్‌గూడ రైతులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో అధ్యక్షులు సందీప్, చెక్కల ఎల్లయ్య, కొలను ప్రదీప్ , రాహుల్, కుమ్మరి నరసింహ గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రూ,35 లక్షలతో వీరన్న పల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి..

**తలకొండపల్లి జూలై15(జనంసాక్షి):** ప్రజా పాలనలోనే గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి, ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలంలోని వీరన్న పల్లి గ్రామంలో బుధవారం రూ,20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి,ఎంజిఎన్ఆర్ఈజి ఎస్ నిధుల నుండి రూ,15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ కడారి రాము యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో పరిపాలన సౌలభ్యం కొరకే నూతనంగా పంచాయతీ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువలు,తాగునీటి వసతుల ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పనులను పూర్తిచేయాలని అధికారులకు,కాంట్రాక్టర్లకు సూచించారు. గ్రామ అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా ప్రజలంతా కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడారి రాము యాదవ్,ఉప సర్పంచ్ నూనె రాఘవేందర్ గౌడ్,డీసీసీ ప్రధాన కార్యదర్శి రఘురాములు,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి,మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, శ్రీశైలం, రాజు, మాజీ ఎంపిటిసి రమేష్, కాంగ్రెస్ నాయకులు యాదిరెడ్డి, అజీజ్, ఆవాంచ నరసింహారెడ్డి, రేణు రెడ్డి, డేవిడ్, తిరుపతయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివకుమార్ గౌడ్, మిన్నాల వెంకటయ్య, కడారి లక్ష్మణ్ యాదవ్, రాజేందర్ నాయక్,వివిధ గ్రామాల కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




- ఎస్‌వోటీ మెరుపు దాడుల్లో గడువు ముగిసిన ఫుడ్ కలర్స్, ఫ్లేవర్లు
- ఫంగస్ పట్టిన అంజీర్ స్వాధీనం
- లేబుల్ లేని ముడి పదార్థాలతో తయారీ

## కప్ ఐస్‌క్రీమ్ కాదు..
# కల్తీ కాక్‌టాయిల్
### రామంతాపూర్‌లో కల్తీ ఐస్‌క్రీమ్ కర్మాగారం బట్టబయలు

*ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి నాసిరకం పదార్థాలతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న మరో కల్తీ కేంద్రాన్ని స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌వోటీ) అధికారులు బట్టబయలు చేశారు. రామంతాపూర్‌లోని లక్ష్మీనారాయణ కాలనీలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంపై బుధవారం మెరుపు దాడులు నిర్వహించగా, గడువు ముగిసిన ఫుడ్ కలర్స్, ఫ్లేవర్లు, ఫంగస్ పట్టిన ఎండు అంజీర్‌తో పాటు లేబుల్ లేని ముడి పదార్థాలు భారీగా వెలుగుచూశాయి.*

**ఉప్పల్, జూలై 15 (జనంసాక్షి) :** విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన అధికారులు తనిఖీల్లో గడువు ముగిసిన రసాయనాలు, అపరిశుభ్ర పరిస్థితుల్లో నిల్వ చేసిన ముడి పదార్థాలు, పూర్తిగా ఫంగస్ పట్టిన ఎండు అంజీర్‌ను గుర్తించారు. ఇవే పదార్థాలను ఐస్‌క్రీమ్ తయారీలో వినియోగిస్తున్నట్లు తేలడంతో భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. తయారీ తేదీ, గడువు తేదీ, తయారీ సంస్థ వివరాలు లేని మూడు రకాల ముడి పదార్థాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పరిశుభ్రత నిబంధనలను పూర్తిగా విస్మరించి నేలపైనే ముడి పదార్థాలు నిల్వ చేయడం, గడువు ముగిసిన పదార్థాలను కొత్త వాటితో కలిపి వినియోగించడం, ఆహార భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించడం వంటి అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నాసిరకం పదార్థాలతో తయారైన ఐస్‌క్రీమ్‌లను వినియోగిస్తే ప్రజలకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలతో పాటు తయారీ కేంద్రంపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం ఉప్పల్ పోలీసులకు అప్పగించారు.

**అనేక లోపాలు గుర్తించిన అధికారులు**

ముడి పదార్థాలను నేలపైనే నిల్వ చేయడం, శుభ్రత పాటించకుండా తయారీ నిర్వహించడం, గడువు ముగిసిన వస్తువులను కొత్త పదార్థాలతో కలిపి వినియోగించడం, అవసరమైన భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు. ప్రజలు కూడా ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచించారు. అనుమానాస్పద ఆహార తయారీ కేంద్రాలు లేదా నాసిరకం ఉత్పత్తులపై సమాచారం ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

- జిల్లా విద్యాశాఖ సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి
- ఎస్సెస్సీ టాపర్లకు సన్మానం, నగదు ప్రోత్సాహకాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధనకు ప్రాధాన్యం
- మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల వెచ్చింపు




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 15 జనంసాక్షి :** ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి సూచించారు. జిల్లాలో ఉత్తీర్ణత మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో కృషి చేస్తూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం జిల్లా విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాల నిర్వహణ తీరుతెన్నులు, సాధించిన ఫలితాలు, మౌలిక సదుపాయాల స్థితిగతులు తదితర అంశాలపై సమీక్ష జరిపి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విద్యా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నారని అన్నారు.
విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రం రాజీ పడబోదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఒక్కో విద్యా సంస్థకు 200 కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తోందని, ఇవి కాకుండా అన్ని రకాల అధునాతన సదుపాయాలతో ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మిస్తోందని గుర్తు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, విద్యా రంగంలో నిజామాబాద్ జిల్లా పనితీరు సంతృప్తికరంగా ఉందని అన్నారు. ప్రభుత్వ బడులలో విద్యార్థుల ప్రవేశాల విషయంలో రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా ఐదవ స్థానంలో ఉందని, ఈ నెలాఖరు వరకు లక్ష్యానికి అనుగుణంగా ప్రవేశాలు పూర్తి చేసి జిల్లాను ముందంజలో నిలుపుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సెస్సీలో టాపర్లుగా నిలిచిన లహరిక, సౌజన్య, సంజన, లాస్య, అభిజ్ఞ తదితరులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించగా, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి తన తరపున ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు పారితోషికం అందించి ప్రోత్సహించారు. ప్రభుత్వ బడులలో విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించేందుకు కృషి చేసిన ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను సైతం సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, నుడా చైర్మన్ కేశవేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం చైర్మన్ శేఖర్ గౌడ్, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, విద్యా శాఖ అధికారులు, ఆర్.సీ.ఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో
# కరీంనగర్ కమిషనరేట్ సత్తా చాటింది

- 11 పతకాలతో జోన్-3లో అగ్రస్థానం
- 2 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య పతకాలు
- పోలీస్ సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ
- కమిషనర్ గౌష్ ఆలం అభినందన



**కరీంనగర్ బ్యూరో, జూలై 15:** 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలు, స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొత్తం 11 పతకాలు సాధించి జోన్-3లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. ఈ పోటీల్లో కరీంనగర్ కమిషనరేట్ తరపున పాల్గొన్న క్రీడాకారులు 2 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య పతకాలు సాధించి కమిషనరేట్‌కు గౌరవాన్ని తీసుకువచ్చారు. పీసీ పి. రాజు (జి.నం.3106) – 90 కిలోల బాడీ బిల్డింగ్ విభాగంలో స్వర్ణ పతకం, ఏఆర్‌పీసీ ఎస్. నరేందర్ (జి.నం.296) – 85 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం, పీసీ ఎం.డి. వహాజుద్దీన్ (జి.నం.3940) – 80 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం, ఏఆర్‌పీసీ ఎ.శంకర్ (జి.నం.984) – యోగా విభాగంలో స్వర్ణ పతకం, ఏఆర్‌పీసీ వి. సాయి మాధవ్ (జి.నం. 3687) – ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత పతకం, 55 కిలోల బాక్సింగ్‌లో కాంస్య పతకం, పీసీ జె. శ్రీనివాస్ (జి.నం.1658) – 81 కిలోల జూడోలో కాంస్య పతకం, డబ్ల్యూపీసీ ఎ. స్వప్న (జి.నం.3088) – 65 కిలోల ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత పతకం, డబ్ల్యూపీసీ ఎం. అరుణ (జి.నం.47) – 77 కిలోల బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో 3 కాంస్య పతకాలు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. జోన్-3లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ – 2 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య (మొత్తం 11), సిద్దిపేట కమిషనరేట్ – 5 పతకాలు, రాజన్న సిరిసిల్ల – 3 పతకాలు, కామారెడ్డి – 2 పతకాలు, మెదక్ – 2 పతకాలు సాధించాయి. ఈ విజయంతో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ జోన్-3లో అత్యధిక పతకాలు సాధించిన యూనిట్‌గా నిలిచింది. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పతక విజేతలను అభినందిస్తూ, విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, నిరంతర సాధనతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కమిషనరేట్‌కు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తోందని, పోలీసు సిబ్బంది ఆరోగ్యవంతంగా, ఫిట్‌గా ఉండేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు.

# సింగరేణి అధికారులకు స్వచ్ఛతా పఖ్వాడాపై అవగాహన

- ఐబీపీసీఎల్ ఆధ్వర్యంలో రామగుండం ఏరియాలో కార్యక్రమం
- పరిశుభ్రత, కార్యస్థల భద్రత, పర్యావరణ పరిరక్షణపై దృష్టి
- మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేసిన అధికారులు
- పరిశుభ్రమైన కార్యస్థలాలు ఉత్పాదకతను పెంచుతాయి



**గోదావరిఖని, జూలై 15జనంసాక్షి :** భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా పఖ్వాడాలో భాగంగా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అధికారుల కోసం పరిశుభ్రత, పరిశుచితత్వం, కార్యస్థల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని గోదావరిఖని లోని ఇల్లందు క్లబ్‌లో నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజనీర్లు, డీజిల్ ఇన్‌ఛార్జీలు, స్టోర్ ఇన్‌ఛార్జీలు సహా సింగరేణి అధికారులు పాల్గొని స్వచ్ఛతా పఖ్వాడా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం చివరలో పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు మరియు పరిశుభ్రమైన పచ్చని కార్యస్థలం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మొక్కలు నాటే కార్యక్రమం కూడా నిర్వహించారు.
ఈ సందర్భంగా సింగరేణి జనరల్ మేనేజర్లు డి. లలిత్ కుమార్ (అర్జీ-1), బి. వెంకటయ్య (అర్జీ-2), ఎస్. మధుసూదన్ (అర్జీ-3), ఏం. శ్రీనివాస్ (ఎస్ఆర్‌పీ), ఎన్. రాధా కృష్ణ (యంయం) మాట్లాడుతూ బీపీసీఎల్ ఈ చొరవను ప్రశంసించారు. పరిశుభ్రతను పాటించడం, సురక్షిత పని పద్ధతులను అనుసరించడం ఉద్యోగుల శ్రేయస్సుకు ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. పరిశుభ్రత, భద్రతను కాపాడటం ద్వారానే సమర్థవంతమైన కార్యకలాపాలు మరియు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, పరిశుభ్రత, భద్రత కోసం సమయాన్ని వెచ్చించడం ఆరోగ్యకరమైన, మరింత ఉత్పాదకత కలిగిన పని వాతావరణాన్ని సృష్టించడంలో సహాయపడుతుందని వారు నొక్కి చెప్పారు. బీపీసీఎల్ రాష్ట్ర స్థాయి అధిపతి లక్ష్మిల్ చౌహాన్ మాట్లాడుతూ పరిశుభ్రత, భద్రతను ప్రచారాలకు మాత్రమే పరిమితం చేయకుండా రోజువారీ పని సంస్కృతిలో భాగంగా మార్చుకోవాలని అన్నారు. సింగరేణి కార్యస్థల పరిశుభ్రత, భద్రతలో ఉన్నత ప్రమాణాలను కొనసాగిస్తోందని ప్రశంసించి, ఉద్యోగులు బాధ్యతాయుతమైన పద్ధతులను అవలంబిస్తూ కొనసాగాలని కోరారు. బీపీసీఎల్ చీఫ్ మేనేజర్ (మార్కెటింగ్) బి. రఘునాథ రావు మాట్లాడుతూ సింగరేణి పరిశుభ్రత భద్రతలో స్థిరంగా మంచి పద్ధతులను ప్రదర్శిస్తోందని అన్నారు. స్వచ్ఛతా పఖ్వాడా ప్రచారం లక్ష్యం అవగాహనను బలోపేతం చేయడం, పరిశుభ్రమైన, సురక్షితమైన, పచ్చని కార్యస్థలాలను నిర్వహించడానికి సామూహిక బాధ్యతను ప్రోత్సహించడమే అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడటమే కాకుండా కార్యస్థల ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా సహాయపడ తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, కార్యస్థల భద్రతను వారి వారి కార్యస్థలాల్లో ప్రోత్సహించడానికి తమ నిబద్ధతను మరోసారి చాటారు. బీపీసీఎల్ అధికారులు సింహాచలం, దీపక్, శివాజీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు పోటీపడాలి

- ఉల్లంపల్లిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ
- గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధుల మంజూరు



**చిగురుమామిడి జులై 15(జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు పోటీ పడాలని,ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు స్వచ్ఛమైన,అవినీతి రహిత పాలనను అందించాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తెలిపారు.ఉల్లంపల్లి గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం గ్రామాభి వృద్ధికి మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,ఎంపీడీవో రామ్మోహనచారి,ఎస్ఐ జగదీశ్వర్,ఐకేపీ ఏపీఎం రజిత,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మార్క రాజ్ కుమార్, కార్యదర్శి బోయిని రమేష్,వివిధ గ్రామాల సర్పంచులు కాటం సంపత్ రెడ్డి, కొంకట మౌనిక,గుళ్ళ రజిత రాజు,గునుకుల మధుసుధన్ రెడ్డి, గోగురి లక్ష్మి మురహరి రెడ్డి, సన్నీళ్ళ కవిత వెంకటేష్,మాజీ సర్పంచ్ కొత్త కైలాసం, సామాజిక సేవకులు సూదగోని శ్రీనివాస్,ప్రజాప్రతినిధులు హాజరై భూమి పూజ నిర్వహించి,గ్రామ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్మన్ కంది తిరుపతి రెడ్డి మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయిన అనంతరం గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని, గ్రామ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగేందుకు ఈ భవనం దోహదపడుతుందని పేర్కొన్నారు.
అలాగే స్థానిక ఎస్సై జగదీశ్వర్ మాట్లాడుతూ ఉల్లంపల్లి గ్రామంలోని ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తెలుపుతూ యువకులు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ఉపసర్పంచ్ కాణవేని జితేందర్,వార్డు సభ్యులు స్వరూప, ప్రభాకర్, సురేష్, ఇందిరా,కొత్త మధు, రజిత, కానవేణి రజినీకాంత్, గ్రామపంచాయితీ కార్యదర్శి జ్యోతి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు కాణవేణి శివ కుమార్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## టిఆర్ఎస్‌కు షాక్ కారు దిగిన ఇద్దరు కార్పొరేటర్లు

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పట్టణ ప్రాంతంలోని 28వ డివిజన్ కార్పొరేటర్ ధారంగులకు మార్, 26వ డివిజన్ కార్పొరేటర్ భగవత్ నరసింహ సారయ్య నాయక్, టిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శివరాత్రి గంగాధర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. రెండు డివిజన్లకు చెందిన టిఆర్ఎస్ శ్రేణులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. రామగుండం నియోజవర్గ శాసనసభ్యులు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రామ గుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు దీటి బాలరాజు, మాజీ కార్పొరేటర్ మొహమ్మద్, కుందనపల్లి సర్పంచ్ అరుకుటి కొమురయ్య తదితరులు ఉన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఎన్నడు లేని విధంగా రామగుండం నియోజకవర్గం లో జరుగుతున్న అభివృద్ధి, అదే విధంగా ప్రతి నిరుపేద కుటుంబానికి అండ దండగా నిలబడుతున్న ఎమ్మెల్యే అడుగుజాడలో నడవడానికి, అదేవిధంగా ఆయన వెంట ఉంటూ నిరుపేద కుటుంబాలకు సేవలు అందించడానికి ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు.


# మొక్కలు నాటేందుకు సిద్ధంగా పెట్టాలి

- వన మహోత్సవంపై అటవీశాఖ, వివిధ శాఖల అధికారులతో సమీక్ష
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జులై 15 (జనం సాక్షి);** వర్షాలు కురిసిన తరువాతే మొక్కలు నాటేందుకు సిద్ధంగా పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ఆద్వర్యంలో మొక్కలు నాటే లక్ష్యంపై జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ,పలు శాఖలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.వివిధ పథకాల కింద గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన, పెరగకపోయిన వాటిని అటవీశాఖ అధికారులు పరిశీలించాలని సూచించారు.వర్షాలు కురిసిన తరువాతే ఏర్పాట్లు చేసి,వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు.నీటి పారుదల శాఖ స్థలాలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,అటవీ ప్రాంతాలు,మున్సిపల్ దంపింగ్ యార్డులు,ఫారెస్ట్ అర్బన్ పార్క్,ఎక్సైజ్ శాఖ, నూతన రహదారుల వెంట మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నర్సరీలు ఉండాలని స్పష్టం చేశారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన మొక్కల లక్ష్యం మొత్తం 8,65,200 గా లక్ష్యాన్ని నిర్ణయించామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇట్టి సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం.జిల్లా విద్యాధికారి మొండయ్య,జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్,జిల్లా పంచాయతీ అధికారి జయశీల,జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా,లోకేష్,అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారాక్వాట్ గడ్డిమందుపై బ్యాన్




**ముస్తాబాద్ జులై 15( జనం సాక్షి) :** రైతాంగానికి శాపంగా మారిన పారాక్వాట్ గడ్డిమందుపై కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. విషతుల్యమైన రసాయనం అమ్మకాలు నిలిపివేస్తూ మంగళవారం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. జులై 14 నుంచే ఈ నిషేధం అమల్లోకి వస్తుందని వెల్లడించింది. ఇప్పటికే 70కి పైగా దేశాల్లో పారాక్వాట్‌ను నిషేధించగా మనదేశంలో మాత్రం ఈ గడ్డిమందు అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ రసాయనం దుష్పరిణామాలపై తీవ్ర స్థాయిలో ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యులు, వ్యవసాయ పరిశోధకులు పదేపదే చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో కేంద్రం ఎట్టకేలకు పారాక్వాట్‌పై నిషేధం విధించింది. దేశ వ్యాప్తంగా నిషేధం అమలులోకి వస్తుందని కేంద్రం వెల్లడించింది.కీటకనాశన చట్టం 1968, సెక్షన్ 27 ప్రకారం పారాక్వాట్ దిగుమతి, తయారీ, రవాణా, పంపిణీపై పూర్తి స్థాయిలో నిషేధం వర్తిస్తుందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. అదే సమయంలో సదరు కంపెనీకి అభ్యంతరాలు, సూచనలు తెలియజేయడానికి 30 రోజుల సమయం ఇచ్చింది. జూలై 13 నుంచి ఆగస్టు 13లోపు పారాక్వాట్ ఉత్పత్తి సంస్థ తమ స్పందన తెలియజేయాల్సి ఉంది. పారాక్వాట్ గడ్డిమందు కారణంగా దేశవ్యాప్తంగా 6 వేలమందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని రికార్డులు చెబుతున్నాయి. పలువురు ప్రముఖులు, ఫౌండేషన్లు సైతం పారాక్వాట్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశాయి. జరుగుతున్న నష్టాన్ని వివరించాయి.
పారాక్వాట్‌కు నిర్దిష్ట విరుగుడు లేనందున వైద్యులు దీనిని అత్యంత ప్రాణాంతకమైన వ్యవసాయ రసాయనాలలో ఒకటిగా భావిస్తున్నారు. శరీరంలోకి ప్రవేశించిన తర్వాత పారాక్వాట్ నేరుగా ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది. ఇది తరచుగా కోలుకోలేని ఫైబ్రోసిస్కు కారణమవుతుంది. మూత్రపిండాలు, కాలేయం, చర్మం, కళ్ళను కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. చికిత్స అనేది రోగనివారకంగా కాకుండా ఎక్కువగా సహాయకారిగా ఉంటుంది కాబట్టి, విషప్రయోగం అనూహ్యంగా అధిక మరణాల రేటును కలిగి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వ్యవసాయ కార్మికులను కూడా పారాక్వాట్ లక్ష్యంగా చేసుకుంటుంది.

**ఇదే మొదటిసారి కాదు :**

పారాక్వాట్ మీద నిషేధం విధించడం ఇదే మొదటిసారి కాదు. కేరళ, ఆంధ్రప్రదేశ్ సహా అనేక రాష్ట్రాలు ఇంతకుముందు దీని వాడకాన్ని పరిమితం చేశాయి. అయితే ఇతర రాష్ట్రాల్లో చట్టపరమైన సవాళ్లు, సాంకేతిక అడ్డంకులను ఎదురయ్యాయి. కేంద్రం స్వయంగా నిపుణుల కమిటీలు, నియంత్రణ సమీక్షల ద్వారా హెర్బిసైడ్లను పదేపదే పరిశీలించింది. ఇప్పుడు, ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం మరియు రిజిస్ట్రేషన్ కమిటీ సిఫారసులను అనుసరించి, వ్యవసాయ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా నిషేధం కోసం ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. మునుపటి రాష్ట్ర స్థాయి ఆంక్షల మాదిరిగా కాకుండా తాజా నిషేధం దేశవ్యాప్తంగా వర్తిస్తుంది.

# ఎలక్ట్రికల్ వర్కర్ల సంఘ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో కార్మికులకు అండగా ఉంటాం
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్ బ్యూరో, జులై 15 (జనంసాక్షి) :** కరీంనగర్ సెంట్రల్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. తమ సంఘ భవన నిర్మాణం కోసం తగిన స్థలం కేటాయించాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కార్మికులందరూ ఒక సంఘంగా ఏర్పడి తమ అవసరాలను, సమస్యలను ఎన్నో ఇబ్బందుల నడుమ తీర్చుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం తమ సంఘం ఆఫీస్ అద్దెలు, ఇతర ఖర్చులను సభ్యులమంతా సొంత డబ్బులతో భరిస్తున్నామని సునీల్ రావు దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న అద్దెలు, ఖర్చుల భారాన్ని తగ్గించుకునే ఆలోచనలో భాగంగా, సొంతంగా సంఘ భవనాన్ని నిర్మించుకోవాలని నిర్ణయించామని, స్పందించి భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు గారు మాట్లాడుతూ... కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో, కరీంనగర్‌లోని అన్ని కార్మిక సంఘాల సౌకర్యార్థం నూతనంగా 'కార్మిక భవన్'ను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మార్గదర్శక త్వంలో ముందుకు వెళ్తున్నామని, కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కరీంనగర్‌లోని కార్మిక సంఘాలన్నీ ఒటికీ ఉపయోగపడేలా ఒక ప్రత్యేక భవనాన్ని నిర్మించడానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని. ఈ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇప్పించే బాధ్యతను తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ దువ్వాసి రాజబాబు, వైస్ ప్రెసిడెంట్ కయ్యం పాపయ్య, జనరల్ సెక్రెటరీ బషీర్ మహమ్మద్, జాయింట్ సెక్రెటరీ పింగిలి మహేష్, ట్రెజరర్ కయ్యం నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పెండ్యాల అనిల్ రెడ్డి, నాయిని గంగారెడ్డి, వొల్లాల రవి, ఇతర బాడీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతకు ప్రత్యేక చర్యలు

## ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు దిశగా చర్యలు

- రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్..
- పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష



హైదరాబాద్, జూలై 15 (జనంసాక్షి) : రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించి, రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేక 'ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో' ఏర్పాటు దిశగా తెలంగాణ పోలీస్ శాఖ చర్యలు ప్రారంభించింది. రోడ్డు భద్రతపై ఈ నూతన సంస్థ ఏర్పాటు గురించి బుధవారం డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత సంస్థ నిర్మాణం, విధులు, సిబ్బంది, సంస్థ చేపట్టాల్సిన చర్యలు, చట్టపరమైన అంశాలు, పరిపాలనా విధానాలపై డీజీపీ ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రస్తుత పరిస్థితులు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, రోడ్డు భద్రతకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రోడ్ సేఫ్టీ బ్యూరో బలోపేతం చేయడం, సంబంధిత శాఖలతో సమన్వయం పెంచడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం వంటి అంశాలపై కార్యాచరణ రూపొందించాలని, మరోసారి పోలీస్ అధికారులతో సమావేశం కూడా నిర్వహించనున్నట్లు డీజీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీ(ఆర్గనైజేషన్) స్వాతి లక్రా, రోడ్ భద్రత విభాగం ఐజి రమేష్ నాయుడు, ఐజీ (పి అండ్ఎల్) గజరావు భూపాల్, జాయింట్ సీపీలు సన్‌ప్రీత్‌సింగ్, జోయల్ డేవిస్‌అధికారులు పాల్గొన్నారు.

# నగరంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు

## నకిలీ నంబర్ ప్లేట్లున్న వాహనాలు సీజ్

హైదరాబాద్, జూలై15 (జనంసాక్షి) : నకిలీ వాహన నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజుల వ్యవధిలో నకిలీ నంబర్ ప్లేట్లు ఉపయోగించిన వారిపై ఐదు క్రిమినల్ కేసులను పోలీసులు నమోదు చేశారు. జూబ్లీహిల్స్, మలక్‌పేట్, బేగంబజార్, అబిడ్స్, కాచిగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి. ఈ ప్రత్యేక తనిఖీల్లో పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా పోలీసులు వెల్లడించారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసుతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనాలపై తప్పనిసరిగా హెచ్ఎస్ఆర్పీ ఉండాలని వారు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలను మరింత కఠినతరం చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు పోలీసులు స్పష్టం చేశారు.




## ఆర్డీఎస్ నీటివాటా

### దశాబ్దాల కల.. ఇంకా ఎండమావిగానే..!

- కరువులు కన్నీళ్లతోనే నడిగడ్డ రైతుల జీవనయానం
- కరువు రక్కసి కోరల్లో ఆయకట్టు..
- పట్టించుకోని అధికార యంత్రాంగం

# తెలంగాణ రైతుల జన్మహక్కు

*రెండు జీవనదులు కృష్ణా, తుంగభద్రల మధ్య విలసిల్లే ప్రాంతం అది. భౌగోళికంగా చూస్తే చుట్టూ జలకళ ఉట్టిపడాలి. కానీ, విధి ఆ ప్రాంత రైతాంగంపై రాసిన రాత వేరు. అదే జోగులాంబ గద్వాల అలంపూర్ ప్రాంతం. స్థానికంగా దీనిని 'నడిగడ్డ' అని పిలుచుకుంటారు. నదుల నడుమ ఉన్నా, ఈ నడిగడ్డ దశాబ్దాలుగా గుక్కెడు తాగునీటి కోసం ఎకరా పొలాన్ని తడుపుకోవడానికి చుక్క నీటి కోసం అల్లాడుతూనే ఉంది. ఈ కరువు కోరల నుండి నడిగడ్డను రక్షించాల్సిన రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, నేడు ఆ ప్రాంత రైతుల కన్నీటి వ్యథకు ప్రతీకగా నిలిచింది.*

జోగులాంబ గద్వాల ప్రతినిధి, జూలై 15 (జనంసాక్షి) :

తుంగభద్ర నదిపై కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో నిర్మించిన అంతర్రాష్ట్ర ప్రాజెక్టు రాజోలిబండ డైవర్షన్ స్కీమ్. ఇది ఒకప్పటి నిజాం సంస్థానం కాలంలో 1946లో మొదలై 1958 నాటికి పూర్తయింది. దీని ద్వారా మూడు రాష్ట్రాల కరువు ప్రాంతాలకు సాగు,తాగునీరు అందుతుంది. నీటి వాటా ప్రాంతాలు ఈ ప్రాజెక్టు ద్వారా 15.9 టీఎంసీల నీటిని తెలంగాణ ప్రాంతానికి కేటాయించడం జరిగింది. 143 కిలోమీటర్ల పొడవైన ఆర్డీఎస్ కాలువ ద్వారా వివిధ ప్రాంతాలకు నీటి వాటా అందుతుంది. పచ్చని పొలాల్లో కరువు ముద్ర ఒకప్పుడు రాగులు, జొన్నలు, సజ్జలతో పాటు తెల్లబంగారమైన పత్తిని పండించిన ఈ నేల, నేడు నెర్రెలు బారిన భూములతో కరవుకు చిరునామాగా మారింది. ఆర్డీఎస్ కాలువ వస్తుందని, తమ బతుకులు మారుతాయని ఆశించిన గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి, మానవపాడు మండలాల రైతాంగానికి దక్కింది మాత్రం గుండెకోతే. కాగితాల్లో 15.9 టీఎంసీల నీటి వాటా తెలంగాణకు ఉన్నా, క్షేత్రస్థాయిలో కాలువ చివరకు ఉండే అలంపూర్ నియోజకవర్గ గ్రామాలకు చుక్క నీరు కూడా చేరని పరిస్థితి దశాబ్దాలుగా కొనసాగుతోంది. వాటా ప్రకారం దాదాపు 87,500 ఎకరాలకు పారాల్సిన నీరు,ఎగువన జరిగే అక్రమ మళ్లింపులు, రాజకీయ ఉదాసీనత వల్ల సగం ఆయకట్టును కూడా తడపలేకపోతోంది.

### నరకయాతన వలసల వేదన

సాగునీరు లేక, చేతిలో పని దొరకక ప్రతి ఏటా వేలాది మంది రైతులు, కూలీలు ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వలసపోతున్నారు. ఊళ్లలో కేవలం వృద్ధులు, పిల్లలు మాత్రమే మిగిలే దయనీయ స్థితి ఇక్కడిది. వర్షాలు కురవక, కాలువ నీరు రాక, బోర్లపై వేల రూపాయలు ఖర్చు చేసి అవి కూడా ఫెయిల్ అవ్వడంతో ఇక్కడి రైతులు అప్పుల బారిన పడుతున్నారు. పక్కనే తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతున్నా, కళ్లముందే కాలువ ప్రవహిస్తున్నా, తమ పొలాలకు నీరు రాకపోవడాన్ని చూసి ఇక్కడి రైతాంగం అనుభవిస్తున్న ఆవేదన వర్ణనాతీతం. "మా నీళ్లు మాకు ఇవ్వండి" అంటూ ఎన్నో ఏళ్లుగా నడిగడ్డ రైతులు చేస్తున్న పోరాటాలు, ధర్నాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్నా అలంపూర్, గద్వాల ఆయకట్టు రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ద్వారా నీరందక దశాబ్దాలుగా తీవ్ర నీటి ముప్పును ఎదుర్కొంటోంది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం రావాల్సిన 15.9 టీఎంసీల నీరు, ఆధునీకరణ లోపం మరియు ఎగువన అక్రమ మళ్లింపుల వల్ల 143 కిలోమీటర్ల టెయిల్-ఎండ్ ప్రాంతానికి చేరడం లేదు. సాగునీటి కొరతతో ఈ ప్రాంత రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి,వలసల వేదనకు గురవుతున్నారు.

### ఎండమావిగా మారిన ఆశ రాజోలిబండ

ఆనకట్ట కర్ణాటక పరిధిలో ఉండటం వల్ల అక్కడి స్థానిక రైతులు కాలువ గండ్లు కొట్టి, వందలాది మోటార్లతో నీటిని తోడేస్తుంటే దిగువన ఉన్న నడిగడ్డ రైతులు దిక్కుతోచని స్థితిలో మిగిలిపోతున్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల వంటి ప్రత్యామ్నాయ పథకాలు కొంతవరకు ఊరటనిచ్చినా, ఆర్డీఎస్ కాలువ పూర్తిస్థాయి ఆధునీకీకరణ జరిగి, ఆధునిక టెక్నాలజీతో తూములు నిర్మించనంత కాలం నడిగడ్డ కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదు.

### ఆంధ్రప్రదేశ్‌తో వివాదం

ఆర్‌డీఎస్ ఆనకట్ట కుడి వైపున ఉన్న 'రివర్ స్లూయిస్' గేట్ల ద్వారా ఏపీ నిరంతరాయంగా నీటిని తరలిస్తోందని కర్ణాటక, తెలంగాణ ఇంజనీర్లు ఆరోపిస్తున్నారు.అలాగే ఏపీ తలపెట్టిన గుండ్రేవుల ప్రాజెక్ట్ 20 టీఎంసీలు వల్ల ఆర్‌డీఎస్ ఆయకట్టు ఎడారిగా మారుతుందని తెలంగాణ పక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### ఆర్‌డీఎస్ గద్వాల నడిగడ్డ ప్రజల జీవనహక్కు

జీవన హక్కు అనే మాట అక్షరాలా సత్యం. బాచావత్ ట్రిబ్యునల్ చట్టబద్ధంగా కేటాయించిన నీటిని సాధించుకోవడం గద్వాల, అలంపూర్ ప్రాంతాల రైతాంగం ప్రాథమిక హక్కు. జోగులాంబ గద్వాల జిల్లాలోని 75 గ్రామాలకు చెందిన 83,987 ఎకరాల ఆయకట్టు పూర్తిగా ఈ ప్రాజెక్టుపైనే ఆధారపడి ఉంది. అయితే దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయం వల్ల ఈ హక్కు కాలరాయబడుతోంది. గద్వాల నడిగడ్డ ప్రజల పాలిట ఆర్‌డీఎస్ అనేది కేవలం ఒక నీటి ప్రాజెక్ట్ కాదు, అది ఆ ప్రాంత ఆర్థిక, సామాజిక మనుగడ, ఆత్మగౌరవ ప్రతీక.

### నీటి వాటా ప్రాంతాలు

ఈ ప్రాజెక్టు ద్వారా 15.9 టీఎంసీల నీటిని తెలంగాణ ప్రాంతానికి కేటాయించడం జరిగింది. 143 కిలోమీటర్ల పొడవైన ఆర్డీఎస్ కాలువ ద్వారా వివిధ ప్రాంతాలకు నీటి వాటా అందుతుంది. అందులో..

**తెలంగాణ :** జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మండలాల్లోని సుమారు 87,500 ఎకరాలకు ఈ నీటి వాటావుంది .

**కర్ణాటక :** రాయచూర్ జిల్లా, మాన్వి తాలూకాలోని దాదాపు 15 గ్రామాల కరువు ప్రాంతాలకు నీటి వాటా ఉంది.

**ఆంధ్రప్రదేశ్ :** కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు 2013 కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్-2 తీర్పు ప్రకారం 4 టీఎంసీల వరకు నీటిని వినియోగించుకునే అవకాశం కల్పించారు. అయితే ఎగువన కర్ణాటక అక్రమ లిఫ్టులు, మోటార్లతో నీటిని మళ్లించుకోవడం,కాలువల పూడిక సమస్యల వల్ల తెలంగాణకు పూర్తిస్థాయిలో నీరు అందక వివాదాలు కొనసాగుతున్నాయి.

# బాలుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

## అమెరికాలో హత్యకు గురైన మేడ్చెల్ యువకుడి కేసులో పురోగతి

హైదరాబాద్, జూలై15 (జనంసాక్షి) : అమెరికాలో హత్యకు గురైన తెలంగాణకు చెందిన యువకుడు కుంచ అన్షుల్ కేసులో 14 ఏళ్ల బాలుడిని అగ్రరాజ్య పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఫిలడెల్ఫియాకు చెందిన నిందితుడిని హత్య, దొంగతనం అభియోగాలపై జులై 10న అరెస్ట్ చేసినట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. అయితే, ఘటన సమయంలో ఆ బాలుడితో ఉన్న మరో వ్యక్తి ఎవరన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపారు. ఆ వ్యక్తి కోసం గాలింపు చేపట్టామని, ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. నార్త్ ఫిలడెల్ఫియాలో జూన్ 5న అన్షుల్ హత్యకు గురయ్యాడు. ఎడ్గ్లీ స్ట్రీట్‌లో నిర్మానుష్యంగా ఉన్న ఓ ఇంటికి పిజ్జాలు డెలివరీ ఇచ్చేందుకు వెళ్లిన అతడిపై దుండగులు దాడి చేశారు. తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అన్షుల్‌ను ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చోరీ కోసమే దుండగులు దాడి చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఉద్దేశపూర్వకంగానే పిజ్జాలు ఆర్డర్ చేసి కాల్పులకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

# బోనాల జాతరలో హస్తకళా మేళా

- 16 నుంచి హైదరాబాద్ హెచ్ఎండిఎ గ్రౌండ్‌లో ప్రదర్శన
- బోనాల మట్టి కుండల నుంచి పట్టుచీరల వరకు..
- తయారీదారులు నుంచి నేరుగా వినియోగదారులకు..
- చేతివృత్తులను ప్రోత్సహించాలి : బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎఫ్ఏసీ), కమిషనర్ బాల మాయాదేవి

హైదరాబాద్, జూలై 15 (జనంసాక్షి) : ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా జూలై 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ (పెద్ద అంబేద్కర్ విగ్రహం పక్కన)లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎఫ్ఏసీ) అండ్ కమిషనర్ బాల మాయాదేవి తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. జులై 16న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి. హెచ్. హనుమంతరావు, అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ఇతర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతి నిధులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటా రని ఆమె తెలిపారు. ఈ ఏడాది 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. చేతివృత్తులు కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి, చేనేత, పూసల తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తుందని ఆమె వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి మేళాను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# నిర్మల్‌లో యువకుడి దారుణ హత్య

నిర్మల్, జూలై15 (జనంసాక్షి) : జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్ పేట్ వైఎస్సార్ నగర్ కాలనీ సమీపంలో ఓ యువకుడిని దుండగులు దారుణంగా హత్య చేశారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అదే కాలనీకి చెందిన అస్లం (23) అనే యువకుడు ఆటోలో వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు వాహనంలో వచ్చి ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. మెడ, కడుపులో కత్తులతో పొడిచి అక్కడి నుంచి పరారయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాస్ పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలుసుకుంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

# జనంసాక్షి కథనంతో కదిలిన యంత్రాంగం

- ఎర్రకుంట ఆక్రమణలపై తహసీల్దార్ కీలక హామీ
- త్వరలో సర్వే.. మట్టి పోత పనులకు తక్షణ బ్రేక్


ఎర్రకుంటపై కబ్జా నీడ!
150 ఎకరాల సాగుకు ముప్పు
- నీటి నిల్వ ప్రాంతాన్ని మట్టితో నింపేస్తూ ఆక్రమణల యత్నం
- అధికారుల మౌనం.. రైతులకు ఆందోళన

కరీంనగర్ బ్యూరో, జూలై 11 (జనంసాక్షి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామ పరిధిలోని ఎర్రకుంట కబ్జాకోరల చెరలో చిక్కుకుందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ 670లో ఉన్న ఈ కుంటలో ప్రొక్లైన్‌తో యథేచ్ఛగా మట్టి పోసి చదును చేస్తుండగా, ఫిర్యాదులు చేసినప్పటికీ రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు స్పందించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను పరిరక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం భూబకాసురులకు వరంగా మారిందని విమర్శిస్తున్నారు.
ప్రస్తుతం కుంటలో నీటి నిల్వ ఉండే ప్రాంతాన్ని కూడా మట్టితో కప్పేస్తూ, భవిష్యత్తులో అక్కడ కుంటే లేదన్నట్లుగా మార్చేందుకు పక్కా ప్రణాళికతో పనులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎర్రకుంట భూగర్భ జలాలకు ప్రధాన ఆధారంగా ఉండటంతో, దీనిపై కబ్జా కొనసాగితే పరిసర ప్రాంతాల్లోని బావులు, బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని, దాదాపు 100 నుంచి 150 ఎకరాల వ్యవసాయ భూమి తీవ్రంగా ప్రభావితమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చెంజర్ల ఎర్రకుంట వద్ద జరుగుతున్న అక్రమ మట్టి నింపే పనులను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కుంటకు సంబంధించి సర్వే నిర్వహించి హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని, ఆక్రమణలకు పాల్పడుతున్న వారితో పాటు వారికి సహకరిస్తున్న అధికారుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.
జనంసాక్షి 12 Jul 2026 - Page 10 https://epaper.janamsakshi.org/news/13553/6a5297717cde3

కరీంనగర్ బ్యూరో, జూలై 15 (జనంసాక్షి) : మానకొండూరు మండలం చెంజర్ల గ్రామంలోని ఎర్రకుంట ఆక్రమణలపై "జనంసాక్షి"లో ప్రచురితమైన "ఎర్రకుంటపై కబ్జా నీడ.. 150 ఎకరాల సాగుకు ముప్పు" కథనం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. కథనానికి స్పందించిన రైతులు, మత్స్యకారులు ఒకతాటిపైకి వచ్చి నిరసన వ్యక్తం చేయడంతో పాటు మత్స్యకారులు తహసీల్దార్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ యంత్రాంగం వెంటనే స్పందించింది. ఈ వ్యవహారంపై మానకొండూరు తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఎర్రకుంట భూమిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో త్వరలోనే సమగ్ర సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. చెంజర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 670లో ఉన్న ఎర్రకుంట విస్తీర్ణాన్ని ఖచ్చితంగా కొలిచి, ఆక్రమణలకు తావులేకుండా స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే కుంటలో మట్టి పోసి పూడ్చివేస్తున్న పనులను తక్షణమే నిలిపివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

### మత్స్యకారులు, రైతుల హర్షం

జీవనోపాధిని కోల్పోతామనే భయాందోళనల్లో ఉన్న మత్స్య సహకార సంఘ సభ్యులు, సాగునీరు అందక నష్టపోతామని ఆవేదన చెందిన రైతులు, తాసిల్దార్ ఇచ్చిన హామీ పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం అధికారులు త్వరితగతిన సర్వే పూర్తి చేసి, ప్రభుత్వ కుంటను భూబకాసురుల బారినుండి కాపాడాలని కోరుతున్నారు.

# ఐటీ ఎగుమతులు ఢమాల్

- దిగజారుతున్న హైదరాబాద్ ప్రభ
- గోదావరి జలాలు లిఫ్ చేయకుండా బాబుకు దాసోహం
- మండిపడ్డ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



హైదరాబాద్, జూలై15 (జనంసాక్షి) : హైదరాబాద్ అనగానే ఒకప్పుడు చార్మినార్ గుర్తొచ్చేది ..ఇపుడు ఐటీ ,ఫార్మా పరిశ్రమలకు హైదరాబాద్ పేరు గాంచిందని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. వేగంగా పురోగమిస్తున్న నగరాలలో హైదరాబాద్ ఒకటిగా ఉన్న పరిస్థితి నుంచి రేవంత్ పాలనలో దిగజారే దాకా వెళ్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. 2014లో 50 వేల కోట్ల రూపాయలు ఉన్న ఐటీ ఎగుమతులను 2023లో 2 లక్షల కోట్లు దాటేలా కేటీఆర్ శ్రమించారు. 3 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయి నుంచి కేటీఆర్ 9 లక్షల ఐటీ ఉద్యోగాల స్థాయికి కేటీఆర్ హైదరాబాద్‌ను మార్చారు.. ఇపుడు అందరూ సిగ్గుపడేలా పరిస్థితి మారింది. రేవంత్ రెడ్డి 18 గంటలు కష్టపడి ఐటీ పరిశ్రమను చంపేసే పని చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ కు కాగ్నిజెంట్ రాం రాం అన్నది.. 15 వేల నుంచి 20 వేల ఉద్యోగాలు కల్పించే కాగ్నిజెంట్ విశాఖకు తరలుతోంది. కాగ్నిజెంట్‌ను రెండు చోట్ల విస్తరించేలా గతంలో రెండు ఎంఓయూలు కుదిరాయి. అయినా కాగ్నిజెంట్ హైదరాబాద్ నుంచి విశాఖకు మారుతోంది. లోకేష్ దగ్గర ఉన్న మంత్ర దండం ఏమిటీ..? రేవంత్ దగ్గర లేని దేమిటన్నారు. 7 వేల ఐటీ ఉద్యోగాలు తగ్గాయని భట్టి అసెంబ్లీలోనే చెప్పారు. రేవంత్ రెడ్డి ఉద్యోగాలను మింగేస్తున్నారు. కేటీఆర్ సగటున 60 వేల ఉద్యోగాలు పెంచితే రేవంత్ రెడ్డి 6 వేల ఉద్యోగాలు తగ్గిస్తున్నాడు. ఇప్పటికే లక్షా 20 వేల ఉద్యోగాలు కోల్పోయాం. మంత్రి శ్రీధర్ బాబు పరిస్థితి కుడిదిలో పడ్డ ఎలుకలా తయారైంది.. మాట్లాడితే మంత్రి పదవి పోతుంది అనే భయం ఉందన్నారు. ఐటీ మీద ఆధార పడుతున్న వారి పరిస్థితి ఏమిటీ..? దావోస్ పోయి పెద్దపెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి తెచ్చిన పెట్టుబడులపై శ్వేత పత్రం ప్రకటించాలని దాసోజ్ శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. దుర్గం చెరువు దగ్గర నిర్మాణ వ్యర్థాల కుప్ప పెద్దది అవుతోంది. మరో జవహర్ నగర్ డంప్ యార్డ్ తయారవుతోంది. కేటీఆర్ హయాంలో టీఎస్ఐ పాస్‌తో 18 లక్షలకుపైగా ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో వచ్చాయి. కాళేశ్వరం నీళ్లు ఆంధ్రాకే.. ఐటీ పరిశ్రమలు ఆంధ్రకేనా..? రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రా ?ఆంధ్రాకు ముఖ్యమంత్రా ? లేక ఏపీ సీఎం చప్రాసా అంటూ ప్రశ్నలు కురిపించారు. జాబ్ క్యాలెండర్ ఏమైంది..? నిరుద్యోగులు ఉద్యోగాలు అడిగితే గొడ్లను బాదినట్టు బాదుతున్నారు..హిట్లర్ పాలనతో పెట్టుబడులు వస్తాయా ? .. సీఎం రక్తం ,బూతు భాషలతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయా.. ? కాళేశ్వరంతో నీళ్లు ఇయ్యమంటే రక్తం కావాలంటాడు..గోదావరి జలాలు లిఫ్ట్ చేస్తే కేసీఆర్ కు పేరు వస్తుందని రేవంత్ భయపడుతున్నాడని మండిపడ్డారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370